సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 330

గురువారం 20-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

**'ఫసల్ బీమా' స్వచ్ఛందమే**

'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'లో కేంద్రం కీలక మార్పు చేసింది. -5లో



**'టెస్టు' సమయం...**

రేపటి నుంచి వెల్లింగ్టన్‌లో భారత్‌తో న్యూజిలాండ్ తొలి టెస్టు - స్పోర్ట్స్‌లో

● రామ మందిర ట్రస్టు...

## అధ్యక్షుడిగా నృత్యగోపాల్



అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఏర్పాటైన ట్రస్టుకి మహంత్ నృత్యగోపాల్ దాస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చంపాత్ రాయ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రామ మందిర నిర్మాణం కోసం కేంద్రం ఏర్పాటు చేసిన శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు బుధవారం లాయర్ కె.పరాశరన్ నివాసంలో సమావేశమైంది.

- 5లో

● 'పాయింట్స్ బేస్డ్ వీసా'

## యూకేలో కొత్త విధానం




ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ నిపుణులను తమ దేశంలోకి ఆహ్వానించే నూతన పాయింట్స్ ఆధారిత వీసా విధానాన్ని బ్రిటన్ ఆవిష్కరించింది. చవక కార్మికుల వలసలను నిరోధించే దిశగా దీన్ని రూపొందించామని భారత సంతతికి చెందిన యూకే హోంమంత్రి ప్రీతి పటేల్ పేర్కొన్నారు.

- 5లో

● కబళిస్తున్న కోవిడ్

## మృతులు రెండు వేలు



చైనాలో కోవిడ్ 19 మహమ్మారి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారానికి 2,004 కాగా బాధితుల సంఖ్య 74,185కు చేరుకుంది. దేశవ్యాప్తంగా బుధవారం చనిపోయిన 136 మందిలో 132 మంది ఒక్క హుబే ప్రావిన్స్‌కు చెందిన వారేనని ప్రభుత్వం ప్రకటించింది.

- 5లో

# దర్శకుడు శంకర్‌కు తీవ్ర గాయాలు

**భారతీయుడు-2 షూటింగ్‌లో ప్రమాదం**

**సహాయ దర్శకుడు సహా ముగ్గురు దుర్మరణం... పది మందికి గాయాలు**

సాక్షి, చెన్నై: కమల్‌హాసన్ హీరోగా తెరకెక్కుతున్న భారతీయుడు-2 సినిమా షూటింగ్‌లో బుధవారం రాత్రి భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా.. 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. దర్శకుడు శంకర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆయన కాలు ఫ్రాక్చర్ అయింది. మృతుల్లో శంకర్ వ్యక్తిగత సహాయకుడు మధు, సహాయ దర్శకుడు కృష్ణ, కేటరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన చంద్రన్ ఉన్నట్లు తెలిసింది. చెన్నై శివారు పూందమల్లిలోని ఈవీపీ స్టూడియోలో భారతీయుడు-2 చిత్ర షూటింగ్ జరుగుతోంది. ఇక్కడ భారీ క్రేన్‌లతో ప్రత్యేక సెట్టింగ్స్ వేసి చిత్రీకరణ జరుపుతున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో 150 అడుగులున్న క్రేన్ హఠాత్తుగా కిందకు పడిపోయింది. ఆ సమయంలో సమీపంలోని ఓ టెంటులో దర్శకుడు శంకర్ తన అసిస్టెంట్‌లతో కలిసి మానిటర్‌లో రష్‌స్ చూస్తుండగా.. ఈ ఘటన జరిగింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆ సమయంలో చిత్రహీరో కమల్‌హాసన్ సెట్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక కార్యక్రమాలను ఆయన దగ్గరుండి పర్యవేక్షించినట్లు సమాచారం.





చెన్నైలోని ఈవీపీ స్టూడియోలో కింద పడిన క్రేన్. ప్రమాద సమయంలో ఈ టెంట్‌లోనే శంకర్, ఆయన అసిస్టెంట్లు ఉన్నారు

# ఐజేఎస్

## ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్

**న్యాయ వ్యవస్థలో కీలక సంస్కరణ దిశగా కేంద్రం అడుగులు**

- అఖిల భారత సర్వీసుల హోదాలో జిల్లా జడ్జీల నియామక ప్రతిపాదనపై కసరత్తు
- ఇందుకోసం నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ ఏర్పాటుకు యోచన
- లా డిగ్రీ తర్వాత యూపీఎస్సీ ద్వారా ఐజేఎస్‌కు ఎంపిక
- మేజిస్ట్రేట్ పదోన్నతుల కోసం కన్‌ఫర్డ్ సర్వీసులు కూడా..
- హైకోర్టుల పరిధిలోనే ఐజేఎస్ అధికారులు
- హైదరాబాద్‌లో అకాడమీ.. ఇబ్రహీంపట్నం, శంషాబాద్‌లలో స్థలం పరిశీలన!
- మనతో పోటీ పడుతున్న మహారాష్ట్ర



సాక్షి, హైదరాబాద్: న్యాయవ్యవస్థలో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం నాంది పలుకుతోంది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)ల తరహాలో న్యాయ వ్యవస్థలో అఖిల భారత సర్వీసును తెరపైకి తెస్తోంది. ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్) పేరిట జిల్లా జడ్జీలను నియమించే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతోంది. మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో పురుడు పోసుకున్న ఈ ప్రతిపాదనకు మోదీ సర్కారు కార్యరూపం ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రతిపాదనతో మన రాష్ట్రానికి కూడా ప్రమేయం ఉండటం, ఇక్కడే ఐజేఎస్ అధికారులకు శిక్షణనిచ్చేందుకు నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ (ఎన్‌జేఏ)ని ఏర్పాటు చేయాలని కేంద్రం ఆలోచిస్తుండటం విశేషం.

**ప్రస్తుతం నియామకాలు ఇలా...**

న్యాయమూర్తి బాధ్యతల్లో తొలి దశ అయిన జూనియర్ సివిల్ జడ్జి (మేజిస్ట్రేట్), ఆ తర్వాతి దశ అయిన జిల్లా జడ్జీల నియామకాలను హైకోర్టు చేపడుతోంది. పోటీ పరీక్షలు నిర్వహించి ఈ రెండు స్థాయిల్లో న్యాయమూర్తుల పోస్టులను హైకోర్టే భర్తీ చేస్తోంది. ఇక హైకోర్టు న్యాయమూర్తుల కోసం

మిగతా 3వ పేజీలో ▶

● మోదీ సర్‌ప్రైజ్






ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరుగుతున్న 'హునర్ హాట్'ను బుధవారం సందర్శించి.. 'లిట్టిచోఖా' తిని, మట్టిపిడతలో చాయ్ తాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

- వివరాలు 5లో

# టీకాల్లో వెనుకబాటు

**దేశంలో అట్టడుగు స్థానంలో తెలంగాణ**

సాక్షి, హైదరాబాద్: పిల్లలకు టీకాలు వేయడంలో తెలంగాణ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. ఈ మేరకు తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తెలంగాణ 35వ స్థానంలో నిలిచినట్లు తెలిపింది. 2019-20లో ఇప్పటివరకు దేశంలో టీకాలు వేయడంలో తమిళనాడు 148 శాతంతో మొదటిస్థానంలో నిలవగా, అట్టడుగు స్థానంలో సిక్కిం 53.60 శాతం, ఆ తర్వాత తెలంగాణ 54.30 శాతంతో వెనుకబడింది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా, టీకాలు సరఫరా చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో వెనుకబడినట్లు కేంద్రం తెలిపింది. 2018-19లో మాత్రం తెలంగాణ 95.98 శాతం టీకాలు వేసింది. 2017-18లో 88.96 శాతం కవర్ చేసింది. కానీ ఈ ఏడాది

మిగతా 2వ పేజీలో

**54.3%** 2019-20లో పరిమితమైన టీకాలు

**80%** మించని పోలియో టీకాలు

నిర్లక్ష్యంలో వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం

చిన్న పిల్లలకు బీసీజీ, ఓరల్ పోలియో వ్యాక్సిన్, హెపటైటిస్ బీ వ్యాక్సిన్, పెంటావాలెంట్ వ్యాక్సిన్, క్రియారహిత పోలియో వైరస్ వ్యాక్సిన్ (ఐపీవీ), మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్, డిఫ్తీరియా, పెర్టుసిస్-టెటానస్ (టీపీటీ), రోటావైరస్ వ్యాక్సిన్ (ఆర్‌వీవీ) తదితర టీకాలు వేయాల్సి ఉంటుంది.












.. మోదీవైపెట సార్

# అంగట్లో పౌరసత్వం!

- పాతబస్తీలో ఇష్టానుసారంగా గుర్తింపు కార్డుల జారీ
- చవకగా ఓటరు, ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్సులు..
- అక్రమంగా పొందుతున్న మధ్యప్రాచ్యం, మయన్మార్, బంగ్లాదేశీయులు



భారత గుర్తింపు కార్డులతో యెమెన్ జాతీయుడు ముబారక్

సాక్షి, హైదరాబాద్: మీకు భారత పౌరసత్వం కావాలా? మీరు ఏ దేశస్తులైనా ఫర్వాలేదు. అంగట్లో ఆధార్, ముంగిట్లో పౌరసత్వం ఇవ్వడానికి మేం రెడీ..! ఇది ప్రస్తుతం మన భాగ్యనగరంలో చోటుచేసుకుంటున్న ఆందోళనకర పరిస్థితి. దేశ భద్రతను పణంగా పెట్టి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆఖరికి పాస్‌పోర్టు కూడా రూ.10 మొదలుకుని రూ.2 వేలకు అమ్ముతున్న దారుణ స్థితి దాపురించింది. ఇప్పటికే పాతబస్తీలో దాదాపు 400 మంది వరకు అక్రమమార్గంలో ఆధార్‌కార్డులు సంపాదించారంటూ డీజీపీ కార్యాలయం కేంద్ర హోం శాఖకు ఇప్పటికే నివేదించింది. అయినా.. ఇలాంటి కేసులు పాతబస్తీలో

మిగతా 2వ పేజీలో ▶

# 6 నుంచి బడ్జెట్ సమావేశాలు

**మార్చి 10న బడ్జెట్ ప్రవేశపెట్టే చాన్స్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ 2020 వార్షిక బడ్జెట్ సమావేశాలను మార్చి 6 నుంచి నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 24 నుంచి మార్చి 4 వరకు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన తీరుపై రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్లు, చైర్మన్లు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణ ప్రగతి ముగిసిన వెంటనే ఒక రోజు విరామం ఇచ్చి ఆరో తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలా షెడ్యూలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మార్చి 6న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం, మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ చర్చ జరిగే

మిగతా 2వ పేజీలో ▶









epaper.sakshi.com

# ఎట్టకేలకు వీసీ పోస్టుల భర్తీకి కార్యాచరణ

## వచ్చే వారంలో సెర్చ్ కమిటీ సమావేశాలు మార్చి రెండో వారంలో నియామకాలు!

**సాక్షి, హైదరాబాద్:** ఎట్టకేలకు రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్ల నియామకాలు త్వరలోనే జరగనున్నాయి. వీసీల నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్.. అధికారులను ఆదేశించడంతో వీసీల నియామకంపై కదలిక మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేరు. అయితే 10 యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలు ఉండగా, జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు ఇన్‌చార్జి వీసీని కూడా నియమించలేదు. గతేడాది జూన్ 23 నాటికి జేఎన్‌ఏఎఫ్‌ఏయూ, బాసర ఆర్‌జీయూకేటీకి వీసీలు ఉన్నందున, అప్పట్లో జారీ చేసిన వీసీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో వాటిని పేర్కొనలేదు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, మహాత్మాగాంధీ, జేఎన్టీయూ, తెలుగు యూనివర్సిటీ, ఓపెన్ యూనివర్సిటీ వీసీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆయా పోస్టులకు 273 మంది ప్రొఫెసర్లు, 984 దరఖాస్తు ఫారాలు అందజేశారు. ఒక్కొక్కరు రెండు మూడింటికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వ నామినీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో పాటు యూనివర్సిటీల నామినీలను, యూజీసీ నామినీలతో సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిందే తప్ప కమిటీల సమావేశాలు జరగలేదు. సెర్చ్ కమిటీల్లో యూనివర్సిటీ నామినీగా నియమించిన వారి నియామకం చెల్లదని, యూనివర్సిటీల పూర్తి స్థాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లు (ఈసీ) లేకుండా, ఆ ఈసీలు సిఫారసు చేయకుండా పెట్టిన నామినీల నియామకం కుదరదన్న వాదనలు వచ్చాయి. దాంతో సెర్చ్ కమిటీల సమావేశాలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి.. ఈసీల నియామకం కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి గత నెలలోనే పంపింది. ప్రస్తుతం అది ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది. బుధవారం సీఎం ఆదేశాలు జారీ చేసినందున ఈ వారం రోజుల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను నియమించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఆ తర్వాత ఆయా యూనివర్సిటీల నుంచి సెర్చ్ కమిటీల్లో ఉండే యూనివర్సిటీల నామినీల పేర్లను ప్రభుత్వం తెప్పించుకోనుంది. ఆ తర్వాత సెర్చ్ కమిటీలు సమావేశమై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఒక్కో యూనివర్సిటీకి ముగ్గురి పేర్లను ప్రతిపాదించనున్నాయి. మొత్తానికి వచ్చే వారంలో సెర్చ్ కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సెర్చ్ కమిటీలు ప్రతిపాదించిన పేర్లను ప్రభుత్వం యూనివర్సిటీల చాన్స్‌లర్ అయిన గవర్నర్ ఆమోదానికి పంపనుంది. అన్ని అనుకున్నట్లు జరిగితే గవర్నర్ ఆమోదంతో మార్చి రెండో వారంలో కొత్త వీసీలు రానున్నారు.



**ఇవీ యూనివర్సిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు..**

| యూనివర్సిటీ | దరఖాస్తుల సంఖ్య |
|---|---|
| ఉస్మానియా | 114 |
| కాకతీయ | 110 |
| తెలంగాణ | 114 |
| శాతవాహన | 125 |
| పాలమూరు | 122 |
| మహాత్మాగాంధీ | 124 |
| జేఎన్‌టీయూ | 56 |
| తెలుగు యూనివర్సిటీ | 23 |
| ఓపెన్ యూనివర్సిటీ | 142 |
| ఏదైనా ఓకే | 54 |
| మొత్తం | 984 |

### దరఖాస్తు చేసుకోకున్నా..

యూనివర్సిటీల వీసీలుగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు దరఖాస్తు చేసుకోని వారిని కూడా సెర్చ్ కమిటీ ఎంపిక చేసే వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటికి ప్రొఫెసర్‌గా పదేళ్ల అర్హత లేని వారు కూడా 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని భావించారు. ప్రస్తుతం అది సాధ్యమయ్యే పరిస్థితి లేదు. అందుకే వారిని సెర్చ్ కమిటీలు పరిగణనలోకి తీసుకుంటాయా లేదా అన్న విషయంలో చర్చ జరుగుతోంది. అయితే సెర్చ్ కమిటీలు వారి పేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

## 3 వారాల్లోగా వీసీల నియామకం: కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల ఉపకులపతులను (వైస్ చాన్స్‌లర్) నియామక ప్రక్రియను రెండు మూడు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంబంధిత అధికారులను మంగళవారం ఆదేశించారు. వీసీల నియామకానికి వీలుగా వెంటనే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ల నియామకాలు పూర్తిచేయాలని ఆదేశించారు. సెర్చ్ కమిటీ ద్వారా వీరి పేర్లను తెప్పించుకోవాలని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లపై స్పష్టత వస్తే వీసీల నియామక ప్రక్రియకు మార్గం సుగమం అవుతుందన్నారు.



## వరద కాలువకు ఒక టీఎంసీ

### ఎల్లంపల్లి నుంచి తరలించాలని సీఎం ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** శ్రీరాం సాగర్ పునరుజ్జీవ పథకం ద్వారా ఎస్సారెస్పీ వరద కాలువకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను సీఎం కేసీఆర్ బుధవారం ఆదేశించారు. వరద కాలువకు నీరు అందించేందుకు అవసరమైన నిల్వలు ఎస్సారెస్పీలో లేనందున ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేల వినతికి స్పందించిన కేసీఆర్ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా నిర్మించిన ప్రత్యామ్నాయ మార్గాన్ని వరద కాలువకు నీటిని తరలించేందుకు ఉపయోగించాలన్నారు. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం, లక్ష్మీపురం, రాంపూర్, రాజేశ్వరపేట మీదుగా వరద కాలువలోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. తద్వారా బాల్కొండ, జగిత్యాల, చొప్పదండి, కరీంనగర్, వేములవాడ, ధర్మ పురి నియోజకవర్గాల పరిధిలోని ఎస్సారెస్పీ రబీకి నీరందించాలని సీఎం ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్ కుమార్ వెల్లడించారు.

# పథకం ప్రకారమే హత్య!

- మలుపులు తిరుగుతున్న దివ్య హత్య కేసు
- ఘటన సమయంలో గజ్వేల్‌లోనే నిందితుడి ఫోన్ సిగ్నల్స్
- ఆ దిశగానే పోలీసుల విచారణ ముమ్మరం
- వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన వెంకటేశ్
- దివ్యకు, వెంకటేశ్‌కు ముందే పెళ్లైందన్న నిందితుడి తండ్రి
- ఆమెను తానే చదివించానని వెల్లడి



గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వద్ద పోలీసులతో మృతురాలు దివ్య కుటుంబీకుల వాగ్వాదం

**గజ్వేల్/వేములవాడ:** బ్యాంకు ఉద్యోగిని దివ్య హత్యోదంతం మలుపులు తిరుగుతోంది. పథకం ప్రకారమే ఆమె హత్య జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం. మంగళవారం రాత్రి గజ్వేల్‌లోని తమ ఇంట్లో ఒంటరిగా ఉన్న దివ్యపై దాడి చేసి పదునైన ఆయుధంతో గొంతు కోయడంతో ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రేమ పేరుతో గత కొన్నేళ్లుగా వేధిస్తున్న వెంకటేశ్ అనే యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. అయితే, దివ్య, తన కుమారుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నారని, హైదరాబాద్‌లో ఇరువురూ కలిసి కొంతకాలం ఉన్నారని వెంకటేశ్ తండ్రి చెప్పడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్ బుధవారం నేరుగా వేములవాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు.

### పదో తరగతి నుంచే...

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన న్యాలపల్లి లక్ష్మీరాజం, మణెమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. హత్యకు గురైన దివ్య చిన్న కుమార్తె. లక్ష్మీరాజం కుటుంబ పోషణ నిమిత్తం మస్కట్ వెళ్లి ఐదేళ్ల క్రితం తిరిగొచ్చారు. అనంతరం వేములవాడ ఆలయం వద్ద కిరాణా దుకాణం నిర్వహిస్తూ ఓ ప్రైవేటు లాడ్జిని లీజుకు తీసుకొని నడిపేవారు. ఆ సమయంలో దివ్య వేములవాడలోని వెంకటరమణ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదివింది. వేములవాడలోని శాస్త్రినగర్‌కు చెందిన కైరి పరుశురాం, లత దంపతుల కుమారుడు వెంకటేశ్ కూడా అదే పాఠశాలలో పదో తరగతి చదివాడు. అప్పటినుంచే దివ్యను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంటర్ చదివే సమయంలోనూ వేధింపులు కొనసాగించాడని, దీంతో పలుమార్లు వెంకటేశ్‌పై వేములవాడ, ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్లలో తాము ఫిర్యాదు కూడా చేశామని చెబుతున్నారు. అయినా అతడి వైఖరిలో మార్పు రాలేదని, ఓ దశలో దివ్య కోసం ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా.. వెంకటేశ్ కుటుంబీకులు తమ కుటుంబంపై దాడికి ప్రయత్నించారని లక్ష్మీరాజం వెల్లడించారు. దీంతో తాము కొంతకాలం హైదరాబాద్ వెళ్లిపోయామని.. ఆ సమయంలోనే తమ కుమార్తె ఓయూలో డిగ్రీ పూర్తిచేసి, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఉద్యోగం సాధించిందని తెలిపారు. మూడు నెలలుగా గజ్వేల్‌లో పనిచేస్తోందని, అయినప్పటికీ వెంకటేశ్ వేధింపులు ఆగలేదని పేర్కొన్నారు.

### దివ్య కుటుంబీకుల ఆందోళన...

దివ్య మృతదేహానికి పోస్టుమార్టం సందర్భం గా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రివద్ద మృతురాలి కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేశారు. తమకు న్యాయం జరిగేంతవరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమంటూ భీష్మించారు. ఓ దశలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు ఆగయ్యకు మంత్రి కేటీఆర్ ఫోన్ చేసి.. నిందితుడికి త్వరగా శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ఆగయ్య చెప్పడంతో వారు తమ ఆందోళన విరమించి, మృతదేహాన్ని ఎల్లారెడ్డిపేట తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

### కొంతకాలంగా వెంకటేశ్ రెక్కీ?

వరంగల్‌కు చెందిన సందీప్ అనే యువకుడితో దివ్యకు పెళ్లి కుదిరింది. ఈనెల 26న వారి వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో దివ్యపై కక్ష పెంచుకున్న వెంకటేశ్ గత కొంతకాలంగా గజ్వేల్ వచ్చి ఆమెను దూరం నుంచి గమనించడం.. ఇంటివద్ద అనుమానాస్పదంగా తిరగడం చేస్తుండేవాడని పోలీసు విచారణలో బయటపడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం ఆమెను హత్య చేసే ఉద్దేశంతో గజ్వేల్ వచ్చాడని, దివ్య తల్లిదండ్రులు పెళ్లి పనుల నిమిత్తం ఎల్లారెడ్డిపేట వెళ్లారని తెలియడంతో అదను చూసి ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి చంపేశాడని పోలీసులు భావిస్తున్నారు. దివ్య కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటేశ్ ఫోన్ సిగ్నల్స్ ట్రేస్ చేయగా.. ఆ సమయంలో అతడు గజ్వేల్‌లోనే ఉన్నట్టు వెల్లడైంది. దీంతో వెంకటేశ్‌ను పట్టుకునేందుకు గజ్వేల్, వేములవాడలకు రెండు ప్రత్యేక బృందాలను పంపించారు. అనంతరం వెంకటేశ్ తల్లిదండ్రులను విచారణ నిమిత్తం వేములవాడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్ నేరుగా ఠాణాకు వచ్చి లొంగిపోయాడు. దీంతో అతడిని విచారణ నిమిత్తం సిద్దిపేట పోలీసులకు అప్పగించారు.



వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన వెంకటేశ్

### ప్రేమించి పెళ్లి చేసుకున్నారు: పరుశురాం

వెంకటేశ్, దివ్య ప్రేమించి పెళ్లి చేసుకున్నారని అతడి తండ్రి పరుశురాం విలేకరులకు తెలిపారు. ఇరువురూ వేములవాడలోని వెంకటరమణ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారని.. ఆ క్రమంలోనే వారి మధ్య ప్రేమ చిగురించిందని చెప్పారు. పెళ్లి అయిన తర్వాత దివ్య తల్లిదండ్రులు ఆమెను ఇక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. దీంతో తానే స్వయంగా డబ్బులు ఖర్చుచేసి ఆమెను హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంచి చదివించానని చెప్పారు. ఓయూ క్యాంపస్‌లో చదువుతున్న దివ్య.. దిల్‌సుఖ్‌నగర్‌లో ఇంజనీరింగ్ కోచింగ్ తీసుకుంటున్న వెంకటేశ్‌తో కలిసి ఉన్నట్లు వివరించారు. కొంత కాలం ఇద్దరూ బాగానే ఉన్నారని, అయితే.. ఉద్యోగం వచ్చినప్పటి నుంచి దివ్య ప్రవర్తనలో మార్పు కనిపించిందని ఆయన పేర్కొన్నారు. అప్పట్నుంచి తన కుమారుడు వెంకటేశ్ ఇబ్బందులు పడుతున్నాడన్నారు. అదే సమయంలోనే దివ్యకు దూర మైన తల్లిదండ్రులు.. మళ్లీ ఆమెకు దగ్గరయ్యారని తెలిపారు. ప్రేమించి పెళ్లి చేసు కున్న దివ్య దూరమవుతుందని భావించి వెంకటేశ్ మానసిక ఆందోళనకు గురైనట్లు చెప్పారు. నిజానికి తన కుమారుడు పిరికివాడని, హత్య చేసేంత ధైర్యం అతడికి లేదని ఆయన స్పష్టంచేశారు. ఒకరితో మాట్లాడాలంటేనే మొహమాటపడతాడని, అలాంటి వాడు ఏకంగా హత్య చేశాడంటే నమ్మశక్యంగా లేదన్నారు. దివ్యకు మరో పెళ్లి సంబంధం కుదిరినప్పటి నుంచి అతడు మానసిక సంఘర్షణకు గురైన మాట వాస్తవమని పేర్కొన్నారు.

## టీకాల్లో వెనుకబాటు

▶ మొదటి పేజీ తరువాయి

వెనుకబడినట్లు కేంద్రం తెలిపింది.

**విటమిన్ ఏ టీకాలే తక్కువగా...**

యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం కింద గిరిజనులు, మారుమూల ప్రాంతాలలోని ప్రజలకు దేశవ్యాప్తంగా ఉచిత టీకాలు వేస్తారు. మిషన్ ఇంద్రధనుష్, ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్, గ్రామ్ స్వరాజ్ అభియాన్ (జీఎస్ఏ) కింద చిన్న పిల్లలకు టీకాలు వేస్తారు. బీసీజీ, ఓరల్ పోలియో వ్యాక్సిన్, హెపటైటిస్ బీ వ్యాక్సిన్, పెంటావాలెంట్ వ్యాక్సిన్, మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్, డిఫ్తీరి యా, పెర్టుసిస్–టెటానస్ (టీపీటీ), రోటావైరస్ వ్యాక్సిన్ తదితరమైనవి వేయాల్సి ఉంటుంది. అయితే తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం వ్యాక్సి న్లపై పెద్దగా శ్రద్ధ చూపించడం లేదని కేంద్ర నివేదిక చెబుతోంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 80.3 శాతమే పోలియో వ్యాక్సిన్లు వేసినట్లు తేల్చింది. అలాగే తట్టు (మీజిల్స్) టీకాలు 81.9 శాతమే వేశా రు. బీసీజీ టీకాలు 83.6 శాతం మందికి వేశా రు. ఇవిగాక విటమిన్ ఏ టీకాలు మూడు దశ లకు సంబంధించి కేవలం 15 నుంచి 36 శాతం మధ్యే వేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. పోలియో వంటి టీకాలను ఇంటింటికీ తిరిగి వేస్తున్నామని, బస్టాండ్లు, స్కూళ్లు, ఆరుబయ ట ఎక్కడ కనిపిస్తే అక్కడ చిన్న పిల్లలకు వేస్తున్నామని చెబుతున్నా, ఆచరణలో మాత్రం తేడా కనిపిస్తోందని కేంద్రం వెల్లడించింది.

## 6 నుంచి బడ్జెట్ సమావేశాలు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉంది. మార్చి 8 ఆదివారం, మరుసటి రోజు హోళీ పండుగ కావడంతో పదో తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి. 12 పని దినాలను దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేస్తున్నారు. మార్చి 22లోపు బడ్జెట్ సమావేశాలు ముగిసే అవకాశమున్నట్లు సమాచారం. శాసనమండలి సమావేశాలను మాత్రం కేవలం 4 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2019 సెప్టెంబర్ 9 నుంచి 22 వరకు జరిగిన పూర్తి స్థాయి బడ్జెట్ సమావేశాల్లో శాసనసభ 11 రోజులు సమావేశం కాగా, శాసనమండలిలో మాత్రం కేవలం 4 రోజులు మాత్రమే సమావేశాలు జరిగాయి.

## పాడిరైతులకోసం 'కాల్‌సెంటర్'

### 9121213220 నంబర్‌తో ఏర్పాటు చేసిన పశుసంవర్థక శాఖ

**సాక్షి,హైదరాబాద్:** రాష్ట్రంలోని పాడిరైతులకు అందుబాటులో ఉండేందుకు గాను కాల్‌సెంటర్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు పాడి రైతులకు సూచనలు, సలహాలు అందజేసేందుకు గాను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఈ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 9121213220 ఫోన్‌నంబర్‌లో ఈ కాల్‌సెంటర్ అందుబాటులో ఉండనుంది. పశు సంపద కలిగిన రైతులు ఈ నంబర్‌కు ఫోన్ చేసి తమకు కావాల్సిన సహాయాన్ని పశుసంవర్ధక అధికారుల నుంచి పొందవచ్చని మంత్రి తెలిపారు.



## ఆసిఫాబాద్‌లో @ 8 డిగ్రీలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కొన్నిచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్, అదే జిల్లా జిన్నేదారిలలో రాత్రి ఉష్ణోగ్రత 8 డిగ్రీల చొప్పున నమోదైంది. సిర్పూర్, బేలా, లోకారిలలో 9 డిగ్రీలు, అర్లి, మాన్‌గ్రుడ్, సోనాలలో 10 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో వచ్చే 3 రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశముందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు తెలిపారు.



## హుస్సేన్ సాగర్‌లో ఆక్రమణలపై పిల్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ పరిధిలో ఆక్రమణల గురించి పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హుస్సేన్ సాగర్ పరిధిలో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ సామాజిక కార్యకర్త లుబ్నా సార్వత్ రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం బుధవారం దీనిపై విచారణ జరిపింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, జలమండలిలకు నోటీసులు జారీ చేసింది. 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. కాగా, హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ (పూర్తి నిల్వ సామర్థ్యం) పరిధిలో ప్లాట్లను ఏర్పాటు చేశారని, దీని వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని లుబ్నా సార్వత్ తన లేఖలో పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్‌లో పది ఎకరాల వరకూ ఆక్రమణలకు గురైందని, సంజీవయ్య పార్కు వద్ద కూకట్‌పల్లి చానల్‌లో ఆక్రమణలు జరిగాయని తెలిపారు. వీటిని అడ్డుకుని హుస్సేన్ సాగర్‌ను కాపాడాలని కోరారు. స్పందించిన ధర్మాసనం.. హైకోర్టుకు సహాయకారిగా సీనియర్ న్యాయవాది ఎల్.రవిచంద్రన్‌ను నియమించింది. రవిచంద్రన్ క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవ పరిస్థితులపై తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.



# అంగట్లో పౌరసత్వం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతినెలా బయటపడుతూనే ఉండటం గమనార్హం.

### నిఘాలోపం వల్లే..!

హైదరాబాద్‌పై ఇంటెలిజెన్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెడతారు. గతంలో దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడి జరిగినా.. దానికి హైదరాబాద్‌తో ఏదో సంబంధం ఉండటం పరిపాటిగా ఉండేది. ఇటీవల భారత ఆర్మీ లక్ష్యంగా పాకిస్తాన్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ) ప్రయోగించిన హనీట్రాప్.. పాతబస్తీ కేంద్రంగా సాగుతోందని ఢిల్లీలో పోలీసులు గుర్తించి భగ్నం చేసిన విషయం తెలిసిందే. సహజంగానే పాతబస్తీకి విదేశీయుల తాకిడి అధికం. యాత్రికులతో పాటు ఆఫ్రికన్ విద్యార్థులు, మధ్యప్రాచ్య వ్యాపారులు, బంగ్లాదేశ్, మయన్మార్‌కు చెందిన శరణార్థులు వేలాదిమంది ఇక్కడ తలదాచుకుంటారు. వీరిలో శరణార్థులుగా వచ్చినవారిపై సరైన పోలీసు నిఘా కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌తోపాటు తెలంగాణవ్యాప్తంగా దాదాపు 16 వేల మంది శరణార్థులు ఉంటారని అంచనా. అసలు వీరు ఎంత మంది ఉన్నారన్న విషయంపై స్పష్టమైన గణంకాలు కూడా పోలీసుల వద్ద లేవన్న విమర్శలు వినిపించాయి. దీంతో యథేచ్ఛగా గుర్తింపు కార్డులు అడ్డదారిలో సంపాదిస్తున్నారు.

### అక్రమంగా పాస్‌పోర్టులు..

విదేశీయుల వద్ద పాస్‌పోర్టు లాంటి అత్యున్నత గుర్తింపు కార్డులు ఉండటం పలు అనుమానాలకు బీజం వేస్తోంది. శరణార్థుల డేటా పోలీసుల వద్ద లేకపోవడం వల్లే వారికి సులువుగా పాస్‌పోర్టులు దక్కుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. గతంలో పోలీసులు కొందరి వేలిముద్రలు, రక్తనమూనాలు తీసుకున్నారు. తర్వాత ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇదే వారికి కలిసి వస్తోంది. వాస్తవానికి బంగ్లాదేశీయులు, మయన్మార్ దేశస్తులు చూడ టానికి భారతీయుల్లాగానే ఉంటారు. వీరు బిహార్, ఒడిశా, బెంగాల్ నుంచి వచ్చామని చెబుతూ ఈ కార్డులు పొందుతున్నారు. ఆధార్, పాన్, ఓటర్ కార్డులను సులువుగా నెట్ సెంటర్ల ద్వారా సులువుగా సంపాదిస్తున్నారు. (కొందరు నెట్‌సెంటర్ల నిర్వాహకులు ఓటరు కార్డును రూ.10కే దరఖాస్తు చేస్తున్నారు). తర్వాత పాస్‌పోర్టుకు దరఖాస్తు చేస్తున్నారు. కానీ, మధ్యప్రాచ్య దేశాలకు చెందిన కొందరు ఆఫ్రికా జాతీయుల్లా.. చూడగానే వారు విదేశీయులు అని ఇట్టే చెప్పేలా ఉంటారు. అలాంటి వారికి పాస్‌పోర్టులు రావడం చూసి అవాక్కవుతున్నారు. పాతబస్తీలో మయన్మార్, బం గ్లాదేశ్, యెమెన్ దేశాలకు చెందిన శరణార్థుల్లో చాలామంది అక్రమమార్గంలో పాస్‌పోర్టులు సంపాదించారు. వీరిలో కొందరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇంకా పట్టుబడని వారు చాలామందే ఉన్నారని సమాచారం. విదేశీయుల డేటా నిరంతరం నిర్వహించకపోవడం కారణంగా ఈ సమస్య ఉత్పన్నమవుతోందని పోలీసు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పాస్‌పోర్టు జారీ విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.






## మరో 15 గురుకుల డిగ్రీ ప్రిన్సిపాల్ పోస్టులు

- పాత నోటిఫికేషన్ పరిధిలోకే ఈ పోస్టులు
- మొత్తం 34కు చేరిన పోస్టుల సంఖ్య...
- దరఖాస్తుల గడువు వచ్చే నెల 20 వరకు పొడిగింపు

**సాక్షి, హైదరాబాద్:** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గురుకుల డిగ్రీ కాలేజీల్లో 15 ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీకి గురుకులాల రిక్రూట్‌మెంట్ బోర్డు చర్యలు చేపట్టింది. సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 19 ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీకి గత 14వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ పరిధిలోకి ఈ 15 పోస్టులను తీసుకొస్తూ బుధవారం మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీంతో మొత్తంగా 34 గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. ఇందులో 29 పోస్టులను మహిళలకే కేటాయించగా, జనరల్ కేటగిరీలో 5 పోస్టులున్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల షెడ్యూల్‌ను బోర్డు సవరించింది. అభ్యర్థులు వచ్చే నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. అలాగే దరఖాస్తులకు సంబంధించిన మూడు సెట్ల డాక్యుమెంట్లపై సెల్ఫ్ అటెస్టేషన్ చేసి మాసాబ్‌ట్యాంకు డీఎస్ఎస్ భవన్‌లోని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ కార్యాలయంలో వచ్చే నెల 30వ తేదీ సాయంత్రం కార్యాలయంలో అందజేసి, అకనాలెడ్జ్‌మెంట్ పొందాలని పేర్కొంది. సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని గురుకుల డిగ్రీ కాలేజీల్లోని 19 ప్రిన్సిపాల్ (మహిళలు) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు రెండు సొసైటీలున్నందునా సొసైటీ మార్పులపై మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ఎలాంటి ఫీజు లేకుండా తమ యూజర్ ఐడీ పాస్‌వర్డ్ ఉపయోగించి ఈనెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు సొసైటీకి సంబంధించిన మార్పులు చేసుకోవచ్చని వెల్లడించింది. వీటికి సంబంధించి మరిన్ని వివరాలను, జోన్ల వారీగా పోస్టుల వివరాలను తమ వెబ్‌సైట్‌లో ( www.treirb.net, www.telangana.gov.in) పొందవచ్చని వివరించింది.

## పోటీ పరీక్షల కోసం ఆన్‌లైన్ యాప్

**ట్యూటర్స్ ప్రైడ్ యాప్‌ను ప్రారంభించిన హోంమంత్రి**

**సాక్షి, హైదరాబాద్:** విద్యా, ఉద్యోగ, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన 20 రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే 'ట్యూటర్స్ ప్రైడ్'ఆన్‌లైన్ యాప్‌ను హోంమంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు. ఇంజనీరింగ్, మెడికల్, ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, ఎన్‌డీఏ, ఎన్‌టీఎస్ఈ లాంటి పోటీ పరీక్షల కోసం 'ట్యూటర్స్ ప్రైడ్'రూపొందించిన ఈ యాప్‌ను మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాప్ చైర్మన్ అంకం, వైస్‌ప్రెసిడెంట్ వంశీపవన్‌లు మాట్లాడుతూ.. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి కానీ, 8978174444 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి గానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

## అనాథ ఆశ్రమాల వసతులపై నివేదిక ఇవ్వండి

**ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అనాథ ఆశ్రమాల సంరక్షణ గృహాల్లో వసతులపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అనాథ ఆశ్రమం వారీగా వివరాలు తెలియజేయాలని నోటీసులు జారీచేసింది. కరీంనగర్ జిల్లాలోని వెలిచాల, సవధార్ ప్రాంతాల్లోని అనాథ ఆశ్రమాల్లో వసతులు లేకపోవడంపై జిల్లా జడ్జి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యం(పిల్)గా పరిగణించి విచారణ చేపట్టింది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, హోంశాఖలకు, కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు నోటీసులిచ్చింది. ఈ మేరకు బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. అనాథ ఆశ్రమాల్లో కనీస వసతులు లేకపోవడంపై గతంలో దాఖలైన ఒక పిటిషన్ కోర్టు విచారణలో ఉందని న్యాయవాది రవిచంద్ర కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి ఎమికస్‌క్యూరీ ఉన్నారని కూడా ఆయన గుర్తుచేశారు. తాజాగా ఈ వ్యాజ్యాన్ని పాత వ్యాజ్యాలతో కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది.

## 'పాత పింఛన్ విధానం అమలు చేయండి'

**సాక్షి, హైదరాబాద్:** డీఎస్సీ–2013 నోటిఫికేషన్ ప్రకారం పరీక్ష రాసి ఎంపికై 2005 అక్టోబర్‌లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం వర్తింపచేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు కె.జంగయ్య, సీహెచ్ రవి కోరారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2004 జనవరి 1వ తేదీకి ముందు అపాయింట్‌మెంట్ ఖరారైనా.. ఆ తర్వాత పోస్టింగులు పొందిన వారికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వినతిపత్రంలో ప్రస్తావించారు. 2002, 2003 డీఎస్సీల్లో ఎంపికై 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పోస్టింగులు పొందిన వారికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు.

## సూడాన్ దేశస్తురాలి వద్ద బంగారం పట్టివేత

**హైదరాబాద్:** దుబాయ్ నుంచి వచ్చిన ఓ సూడాన్ దేశస్తురాలు అక్రమంగా బంగారం తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆ మహిళ కదలికలను అనుమానించిన కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడంతో షూ సాక్సుల్లో దాచి తీసుకొస్తున్న బంగారం బయటపడింది. పట్టుబడ్డ బంగారం విలువ రూ.12 లక్షల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాబార్డ్ చైర్మన్‌గా గుంటూరు జిల్లా వాసి



**సాక్షి, అమరావతి:** జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) చైర్మన్‌గా ఏపీలోని గుంటూరు జిల్లా వాసి చింతల గోవింద రాజులు ఎన్నికయ్యారు. ఐఏఎస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా మొత్తం 31 మంది ఈ పదవికి పోటీ పడగా ప్రస్తుతం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న గోవింద రాజులును బ్యాంకుల బోర్డ్ బ్యూరో (బీబీబీ) ఎంపిక చేసింది. ఆయన అనుభవం, బ్యాంకింగ్ కార్యక్రమాల్లో ఆయన పని తీరును పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీబీబీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు జిల్లా పొన్నూరుకు సమీపంలోని బ్రాహ్మణకోడూరు ఆయన స్వగ్రామం. గుంటూరు నగరంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు, జేకేసీ కాలేజీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ (అగ్రి), ఎంఎస్సీ (అగ్రానమీ) చదివారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో సీడ్ టెక్నాలజీలో పీజీ పూర్తి చేశారు. 1985లో నాబార్డులో నేరుగా గ్రేడ్ బీ అధికారిగా క్యాంపస్ రిక్రూట్ అయ్యారు. 35 ఏళ్లుగా నాబార్డ్‌లో వివిధ హోదాలలో పని చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలలో ప్రతి మార్పునకు నాబార్డ్ ద్వారా సహాయ సహకారాలను అందించారు. నాబార్డ్ చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా ఆ యన సాక్షి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇతోధికంగా పాటుపడతానన్నారు. నాబార్డ్ అందించే పథకాల్లో తెలుగు రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తానని చెప్పారు.

# మార్చిలో పీఆర్‌సీ అమలు చేయండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉద్యోగ సంఘాల జేఏసీ విజ్ఞప్తి
- రిటైర్‌మెంట్ వయస్సు పెంపుపైనా చర్యలు చేపట్టాలని విన్నపం
- వేతన సవరణ నివేదిక వెంటనే తెప్పించుకునేందుకు సీఎస్ హామీ

**సాక్షి, హైదరాబాద్:** ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన పీఆర్‌సీ నివేదిక వెంటనే తెప్పించుకొని వచ్చే నెలలో అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఉద్యోగ సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. పీఆర్‌సీ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఇక పీఆర్‌సీ రాదేమోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని జేఏసీ పేర్కొంది. బుధవారం సచివాలయంలో సోమేశ్‌కుమార్‌ను జేఏసీ చైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వి.మమత, టీఎన్‌జీవో, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, ఎ.సత్యనారాయణ, ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాల నేతలను పిలిపించుకొని పీఆర్‌సీని ప్రకటిస్తామని, పదవీ విరమణ వయస్సును పెంచుతామని సీఎం హామీ ఇచ్చారని.. ఆ హామీలను వెంటనే నెరవేర్చాలని సీఎస్‌ను కోరామన్నారు. పీఆర్‌సీని ఒక్క వేతన సవరణ కోసం వేయలేదని, ఉద్యోగుల అనేక విషయాలపై స్టడీ కోసం ఏర్పాటు చేశారన్నారు. ఆ స్టడీ పూర్తి కానందునే పొడిగించారన్నారు. పీఆర్సీ నివేదిక సిద్ధంగా ఉందని, నెల లోపల కమిషన్ రిపోర్ట్ అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఒకవేళ పీఆర్‌సీ ప్రకటించకపోతే పోరాటం చేస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కింది స్థాయి ఉద్యోగులకు ఇవ్వాలని కోరామని వారు చెప్పారు. గడువు పెంపుపై ఆందోళన వద్దని సీఎస్ చెప్పారని వెల్లడించారు. వేతన సవరణకు ఈ గడువుతో సంబంధం లేదని చెప్పారన్నారు. పీఆర్‌సీ ఒక్కటే కాకుండా సర్వీసు రూల్స్ సవరణ, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో కేడర్ స్ట్రెంత్ ఖరారుకు గడువును పెంచామని చెప్పారన్నారు. వేతన సవరణకు సంబంధించి నివేదికను వెంటనే తెప్పించుకుంటామని, సీఎం ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతుందని హామీ ఇచ్చారన్నారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఉద్యోగ సంఘాల జేఏసీ భేటీ అవుతుందని నేతలు వివరించారు.



సీఎస్ సోమేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు

## 27 శాతం ఐఆర్ ప్రకటించాలి: పీఆర్‌టీయూ-టీఎస్

వేతన సవరణ కమిషన్ గడువు పొడిగించినందున ప్రభుత్వం వెంటనే 27% మధ్యంతర భృతిని (ఐఆర్) ప్రకటించి అమలు చేయాలని పీఆర్‌టీయూ–టీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు.. సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కోరారు. వారు బుధవారం సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. వేతన సవరణకు ఇంకా సమయం పట్టనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఐఆర్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని.. ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళనను తొలగించాలని కోరారు.

# రేపటి నుంచే పీఈసెట్ దరఖాస్తులు

**సెట్స్ కమిటీ సమావేశంలో నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పీఈసెట్–2020 నోటిఫికేషన్‌ను ఈనెల 21న జారీ చేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన పీఈసెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు స్వీకరించాలని నిర్ణయించింది. బీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్ష రాసే అభ్యర్థికి 2020 జూలై 1వ తేదీ నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. దాంతో పాటు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. డీపీఈడీ కోర్సులకు ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న వారు, ఇంటర్ పూర్తయిన వారు ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2020 జూలై 1వ తేదీ నాటికి సదరు విద్యార్థికి 16 ఏళ్లు నిండి ఉండాలి. మే 13వ తేదీ నుంచి నిర్వహించే ఈ పరీక్షకు హాజరు కావాలనుకునే విద్యార్థులు రూ.800 పరీక్ష ఫీజును, ఎస్సీ, ఎస్టీలైతే రూ.400 పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాలను https://pecet.tsche.ac.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు.



### ఇదీ పీఈసెట్ షెడ్యూల్..

- **21–2–2020న:** నోటిఫికేషన్; **21–2–2020 నుంచి:** ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సబ్మిషన్
- **13–4–2020:** ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల సబ్మిషన్‌కు చివరి గడువు
- **20–4–2020 నుంచి:** హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- **22–4–2020 వరకు:** రూ. 500 ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **29–4–2020 వరకు:** రూ. 2 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **6–5–2020 వరకు:** రూ. 5 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్‌కు చివరి గడువు
- **8–5–2020 నుంచి:** ఆలస్య రుసుముతో దరఖాస్తులు సబ్మిట్ చేసిన వారి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- **13–5–2020 నుంచి:** ఫిజికల్ టెస్టులు ప్రారంభం, అభ్యర్థుల సంఖ్యను బట్టి రోజులను నిర్ణయిస్తారు. టెస్టులు పూర్తయ్యాక వారంలో ఫలితాలను ప్రకటిస్తారు.

## మే 28 నుంచి పీజీఈసెట్ పరీక్షలు

ఎంఈ/ఎంటెక్/ఎం.ఆర్క్/ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పీజీఈసెట్ నోటిఫికేషన్‌ను మార్చి 4వ తేదీన జారీ చేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఆన్‌లైన్ దరఖాస్తులను వచ్చే నెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్వీకరించనుంది. ఆలస్య రుసుముతో మే 26వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. పరీక్షలను మే 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనుంది. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు దఫాలుగా ఆన్‌లైన్‌లో పరీక్షలను నిర్వహించనుంది. హైదరాబాద్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొంది. 28న ఉదయం ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, మైనింగ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు పీజీఈసెట్‌ను నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్‌కు పరీక్ష ఉంటుంది. 29న ఉదయం జియో ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఫార్మసీకి పరీక్ష ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ప్రవేశాలకు పరీక్ష ఉంటుంది. 30న ఉదయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్‌కు, అదేరోజు మధ్యాహ్నం సివిల్, ఎలక్ట్రికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీకి పరీక్ష నిర్వహిస్తారు. 31వ తేదీన ఉదయం ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, మధ్యాహ్నం నానో టెక్నాలజీకి ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తారు. 120 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షల్లో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు, మల్టిపుల్ చాయిస్ జవాబులుంటాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు, ఇతర వివరాలను https://www.pgecet.tsche.ac.in, http://www.tsche.ac.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.1,000గా సెట్ కమిటీ నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులైతే రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

### పీజీఈసెట్ షెడ్యూల్...

- **4-3-2020న:** నోటిఫికేషన్
- **12-3-2020 నుంచి:** ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సబ్మిషన్
- **30-4-2020:** దరఖాస్తుల సబ్మిషన్‌కు చివరి గడువు
- **6-5-2020 వరకు:** రూ. 500 ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **13-5-2020 వరకు:** రూ. 2 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **20-5-2020 వరకు:** రూ. 5 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **26-5-2020 వరకు:** రూ. 10 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల సబ్మిషన్
- **20 నుంచి 27 వరకు:** హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- **28 నుంచి 31 వరకు:** పీజీఈసెట్ పరీక్షలు
- **15-6-2020:** ఫలితాల వెల్లడి.

# ఐజేఎస్

▶ మొదటి పేజీ తరువాయి

కొలీజియం ఏర్పాటు చేసి భర్తీ చేస్తున్నారు. ఇప్పుడు జిల్లా జడ్జీల నియామకాలను హైకోర్టు నుంచి కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా చేపట్టాలనేది కేంద్రం ఆలోచన. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షకు న్యాయవాద డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులవుతారు. ఈ పరీక్ష రాసి ఐజేఎస్‌కు ఎంపికయ్యే విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలోనే శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం నేరుగా వారు జిల్లా జడ్జి లేదా సమాన హోదాలో అఖిల భారత సర్వీసుల్లో చేరిపోతారు.

**స్వయం ప్రతిపత్తి ఎలా?**

ఐజేఎస్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తికి ఎలాంటి భంగం వాటిల్లదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. యూపీఎస్సీ ద్వారా ఐజేఎస్‌కు ఎంపిక చేసినప్పటికీ జిల్లా జడ్జీలుగా వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం, బదిలీలు, సర్వీసు వ్యవహారాలు వంటివి హైకోర్టుల పరిధిలోనే ఉంటాయి. ఈ విషయంలో హైకోర్టుదే తుది నిర్ణయం అవుతుందని చెబుతున్నారు. ఇక జిల్లా జడ్జి కంటే దిగువన ఉండే జూనియర్ సివిల్ జడ్జీల నియామకాలను ఎప్పటిలాగే హైకోర్టులే చేపడతాయి. ఐజేఎస్‌కు ఎంపికై జిల్లా జడ్జిలుగా నియమితులైన వారు పదోన్నతులపై హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు. సీనియారిటీ ప్రాతిపదికన వారి నియామకాలు ఉంటాయి. ఐజేఎస్ వ్యవస్థ ఏర్పాటుపై ఇప్పటికే జాతీయ స్థాయిలో చర్చ ఊపందుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రాథమిక స్థాయిలోనే ఉన్నప్పటికీ సర్వీసు ఏర్పాటులో వచ్చే సానుకూల, ప్రతికూలతలపై న్యాయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. జిల్లా జడ్జీల నియామకాలను యూపీఎస్సీ ద్వారా చేపడితే జూనియర్ సివిల్ జడ్జీలుగా నియమితులయ్యే వారు సర్వీసు, పనితీరు ఆధారంగా ఐజేఎస్‌కు ఎంపికవుతారు. వారు జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌లలో ఉన్నట్లుగానే ఐజేఎస్‌లో కూడా మేజిస్ట్రేట్ల పదోన్నతుల కోసం కన్‌ఫర్డ్ సర్వీసు ఉంటుందని, అయితే ఎంత శాతం ఉంటుందన్నదే తేలాల్సి ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు.

**ఇప్పుడేం జరుగుతోంది?**

నేషనల్ జ్యుడీషియల్ అకాడమీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలన్నది కేంద్రం ఆలోచనగా కనిపిస్తోంది. ఐఏఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థ ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో ఉండగా ఐపీఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చే నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ) హైదరాబాద్‌లోనే ఉంది. జ్యుడీషియల్ శిక్షణకు కూడా దక్షిణాదిలోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నది కేంద్రం భావనగా కనిపిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకే కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందన్న అపప్రథ నుంచి బయటపడటం కోసం ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థను దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏర్పాటు చేయాలనే ఆలోచనతో హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మహారాష్ట్ర కూడా దీని కోసం శతథా ప్రయత్నాలు చేస్తోంది. తమ రాష్ట్రంలోనే ఎన్‌జేఏ వస్తోందని, ఇందుకు స్థలం ఇచ్చేందుకు కూడా తాము సిద్ధమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఇటీవలే ప్రకటించారు. అయితే హైదరాబాద్‌లో ఈ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఇటీవల స్థల పరిశీలన కూడా జరిగింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులు ఇబ్రహీంపట్నం, శంషాబాద్ మండలాల్లో అనువుగా ఉన్న రెండు చోట్ల స్థలాలను పరిశీలించారు. దీంతో ఇప్పుడు ఎన్‌జేఏ హైదరాబాద్‌లో ఏర్పాటవుతుందా లేక మహారాష్ట్ర తీసుకెళ్తుందా? అన్నది రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**వాజ్‌పేయి హయాంలోనే తెరపైకి...**

వాస్తవానికి న్యాయ వ్యవస్థ అఖిల భారత సర్వీసు తీసుకురావాలన్న అంశం వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ హయాంలోనే తెరపైకి వచ్చింది. సుశిక్షితులైన న్యాయ విద్యార్థులను దేశం ఉపయోగించుకోలేకపోతోందని, న్యాయ శాస్త్రాన్ని ఔపోసన పట్టిన యువతరం కార్పొరేట్లకు, విదేశాలకు సేవలందిస్తోందని, వారిని దేశ న్యాయ వ్యవస్థలో మిళితం చేయాలనే ఆలోచనతోనే ఈ ప్రతిపాదనను అప్పట్లో తీసుకువచ్చారు. అయితే సివిల్ సర్వీసెస్ ద్వారా వివిధ రాష్ట్రాల్లో నియమితులయ్యే జడ్జీలకు స్థానిక భాష సమస్యగా మారుతుందని, నిరక్షరాస్యులైన కక్షిదారులను అర్థం చేసుకోవడం, వారి వాదనలను వినడం సమస్యగా మారుతుందనే ఆలోచనతో అప్పట్లో 14 రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకించాయి. అయితే అఖిల భారత సర్వీసు అధికారులు స్థానిక మాతృభాషను కచ్చితంగా నేర్చుకోవాలన్న నిబంధన ఉండటంతోపాటు ప్రస్తుత పరిస్థితుల్లో భాష నేర్చుకోవడం సమస్య కాదనే ఉద్దేశంతోనే మళ్లీ ఇప్పుడు ఐజేఎస్‌ను కేంద్రం తెరపైకి తెస్తోంది.

### చాలా మంచి పరిణామం...

ఇది చాలా మంచి పరిణామం. దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. న్యాయ వ్యవహారాల్లో స్థానిక జోక్యం తగ్గుతుంది. భాషా సమస్య ఎదురవుతుందని కొందరు అంటున్నారు. కానీ బ్రిటిష్ హయాంలోనే మన వాళ్లు భాషా సమస్యను అధిగమించారు. అందువల్ల భాష పెద్ద సమస్యే కాదు. మొత్తంమీద న్యాయ వ్యవస్థ మరింత మెరుగ్గా పనిచేయడానికి ఈ ప్రతిపాదన దోహదపడుతుంది.

– జస్టిస్ ఎస్.రామలింగేశ్వర్‌రావు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి

### లా పట్టభద్రులకు గొప్ప అవకాశం..

ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల నుంచే 50 వేల మంది లా డిగ్రీలు పొందుతున్నారు. లా విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం. ప్రతిష్టాత్మకమైన జాతీయ న్యాయ సంస్థల్లో చదువుకున్న వారిలో జడ్జీలుగా ఒక శాతం మంది కూడా వెళ్లడం లేదు. ఐజేఎస్ ద్వారా ప్రతిభగల న్యాయ విద్యార్థులకు జిల్లా జడ్జీలుగా అఖిల భారత సర్వీసుల్లోకి వెళ్లే అవకాశం వస్తుంది.

– ఎం. సునీల్ కుమార్ (భూమి సునీల్), నల్సార్ యూనివర్సిటీ అనుబంధ ఆచార్యులు

## అమెరికాలో ప్రధాన న్యాయమూర్తిగా భారతీయుడు

**వాషింగ్టన్:** భారత సంతతికి చెందిన జస్టిస్ శ్రీనివాసన్ (52) అమెరికాలోని ద్వితీయ ఉన్నత న్యాయస్థానం కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ డీసీ సర్క్యూట్‌కి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టుకు దిగువ స్థానంలోని ఫెడరల్ కోర్టుకి ప్రధాన న్యాయమూర్తి అయిన శ్రీనివాసన్ దక్షిణాసియాలోనే ఈ పదవిని అధిరోహించనున్న తొలివ్యక్తి కావడం విశేషం. చండీగఢ్‌లో పుట్టిన శ్రీనివాసన్ లారెన్స్, కాన్సాస్‌లలో పెరిగారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి బీఏ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్ నుంచి జ్యుడీషియల్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేశారు. గ్రాడ్యుయేషన్ అనంతరం అమెరికా కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ న్యాయమూర్తి జె.హార్వి విల్కిన్సన్ త్రీకి గుమస్తాగా పనిచేశారు. యూఎస్ సుప్రీంకోర్టు జస్టిస్ సాండ్రే డే ఓ కానర్‌కు న్యాయగుమస్తాగా పనిచేశారు. 2011 నుంచి యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ నియామకయ్యేవరకు యునైటెడ్ స్టేట్స్‌కి ప్రిన్సిపల్ డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. యునైటెడ్ స్టేట్స్ సుప్రీంకోర్టు ఎదుట శ్రీనివాసన్ 25 కేసులను వాదించారు.






## అవినీతి కేసులో మాజీ ఆర్‌ఐకి రెండేళ్ల జైలు

సాక్షి, హైదరాబాద్: అవినీతి కేసులో పెబ్బేరు మాజీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)కి అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2011లో మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలంలో మహమ్మద్ షఫీ ఆర్‌ఐగా ఉన్నాడు. నాగరాల గ్రామానికి చెందిన కళా ప్రభాకర్‌కు భూమి విషయంలో అనుకూల నివేదికిచ్చేందుకు మహమ్మద్ రూ.25 వేలు లంచం అడిగాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో.. మహమ్మద్‌ను లంచం తీసుకుంటుండగా పట్టించాడు. ఈ కేసుపై వాదనలు ముగిసిన నేపథ్యంలో ఏసీబీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం మహమ్మద్ షఫీకి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు ఏసీబీ డీజీ పూర్ణ చంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏబీకే ప్రసాద్‌కు ఏఎన్‌యూ గౌరవ డాక్టరేట్



ఏఎన్‌యూ (గుంటూరు): సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ ఏబీకే ప్రసాద్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్స్‌లర్ విశ్వభూషణ్ హరిచందన్ ఖరారు చేశారని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తెలిపారు. ఈనెల 27వ తేదీన జరిగే ఏఎన్‌యూ 35, 36వ స్నాతకోత్సవంలో ఏబీకే ప్రసాద్‌కు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

# రగ్బీ టీం కోసం దొంగయ్యాడు!

- రైళ్లలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న హోంగార్డు అరెస్ట్
- 116 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.50 లక్షల నగదు స్వాధీనం
- నిందితుడు రిమాండ్‌కు తరలింపు

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణికులను టార్గెట్ చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ తాత్కాలిక హోంగార్డును నిజామాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ అనురాధ మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మోహన్‌దేవ్‌రావు చావన్ (28) వృత్తిరీత్యా నాందేడ్ జిల్లాలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఇతనికి రగ్బీ ఆట అంటే చాలా ఇష్టం. ఒక టీంను తయారు చేసి రగ్బీ ఆడిపించాలనే ఉద్దేశ్యంతో పలువురికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేవాడు. ఈ క్రమంలో గేమ్‌కు సంబంధించి బాల్స్, డ్రెస్‌లు, ఇతర మెటీరియల్స్‌కు డబ్బులు లేకపోవడంతో ఈజీ మనీకి అలవాటుపడ్డాడు. నాందేడ్ జిల్లాలోని చిక్కల తండాకు చెందిన ప్రదీప్‌తో కలిసి చైన్ స్నాచింగ్‌లు ప్రారంభించాడు.

### ఏడాది కాలంలో ఒకే ట్రైన్‌లో 8 స్నాచింగ్‌లు....

2019, ఫిబ్రవరి నుంచి చైన్ స్నాచింగ్‌లు ప్రారంభించిన వీరు ఏడాదిలో 8 చోరీలు చేశారు. బాసర రైల్వే స్టేషన్‌లో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులోనే ఈ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ట్రైన్ స్టార్ట్ అయ్యే సమయానికి మహిళల మెడలోంచి మంగళసూత్రాలను స్నాచింగ్ చేస్తూ పారిపోతుండేవారు. దొంగిలించిన ఆభరణాలలో కొన్ని ముంబైకి వెళ్లి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మిగతా వాటిని విక్రయించేందుకు మోహన్ దేవ్‌రావు నిజామాబాద్ వచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి అతన్ని పట్టుకున్నారు. విచారణ జరుపగా స్నాచింగ్‌లను ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి 116 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ప్రదీప్‌తో పాటు బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్న వారి కోసం గాలిస్తున్నామని అనురాధ తెలిపారు. దొంగను పట్టుకున్న నిజామాబాద్ రైల్వే పోలీసులకు రివార్డులు అందజేశారు. సహకరించిన ఆర్పీఎఫ్ పోలీసులను అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామ్ నాయక్, ఎస్‌ఐ ప్రణయ్ కుమార్, కానిస్టేబుళ్లు నర్సింగ్ రాథోడ్, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
రహదార్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

e-NIT No. 23/SE (R&B) KNR/ 01 to 04/2019-20 తేది: 13-02-2020

పనుల సంఖ్య (04), పనుల పేర్లు : జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి నుండి ధర్మరాజ్‌పల్లి రోడ్డు వరకు కాలానుగత రెన్యువల్స్, గోల్డ్ స్మిత్ కమ్యూనిటీ హాల్ కొరకు షెడ్ నిర్మాణం, వైశ్య కమ్యూనిటీ కోసం కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు మరియు ఇతర సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : రూ. 1.93 కోట్లు, బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం : 20-2-2020 సా. 4.00 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం : 27-02-2020న మ. 3.30 గం.లు, కమర్షియల్ స్టేజ్ : 27-02-2020న సా. 4.00 గం.లు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అంటే www.tender.telangana.gov.in లో చూడవచ్చును. ఫోన్ నం. 0878-2243754.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఆర్ అండ్ బి) సర్కిల్, కరీంనగర్

DIPR RO.No.2474-DP/CL/Advt/1/2019-20, Dt.19.02.2020



తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ

1) "e" NIT No. 16/Corenet Plan works/DCE(R)/EE(CRN)DEE-10/AEE-6/2019-20, తేది : 08-02-2020,
2) "e" NIT No. 24/EinC(R&B)/SR&CRN/DCE®/EE(RS)/DEE8/AEE11/2019-20, తేది : 14-02-2020కు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సవరణ నోటీసు నంబరు 1, తేది : 18-02-2020.

సవరణ

(R&B) కరీంనగర్ సర్కిల్‌లో ప్లాన్ (DMFT) క్రింద పైన నిర్దేశించిన 1వ 'e' NIT ప్రకారం అంటే పెద్దపల్లి జిల్లాలో 2 పనులకు మరియు R&B వరంగల్ సర్కిల్‌లో DMFT ఫండ్స్ క్రింద పైన నిర్దేశించిన 2వ 'e' NIT ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1 పని కోసం కోరబడిన టెండర్ల స్వీకరణకు ఆఖరు తేదీని వరుసగా 24.02.2020 మరియు 26.02.2020కు బదులుగా 28.02.2020గా చదువుకోవలెను. ఇతర నిబంధనలలో ఎటువంటి మార్పులేదు.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ అండ్ CRN

DIPR Ro. No. 2478-DP/CL/ADVT/1/2019-20, Dt: 19-02-2020



తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (TREIRB)
అనుబంధం

ఈ కార్యాలయంచే జారీచేయబడిన ప్రకటన నం.1/2020, తేది 14.01.2020కి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలో (15) డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఖాళీలు (జనరల్ & మహిళలు) కలుపబడినవి.
దీనికి సంబంధించి అర్హులైన అభ్యర్థులు (జనరల్ మరియు మహిళలు) సవరించబడిన షెడ్యూలు మరియు అన్ని ఇతర వివరాలతో గల సవివరమైన అనుబంధం కోసం బోర్డ్ వెబ్‌సైట్లు (www.treirb.telangana.gov.in మరియు www.treirb.net) చూడవలసిందిగా సూచించబడుతున్నారు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 18.02.2020

సం/- Dr.R.S.ప్రవీణ్ కుమార్, I.P.S
చైర్మన్, TREIRB

DIPR RO.No.681-PP/CL/Advt/1/2019-20, Dt: 19.02.2020



JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
Kukatpally Hyderabad – 500 085, Telangana, India
TS ECET-2020 NOTIFICATION (On behalf of TSCHE)
Engineering Common Entrance Test for Diploma & B.Sc. (Mathematics) Degree Candidates

Computer Based Test (CBT) for Diploma & B.Sc (Mathematics) Degree Candidates will be conducted by JNTUH on behalf of TSCHE for lateral entry admissions in B.E/B.Tech/B.Pharm courses offered for the academic year 2020-21 in the State of Telangana. Submission of Application and Examination of TS ECET– 2020 are in Online mode only. Detailed information regarding Syllabi, List of courses & Procedure is given in the "Instruction Booklet" available in the website https://ecet.tsche.ac.in

| | |
|---|---|
| Online Submission | 24-02-2020 to 28-03-2020 (without late fee) |
| Test Date & Time | 02-05-2020 (Saturday)10.00AM to 1.00PM and 3.00PM to 6.00PM |
| Registration Fee | Rs. 400/- (for SC/ST & PH candidates) and Rs. 800/- (for others) |

Note: This is only a Notification for entrance test. Candidate has to fulfill the eligibility criteria laid down in the relevant G.Os at the time of admission.

Hyderabad. Sd/-
Date : 19.02.2020 CONVENER, TS ECET-2020


# ఒబెసిటీ 'సిటీ'



### ఊబకాయులు హైదరాబాద్‌లోనే ఎక్కువ

**తరువాత స్థానంలో విశాఖ, ఇతర నగరాలు**

**జీవనశైలి, ఆహార అలవాట్లే కారణం**

**'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4'లో వెల్లడి**

సాక్షి, హైదరాబాద్

మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మితిమీరి మద్యం తాగడం, అర్ధరాత్రి విధులు, అధిక పని ఒత్తిడి.. వెరసి ఊబకాయానికి కారణమవుతున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సంస్థ దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో ఎన్‌ఎఫ్‌హెచ్ సర్వే–4 నిర్వహించింది. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యధికంగా 48.07 శాతం మహిళలు, 31.01 శాతం మంది పురుషులు అధిక బరువుతో బాధపడుతున్నట్లు తేలింది. విశాఖపట్నం తరువాత స్థానంలో ఉంది. పురుషులతో పోలిస్తే మహిళల్లోనే బాధితులు ఎక్కువగా ఉన్నారు. అంతేకాక, బాధితుల్లో 28 – 35 ఏళ్ల మధ్య వయస్కులే అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. తెలంగాణలో 28 శాతం మంది మహిళలు, 24 శాతం మంది పురుషులు అధిక బరువుతో బాధపడుతుండగా, రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా హైదరాబాద్‌లో ఒబెసిటీ రేటు నమోదైంది. ప్రస్తుతం నగరంలో నమోదవుతున్న హైపర్‌టెన్షన్, మధుమేహాలకు అధిక బరువే కారణమని సర్వే గుర్తించింది. మొత్తంగా దేశంలోని ప్రతి ఐదుగురు పురుషుల్లో ఒకరు, ప్రతి ఏడుగురు మహిళల్లో ఒకరు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటుండగా, 1.5 కోట్ల మంది చిన్నారులు ఈ సమస్యతో బాధపడుతున్నారు.

### చిన్న చిన్న మార్పులతో..

ఆహార నియమాల్లో చిన్నచిన్న మార్పులతోనే దీర్ఘకాలంలో అధిక బరువును తగ్గించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజుకు 500 క్యాలరీలు తగ్గించుకోవాలనుకుంటే.. తీసుకునే ఆహారంలో 250 క్యాలరీలు, వ్యాయామం ద్వారా 250 క్యాలరీలు తగ్గించాలి. ఇలాచేస్తే నెలకు రెండున్నర కిలోలు తగ్గుతారని పోషకాహార నిపుణులు అశ్వినిసాగర్ తెలిపారు. మనం తీసుకునే ఆహారంలో సగం కూరగాయల ముక్కలు, సగం ఇష్టమైన పదార్థాలు ఉండాలి. తగ్గిన బరువును కాపాడుకోవడం ముఖ్యం. మూణ్నెళ్లలో తగ్గిన బరువును కనీసం 18 నెలలపాటు తిరిగి పెరగకుండా చూసుకోవాలి. అలాగే, బరువు తగ్గించుకునేందుకు చాలామంది మితిమీరి వ్యాయామం చేస్తుంటారు. దీనివల్ల కండరాల్లోని పొటాషియం కరిగి రక్తంలో కలుస్తుంది. దీన్ని మూత్రపిండాలు వడపోయడంలో ఇబ్బందులు ఎదురై కొన్నిసార్లు వ్యాయామం చేస్తుండగానే గుండె ఆగిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**దేశంలోని వివిధ నగరాల్లో అధిక బరువు బాధితులు (శాతాల్లో) (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4 ప్రకారం)**

| నగరం | మహిళలు | పురుషులు |
|---|---|---|
| హైదరాబాద్ | 48.07 | 31.01 |
| విశాఖపట్నం | 41.06 | 40.02 |
| సెంట్రల్ ఢిల్లీ | 35.00 | 17.00 |
| అహ్మదాబాద్ | 34.00 | 29.04 |
| ముంబై | 34.00 | 37.9 |
| బెంగళూరు | 33.04 | 27.04 |
| చెన్నై | 33.06 | 31.03 |

**అధిక బరువుకు కారణాలు**

థైరాయిడ్ హార్మోన్ లోపం, మితిమీరి తినడం, ఒత్తిడికి గురికావడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, మద్యపానం, శీతల పానీయాలు, నూనె, తీపి పదార్థాల అధిక వినియోగం.

**మితంగా ఆహారం, వ్యాయామంతో చెక్**

- రోజూ 40 నిమిషాల నుంచి గరిష్టంగా గంటన్నర వరకు క్రమశిక్షణతో వ్యాయామం
- శారీరక శ్రమకు తగినట్టుగా నిత్యం తినే ఆహారాన్నే తీసుకోవడం
- కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తినడం
- మద్యపానం, శీతలపానీయాలకు దూరంగా ఉండడం
- తీపి, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవడం

### అశాస్త్రీయ పద్ధతులతో అనర్థమే..

కొందరు కష్టపడకుండా బరువు తగ్గాలనుకుంటున్నారు. యోగా, వ్యాయామం వంటి శాస్త్రీయ పద్ధతులకు బదులు తేలికైన అశాస్త్రీయ (వివిధ పౌడర్లు వాడటం, ఉపవాసం పేరుతో రోజుల తరబడి తినకుండా ఉండటం) పద్ధతులను ఎంచుకుంటున్నారు. ఈ విధానంలో తొలుత బరువు తగ్గినట్టనిపించినా, శరీర జీవక్రియలో పెనుమార్పులు సంభవిస్తాయి. తిండి పూర్తిగా మానేస్తే శరీరం కండరాల్లోని శక్తిని వినియోగిస్తుంది. దీంతో కండరాలు క్షీణిస్తాయి. ఎముకలు బలహీనమవుతాయి. కాలేయం పనితీరు దెబ్బతింటుంది. మూత్రపిండాలు, పిత్తాశయంలో రాళ్ల వంటి సమస్యలు ఎదురవుతాయి. బరువు తగ్గేందుకు రోజులో 3 – 4 గంటలపాటు వ్యాయామం చేయడమూ అనర్థమే.

– డాక్టర్ నర్సయ్యగౌడ్, ప్రముఖ బెరియాట్రిక్ సర్జన్

# ఐరిస్‌తోనే ఇక మొబైల్ బ్యాంకింగ్!

- ఓటీపీ విధానానికి చెక్
- నూతన సైబర్ భద్రత విధానానికి కేంద్రం రూపకల్పన
- సైబర్ ఆర్థిక నేరాల నియంత్రణే లక్ష్యం

సాక్షి, అమరావతి: మొబైల్ బ్యాంకింగ్ విధానంలో సైబర్ ఆర్థిక నేరాల నియంత్రణకు కేంద్రం నడుం బిగించింది. వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) విధానానికి బదులు.. ఫేస్/ఐరిస్ గుర్తింపు విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు సైబర్ భద్రత విధానాన్ని రూపొందించి అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఓటీపీ ఆధారంగా నిర్వహిస్తున్న మొబైల్ బ్యాంకింగ్‌లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు ఫోన్లు, బ్యాంకు అకౌంట్లను హ్యాక్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. క్షణాల్లోనే నగదును మరో ఖాతాకు బదిలీ చేస్తున్నారు. మొబైల్ బ్యాంకింగ్ ఖాతాదారులు ఈ విషయాన్ని గ్రహించేలోగానే అకౌంట్లలో నగదు మాయమైపోతోంది.

### త్వరలో జాతీయ సైబర్ భద్రత విధానం

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్‌లో సైబర్ ఆర్థిక నేరాలను సత్వరం అరికట్టాల్సిన అవసరముందని సైబర్ పోలీస్, ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మొబైల్ బ్యాంకింగ్‌లో సైబర్ నేరాలను అరికట్టేందుకు కార్యాచరణకు సన్నద్ధమైంది. సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు ప్రధాన సాధనంగా చేసుకుంటున్న ఓటీపీ నంబర్ విధానాన్ని తొలగించాలని భావిస్తోంది. ఆ స్థానంలో ఖాతాదారుల ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నైజేషన్), ఐరిస్ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర హోంశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. స్మార్ట్‌ఫోన్‌లో సంబంధిత ఖాతాదారుడి ముఖం/ఐరిస్ గుర్తింపును సరిచూశాకే ఖాతా నుంచి నగదు చెల్లింపు జరిగే విధానాన్ని అమలు చేయనున్నారు. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఇప్పటికే రూపొందించి ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ విధానంలో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని సైబర్ పోలీసింగ్ నిపుణులు నిర్ధారించారు. దాంతో ఈ విధానాన్ని అధికారికంగా దేశమంతా అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ ఇప్పటికే రిజర్వ్ బ్యాంకుతో చర్చించింది. మొబైల్ బ్యాంకింగ్ విధానంలో ఫేస్ /ఐరిస్ గుర్తింపు ప్రక్రియను సైబర్ భద్రత విధానంలో పొందుపరచాల్సి ఉంది. అందుకు అవసరమైన జాతీయ సైబర్ భద్రత విధానం–2020ను కేంద్ర హోంశాఖ ఇప్పటికే రూపొందించింది. త్వరలోనే దీనికి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయనుందని అధికారవర్గాలు తెలిపాయి. అనంతరం బ్యాంకులతో సమావేశం నిర్వహించి ఫేస్/ఐరిస్ గుర్తింపుతోనే మొబైల్ బ్యాంకింగ్ నిర్వహించేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయిస్తారని ఓ ఉన్నతాధికారి చెప్పారు. ఈ కొత్త విధానంతో మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టొచ్చని సైబర్ క్రైం పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

### ఆందోళనకర స్థాయిలో ఆర్థిక నేరాల పెరుగుదల

గత ఐదేళ్లలో దేశంలో సైబర్ ఆర్థిక నేరాలు దాదాపు 300శాతం పెరగడం ఆందోళనకరంగా మారింది. ప్రధానంగా 2016 నుంచి ఈ నేరాల తీవ్రత అమాంతంగా పెరుగుతోంది. దేశంలో స్మార్ట్ ఫోన్ల వాడకం పెరగడం, ప్రజలు మొబైల్ బ్యాంకింగ్ వైపు మొగ్గుచూపుతుండటంతో అదే స్థాయిలో సైబర్ నేరాలూ పెరుగుతున్నాయి. గత ఐదేళ్లలో దేశంలో సైబర్ ఆర్థిక నేరాల గణాంకాలిలా ఉన్నాయి..

**సంవత్సరాల వారీగా సైబర్ ఆర్థిక నేరాల సంఖ్య**

| సంవత్సరం | సంఖ్య |
|---|---|
| 2014 | 9,622 |
| 2015 | 11,322 |
| 2016 | 12,317 |
| 2017 | 21,796 |
| 2018 | 27,250 |

# ఎస్పీడీసీఎల్ ఏడీఈ సస్పెన్షన్

- అనుమతి లేకుండా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారని అభియోగం
- రూ.30 కోట్లు విలువ చేసే 4,769 పనుల అప్పగింతపై ఏడీఈ ప్రకటనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్పీడీసీఎల్)లో కాంట్రాక్టు పనుల అప్పగింత తీరును ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమ వేదిక 'ఫేస్‌బుక్'తో పాటు పత్రికలో ప్రకటనలు చేసిన ఏడీఈ డి.కోటేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. సంస్థ సీఎండీ రఘుమారెడ్డి తరఫున రెండ్రోజుల క్రితం జారీ చేసిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. వాటిలో పేర్కొన్న వివరాల ప్రకారం టీఎస్ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం హెచ్‌ఆర్ విభాగం ఏడీఈ డి.కోటేశ్వర్‌రావు ఇటీవల సంస్థ ద్వారా రూ.30 కోట్లు విలువ చేసే 4,769 ట్రాన్స్‌ఫార్మర్ కంచె పనులకు ప్రదీప్ ఎలక్ట్రానిక్స్ అనే కాంట్రాక్టరుకు అప్పగించడాన్ని ప్రశ్నించారు. రేట్లను పెంచుతూ వాటిని అప్పగించడంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఫేస్‌బుక్'లో సుదీర్ఘ ప్రసంగాన్ని పోస్ట్ చేస్తూ, సంస్థకు చెందిన కొందరు ఇంజనీర్లపై ఆరోపణలు చేశారు. దీనిపై సంస్థ యాజమాన్యం మౌనం వహించడాన్ని ప్రశ్నిస్తూ చేసిన ప్రకటన ప్రచురితమైంది. సంస్థ నియమావళిని ఉల్లంఘించారని భావిస్తూ కోటేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నష్టపోయినా పరవాలేదు: ఏడీఈ కోటేశ్వర్‌రావు**

తనపై సస్పెన్షన్ వేటు వేయడంపై కోటేశ్వర్‌రావు స్పందించారు. వ్యక్తిగతంగా నష్టపోయినా సంస్థను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గతంలో తన పనితీరుకు మెచ్చి సంస్థ విజిలెన్స్ విభాగం అవార్డు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు వాస్తవాలు చేరేలా చూడాలని ఓ ప్రకటనలో కోరారు. అక్రమాలను వెలుగులోకి తెచ్చే విజిల్ బ్లోయర్స్‌కు రక్షణ కల్పిస్తూ గతంలో టీఎస్ఎస్పీడీసీఎల్ యాజమాన్యం తెచ్చిన 'విజిల్ మెకానిజమ్ పాలసీ'ని ఉల్లంఘిస్తూ కోటేశ్వర్‌రావును సస్పెండ్ చేశారని 'విజిల్ బ్లోయర్'సంస్థ విమర్శించింది.

## పోషకాహార సమస్యను అధిగమించాలి..

**గవర్నర్ తమిళిసై సౌందరరాజన్**

లాలాపేట: భారతదేశంలో తీవ్రంగా ఉన్న పోషకాహార సమస్యను అధిగమించేందుకు మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరమని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పోషకాహార శాస్త్రవేత్తలకు సూచించారు. బుధవారం తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థలో (ఎన్‌ఐఎన్) జరుగుతోన్న సమగ్ర జాతీయ పోషకాహార సర్వే ప్రాంతీయ డేటా యూజర్ వర్క్‌షాపును ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌ను ఐసీఎంఆర్ ఎన్‌ఐఎన్, పాపులేషన్ కౌన్సిల్, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన భారతదేశానికి పోషకాహారం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. సంప్రదాయ ప్రాంతీయ ఆహార పద్ధతులు పాటించిన మన పూర్వీకులు ఎక్కువ కాలం జీవించారని గుర్తు చేశారు. నేటి తరం పిజ్జా, బర్గర్, చిప్స్, బ్రెడ్ వంటి ఆహార పదార్థాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నేటికి చాలా కుటుంబాలలో పోషకాహారం అందించే విషయంలో లింగ వివక్షను ప్రదర్శిస్తున్నారని.. ఇది సరైంది కాదని అభిప్రాయపడ్డారు. దీనిపై శాస్త్రీయంగా ప్రజలలో ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఈ రెండు రోజుల వర్క్ షాపులో చర్చించిన విషయాలను ప్రభుత్వానికి ఒక నివేదిక రూపంలో సమర్పిస్తామని ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డా.హేమలత తెలిపారు. ఈ సదస్సులో యూనిసెఫ్ ఇండియా ఢిల్లీ ప్రతినిధులు డా.రాబర్ట్ జాన్సస్టన్, డా.ప్రవీణ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ
ఫారం –సి
(చట్టంలోని సెక్షన్ 11 ప్రకారం 10వ మినహాయింపు అనుసరించి)
(నిబంధన 6/12 చూడుము)
(ప్రకటన)

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. జి/295/2020 తేది: 12-02-2020
ఫైల్ నెం. సి/39/2019 తేది: 29-01-2020
గెజిట్ నెం. 28/2020 తేది: 12-02-2020

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలము వేల్పుపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 16-28 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీ క్రింద కి.మీ. 0-850 నుండి కి.మీ. 2.125 వరకు ఓ.టి.2 కాలువ కోసం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎం.ఎస్.నెం.35 (ఐ&సిఏడి), తేది 30.6.2017 ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు మినహాయించిన పరిధిలో ఉన్నందున చాప్టర్-2లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు. కేంద్ర పర్యావరణ శాఖ లేఖ నెం. J-12011/1/2017-IA-R, Government of India, Ministry of Environment, Forest & Climate change (IA.I. Division), dated. 22.12.2017 ద్వారా ఇట్టి ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు ఇచ్చినట్లుగా రిక్విజిషన్ అథారిటీ వారు రిక్విజిషన్ నందు తెలియపరచినారు.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలము వేల్పుపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 16-28 గుంటల భూమి యొక్క వివరముల ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: వేల్పుపల్లి మండలము: తుర్కపల్లి జిల్లా:యాదాద్రి భువనగిరి
కాలువ : కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజి-16 క్రింద కి.మీ. 0.850 నుండి 2.125 వరకు ఓ.టి. 2 కాలువ కోసం

| సర్వే నెం. విస్తీర్ణం (ఎ-గుంటలు) | భూమి రకం (ఖుష్కి/తరి) (పట్టా/ప్రభుత్వ/ఇనాం) | భూసేకరణ చేయు విస్తీర్ణం | పట్టాదారుని పేరు (తండ్రి/భర్త పేరు) | అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) | చెట్లు రకం/నిర్మాణం రకం |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 154 2-12 | ఖుష్కి పట్టా | 2-12 | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | |
| 155 0-12 | ఖుష్కి పట్టా | 0-12 | కదిరి యల్లమ్మ భర్త సత్తయ్య | కదిరి యల్లమ్మ భర్త సత్తయ్య | |
| 156 2-38 | ఖుష్కి పట్టా | 0-20 | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | |
| | | 2-18 | ఇన్నెపల్లి ఇంద్రసేనరెడ్డి తండ్రి రాంరెడ్డి | ఇన్నెపల్లి ఇంద్రసేనరెడ్డి తండ్రి రాంరెడ్డి | |
| 157 1-29 | ఖుష్కి పట్టా | 0-29 | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | ఇన్నెపల్లి సోమిరెడ్డి తండ్రి రాంరెడ్డి | (2) బోర్లు, (6) మామిడి (3) వేప (4) చింత |
| | | 1-00 | ఇన్నెపల్లి ఇంద్రసేనరెడ్డి తండ్రి రాంరెడ్డి | ఇన్నెపల్లి ఇంద్రసేనరెడ్డి తండ్రి రాంరెడ్డి | (1) బోరు |
| 171 4-30 | ఖుష్కి పట్టా | 1-24 | కె.శ్రీనివాస్ రావు తండ్రి వెంకటేశ్వర్లు | కె.శ్రీనివాస్ రావు తండ్రి వెంకటేశ్వర్లు | (8) వేప |
| | | 0-31½ | ఆరిగే చిన్న నర్సయ్య తండ్రి ఐలయ్య | ఆరిగే చిన్న నర్సయ్య తండ్రి ఐలయ్య | |
| | | 0-31½ | ఆరిగే చంద్రయ్య తండ్రి ఐలయ్య | ఆరిగే చంద్రయ్య తండ్రి ఐలయ్య | |
| | | 0-31½ | ఆరిగే రాజమ్మ భర్త రామయ్య | ఆరిగే రాజమ్మ భర్త రామయ్య | |
| | | 0-31½ | రొండ్ల వెంకటిరెడ్డి తండ్రి మల్లారెడ్డి | రొండ్ల వెంకటిరెడ్డి తండ్రి మల్లారెడ్డి | |
| 172 3-23 | ఖుష్కి పట్టా | 2-12 | బద్దం రాంరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | బద్దం రాంరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | (1) బోరు (1) బావి |
| | | 1-11 | గొర్ల సోములు తండ్రి లింగయ్య | గొర్ల సోములు తండ్రి లింగయ్య | (1) బోరు (1) షెడ్ (3) వేప (3) రావి చెట్లు (1) చింతచెట్టు |
| 175 1-04 | ఖుష్కి పట్టా | 0-39 | గుడిపాటి మహేందర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి | గుడిపాటి మహేందర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి | (1) బోరు (1) బావి |
| | | 0-05 | మాటూరి అరుణ భర్త రాంమూర్తి | మాటూరి అరుణ భర్త రాంమూర్తి | |
| పూర్తి విస్తీర్ణం | | 16-28 | | | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పనివేళలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములలో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేసనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / ఆకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏదైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలు గానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినము లోపు జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియచేయవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి భువనగిరి | సం/- సంయుక్త కలెక్టర్ యాదాద్రి భువనగిరి | సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR Ro.No. 1324/LA/PP/Agency/2019-20





# ఎగిరే శ్వేతసౌధం

## ఎయిర్‌ఫోర్స్ వన్

- ట్రంప్ భారత్ టూర్‌లో రాజభోగాలు, శత్రుదుర్భేద్యాలు
- విమానం, కారు, హెలికాప్టర్ అన్నీ ప్రత్యేకతలే
- భద్రతలో నం. 1

**వాషింగ్టన్, న్యూఢిల్లీ**

**ప్రపంచానికే పెద్దన్న దేశం విడిచి వస్తున్నాడంటే ఆయన రాజభోగాలకు కొరతేం ఉండదు. భద్రత అత్యంత కట్టుదిట్టంగా ఉంటుంది. అందుకే ఆయన ప్రయాణించే విమానం, కారు, హెలికాప్టర్ వేటి ప్రత్యేకతలు వాటికే ఉన్నాయి. ఎలాంటి దాడులనైనా తట్టుకుంటాయి. ఆత్మరక్షణ కోసం ఆయుధాలుగా కూడా మారుతాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 24, 25న భారత్‌కు వస్తున్న నేపథ్యంలో ఆయన ప్రయాణ సాధనాలు, వాటి ప్రత్యేకతలు...**




### ఎయిర్‌ఫోర్స్ వన్

- అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ఏ విమాన్నయినా ఎయిర్‌ఫోర్స్ 1 అనే పిలుస్తారు.
- ప్రస్తుతం ట్రంప్ భారత్‌కు వస్తున్న విమానం బోయింగ్ 747–200. ఈ విమానంపై యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అన్న అక్షరాలు, అమెరికా జాతీయ జెండా ఉంటాయి.
- ఈ విమానానికి ఎలాంటి అణుబాంబులనైనా తట్టుకునే సామర్థ్యం ఉంది. దాడి జరిగే అవకాశం ఉందని ఉప్పందితే చాలు మొబైల్ కమాండ్ సెంటర్‌గా మారుతుంది.
- నాలుగు జెట్ ఇంజిన్స్‌తో ఈ విమానం నడుస్తుంది
- గంటకి వెయ్యి కి.మీ కంటే అధిక వేగంతో ప్రయాణిస్తుంది.
- 70 మంది వరకు ప్రయాణించవచ్చు.
- గాల్లోనే ఇంధనాన్ని నింపుకునే సౌకర్యం ఈ విమానానికి ఉండడం ప్రత్యేకత. దీంతో ఎంతసేపైనా ప్రపంచం ఈ చివరి నుంచి ఆ చివరి వరకు చుట్టేయగలదు.
- విమానం లోపల విస్తీర్ణం 4 వేల చదరపు అడుగులు ఉంటుంది. మూడు అంతస్తుల్లో ఈ –విమానాన్ని తయారు చేశారు. వైట్ హౌస్‌లో ఉన్న సదుపాయాలన్నీ ఇందులో ఉంటాయి.
- అధ్యక్ష కార్యాలయం, జిమ్, కాన్ఫరెన్స్ గది, డైనింగ్ రూమ్, అత్యాధునిక సమాచార వ్యవస్థ, సిబ్బంది ఉండేందుకు లాంజ్ సహా సకల సౌకర్యాలు ఉంటాయి.
- ఒకేసారి 100 మందికి వంట చేసే సదుపాయం కూడా ఉంది
- ప్రయాణ సమయంలో ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే అధునాతన వైద్య పరికరాలతో మినీ ఆస్పత్రి, అందుబాటులో వైద్యుడు ఉంటారు.



### అద్దాలే ఆయుధాలు
### ది బీస్ట్

అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి ట్రంప్ 22 కి.మీ. మేర రోడ్డు ప్రయాణం చేస్తారు. ఆ సమయంలో ఆయన తన వెంట తెచ్చుకున్న కారులోనే వెళతారు. బీస్ట్ అని పిలిచే ఈ కారుకి ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

- ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ కారు తొలిసారి వాడకంలోకి వచ్చింది.
- ఈ కారుని కాడలిక్ 1 అని కూడా అంటారు. ప్రపంచంలోనే అత్యంత భద్రతా ఏర్పాట్లున్న కారు ఇదే
- ఇలాంటి బీస్ట్ కార్లు 12 అధ్యక్షుడు వెళ్లే కాన్వాయ్‌లో ఉంటాయి
- 5 అంగుళాల మందం కలిగిన స్టీల్, అల్యూమినియం, టైటానియం, సిరామిక్స్‌తో తయారు చేశారు.
- దాడి జరిగితే కారు కిటికీ అద్దాలే ఆయుధాలుగా మారిపోతాయి. ఈ కారు అద్దాలు అవసరమైతే గుళ్ల వర్షాన్ని కురిపించగలవు
- అమెరికా సీక్రెట్ సర్వీస్‌కు చెందిన వారు మాత్రమే ఈ కారుని నడుపుతారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా తప్పించుకోవాలో, 180 డిగ్రీల్లో కారుని తిప్పడం, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడం వంటి వాటిలో డ్రైవర్‌కి శిక్షణ ఇస్తారు
- ఈ కారు పక్కనే బాంబు పేలినా లోపల ప్రయాణించే అధ్యక్షుడికి ఏమీ కాదు.
- జీవరసాయన దాడుల నుంచి కూడా తట్టుకొనే సౌకర్యం ఈ కారుకి ఉంది.
- రాత్రిపూట ప్రయాణాల్లో కనిపించే నైట్ విజన్ కెమెరాలు, గ్రనేడ్ లాంచర్స్, ఆక్సిజన్ అందించే ఏర్పాటు, అధ్యక్షుడి గ్రూప్ రక్తం .వంటి సదుపాయాలుంటాయి.
- అధ్యక్షుడు ఎక్కడ ఉన్నా, ఏ దేశంలో ఉన్నా ఆ సీటు కారులో కూర్చొనే ఉపాధ్యక్షుడితో మాట్లాడడానికి వీలుగా శాటిలైట్ ఫోన్ ఉంటుంది.



### హెలికాప్టర్..
### మెరైన్ వన్

అమెరికా అధ్యక్షుడు ఏ దేశానికి వెళ్లినా మెరైన్ వన్ హెలికాప్టర్ కూడా వెంట వస్తుంది. ఆయా దేశాల్లో చిన్న చిన్న దూరాలకు, తాను బస చేసే హోటల్‌కి వెళ్లడానికి ఈ హెలికాప్టర్‌ని వినియోగిస్తారు.

- వీహెచ్–3డీ సీ కింగ్ లేదంటే వీహెచ్–60ఎన్ వైట్ హాక్ హెలికాప్టర్లే అధ్యక్షుడి ప్రయాణానికి వినియోగిస్తారు.



- క్షిపణి దాడుల్ని సైతం ఈ హెలికాప్టర్లు తట్టుకుంటాయి. ఆ హెలికాప్టర్‌లో అత్యాధునిక సమాచార వ్యవస్థ ఉంటుంది.
- అధ్యక్షుడి భద్రత కోసం ఒకేసారి అయిదువరకు ఒకే రకంగా ఉండే హెలికాప్టర్లు ప్రయాణిస్తాయి. ఒక దాంట్లో అధ్యక్షుడు ఉంటే, మిగిలినవి ఆయనకు రక్షణగా వెళతాయి.
- అధ్యక్షుడు ప్రయాణిస్తున్న మెరైన్ వన్ ఎటు వెళుతోందో ఈ అయిదు హెలికాప్టర్లు ఒక దానికొకటి సమాచారాన్ని అందించుకుంటాయి.

## ‘ఫసల్ బీమా’ ఇక స్వచ్ఛందమే

- కచ్చితంగా చేరాల్సిన అవసరం లేదు
- 22వ న్యాయ కమిషన్ ఏర్పాటు
- పాడి రైతుల రుణ రాయితీ 2.5 శాతానికి పెంపు
- అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ బిల్లుకు కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక రైతు బీమా పథకం ‘ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)’లో కేంద్రం కీలక మార్పు చేసింది. ఆ పథకంలో చేరడం తప్పనిసరి కాదని, రైతులు ఇకపై అందులో చేరడం స్వచ్ఛందమేనని కేంద్ర కేబినెట్ స్పష్టం చేసింది. పంట రుణాలు తీసుకున్న రైతులు కచ్చితంగా చేరాలన్న నిబంధన ఇప్పటివరకూ ఉండేది. తాజా నిర్ణయంతో, రుణాలు తీసుకున్న రైతులు కానీ, తీసుకోవాలనుకుంటున్న రైతులు కానీ ఈ బీమా పథకంలో అవసరమనుకుంటేనే చేరొచ్చు. రైతు సంఘాలు, పలు రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, కేంద్ర కేబినెట్ బుధవారం దీనికి ఆమోదం తెలిపినట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది. పీఎంఎఫ్‌బీవైతో పాటు రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకంలోనూ తదనుగుణంగా మార్పులు చేశామని అందులో పేర్కొన్నారు. నిరోధించలేని ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఖరీఫ్ పంటలకు 2%, రబీ పంటలకు 1.5%, పండ్ల తోటలు, వ్యాపార పంటలకు 5% ప్రీమియంతో సమగ్రంగా బీమా సౌకర్యం కల్పించేలా పీఎంఎఫ్‌బీవైని రూపొందించారు. పీఎంఎఫ్‌బీవైపై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ బుధవారం తెలిపారు. కేబినెట్ భేటీలో ఆమోదించిన ఇతర నిర్ణయాలు..

- కృత్రిమ గర్భధారణ, ఇతర పునరుత్పత్తికి సంబంధించిన రంగంలోని వైద్య నిపుణులు, క్లినిక్‌లను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా నేషనల్ రిజిస్ట్రీని, రిజిస్ట్రేషన్ అథారిటీని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ‘అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(నియంత్రణ) బిల్’కు కేబినెట్ ఆమోదం తెలిపింది. గర్భంలోని శిశువు లింగ నిర్ధారణకు, పిండం(ఎంబ్రియొ), బీజకణం(గామెట్) అమ్మకానికి కఠిన శిక్ష విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటి అక్రమ వినియోగానికి, అమ్మకానికి మొదటి సారైతే రూ. 10 లక్షలు, మరో సారి అదే నేరానికి పాల్పడితే 12 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించాలని బిల్లులో పేర్కొన్నారు. కృత్రిమ గర్భధారణ కోరుకుంటున్న దంపతులు, అందుకు సహకరిస్తున్న మహిళ కుటుంబం వివరాలను రహస్యంగా ఉంచాలనే, వారి పునరుత్పత్తి హక్కులను రక్షించాలనే ప్రతిపాదనలను కూడా ఈ బిల్లులో పొందుపర్చారు.



- క్లిష్టమైన అంశాల్లో ప్రభుత్వానికి సలహాలిచ్చేందుకు ఉద్దేశించిన 22వ న్యాయ కమిషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మూడేళ్ల కాల వ్యవధితో కొత్త కమిషన్‌ను న్యాయ శాఖ ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, నలుగురు పూర్తిస్థాయి సభ్యులు(సభ్య కార్యదర్శి సహా), ఐదుగురికి మించకుండా తాత్కాలిక సభ్యులు, ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు ఉంటారు.
- పాడి రైతులకు ప్రయోజనం కలిగేలా రూ. 4,558 కోట్లతో రూపొందించిన పథకాన్ని కేబినెట్ ఆమోదించింది. పాడి రైతుల రుణాలకు కల్పించే వడ్డీ రాయితీని 2% నుంచి 2.5శాతానికి పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపిందన్నారు.
- స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) రెండో దశకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 52,497 కోట్ల అంచనా బడ్జెట్‌తో(కేంద్రం, రాష్ట్రాలు కలిసి) 2020–21 నుంచి 2024–25 మధ్య ఈ రెండో దశను అమలు చేస్తారు. అధికారిక లెక్కల ప్రకారం, 2019, అక్టోబర్ 2 నాటికి, అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలు బహిరంగ మల విసర్జన రహితం(ఓడీఎఫ్) అయ్యాయి.
- రూ. 4,496 కోట్ల బడ్జెట్‌తో 2024 నాటికి కొత్తగా 10 వేల ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే, 2024 నుంచి 2028 వరకు వీటి నిర్వహణ కోసం రూ. 2,369 కోట్లకు కేటాయించింది. రైతుల ఆదాయ పెంపు, దిగుబడి ఖర్చు తగ్గింపు లక్ష్యంగా ఇవి పనిచేయనున్నాయి.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

**శ్రీనగర్:** భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఘటన జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా ట్రాల్ ప్రాంతంలో జరిగింది. ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో బలగాలు ట్రాల్ ప్రాంతంలో సోదాలు మొదలుపెట్టాయి. దాగిన ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో బలగా లు ఎదురుకాల్పులు జరిపాయి. ట్రాల్ ప్రాంతంలో ఉగ్ర నేతృత్వం వహిస్తున్న జహంగీర్ అహ్మద్ మృతిచెందాడని అధికారులు తెలిపారు.

## నూతన సీవీసీగా కొఠారి


కొఠారి | బిమల్

**న్యూఢిల్లీ:** నూతన చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా రాష్ట్రపతి కార్యదర్శి సంజయ్ కొఠారి నియామకం కానున్నారు. ఈమేరకు బుధవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ప్రస్తుతం సమాచార కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బిమల్ జుల్కాను కేంద్ర సమాచార కమిషన్‌లో ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) గా ఎంపికచేశారు. వీరిద్దరూ ఐఏఎస్ అధికారులుగా పదవీవిరమణ పొందినవారే. వీరి నియామకాన్ని లోకసభలో కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌధరి వ్యతిరేకించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తర్వాత ఈ నియామక ఉత్తర్వులు వెలువడే అవకాశముంది.

## సమస్యను కలిసి పరిష్కరిద్దాం..

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూ షహీన్‌బాగ్‌లో ఆందోళనలు చేస్తున్న వారిని సుప్రీంకోర్టు నియమించిన మధ్యవర్తిత్వ కమిటీ సభ్యులు బుధవారం కలుసుకున్నారు. నిరసనకారులు తెలిపే సమస్యలను సుప్రీంకోర్టు ముందు ఉంచే బాధ్యత తమదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు న్యాయవాదులు సంజయ్ హెగ్డే, సాధనా రామచంద్రన్‌లతో కోర్టు కమిటీని నియమించింది. పలువురు మహిళలు మాట్లాడు తూ.. తిండి తిప్పలు లేకుండా పోరాడుతున్నామని, కేవలం 100–150 మీటర్ల విస్తీర్ణంలోనే టెంట్ వేసుకొని నిరసన తెలుపుతున్నామన్నారు. రోడ్డును నిర్బంధించింది పోలీసులే అన్నారు.

## మార్చి 28 నుంచి శ్రీరామాయణ ఎక్స్‌ప్రెస్

**న్యూఢిల్లీ:** శ్రీరామచంద్రుడి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు రైల్వేశాఖ ప్రారంభించనున్న ప్రత్యేక రైలు ‘శ్రీరామాయణ ఎక్స్‌ప్రెస్’.. ఢిల్లీ నుంచి మార్చి 28న ప్రారంభమవుతుందని ఐఆర్‌సీటీసీ బుధవారం తెలిపింది. ముందుగా బుక్ చేసుకున్న వారికే అవకాశం ఉంటుందని తెలిపింది. మొత్తం 16 రాత్రులు –17 పగళ్లపాటు సాగనున్న ఈ యాత్రకు ఒక్కొక్కరికీ స్లీపర్ క్లాస్‌లో రూ. 16,065, ఏసీలో రూ. 26,775 చొప్పున ఖర్చవుతుందని చెప్పింది.

## ‘హునర్ హాట్ ’లో మోదీ

### ‘లిట్టి చోఖా’ మట్టి కప్పులో టీ ఆస్వాదించిన ప్రధాని

**న్యూఢిల్లీ:** క్షణం తీరికలేకుండా నిత్యం బిజీగా ఉండే ప్రధాని నరేంద్ర మోదీ హఠాత్తుగా రాజ్‌పథ్‌లోని ‘హునార్ హాత్’లో ప్రత్యక్షమై అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజ్‌పథ్‌లో జరుగుతోన్న ‘హునర్ హాట్’ మేళాను సందర్శించి, కళాకారులతో ముచ్చటించారు. బుధవారం కేంద్ర కేబినెట్ భేటీ ముగిసిన వెంటనే ప్రధాని ‘హునర్ హాట్’కి చేరుకున్నారు. దాదాపు గంటసేపు అక్కడే గడిపిన ప్రధాని లిట్టి చోఖా(పల్లీపట్టీలాంటిది) తిని, మట్టిపిడతలో చాయ్ తాగారు. బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లో ప్రసిద్ధి చెందిన గోధుమ పిండితో తయారు చేసే పల్లీపట్టీని రుచి చూశారు. ఆ తర్వాత ‘కుల్హాద్’లో టీ తాగారు. ఒక స్టాల్‌లోని సంగీత వాద్యాలను వాయించే ప్రయత్నం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ప్రధాని ప్రత్యక్షం కావడంతో అధికారులు అవాక్కయ్యారు. ‘ఆహ్లాదకరమైన మధ్యాహ్నాన్ని‘హునార్ హాత్’లో గడిపాను. హస్తకళలు, తివాచీలూ, వస్త్రాల్లాంటి ఉన్నతమైన ఉత్పత్తులతో పాటు రుచికరమైన ఆహార పదార్థాలను ఇక్కడ ఉంచారు. మీరు సందర్శించండి’’అంటూ ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.


శ్రీ రామజన్మ భూమి ట్రస్ట్ మొదటి సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు నృత్యగోపాల్‌తో ఇతర సభ్యులు

## రామ మందిరం ట్రస్టు అధ్యక్షుడిగా నృత్యగోపాల్

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఏర్పాటైన ట్రస్టుకి అధ్యక్షుడిగా మహంత్ నృత్యగోపాల్ దాస్ ఎన్నికయ్యారు. చంపాత్ రాయ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మందిర నిర్మాణం కోసం కేంద్రం ఏర్పాటు చేసిన శ్రీ రామ మందిర ట్రస్టు బుధవారం లాయర్ కె.పరాశరన్ నివాసంలో సమావేశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర ప్రిన్సిపల్ కార్యదర్శిగా పనిచేసిన నృపేంద్ర మిశ్రాను మందిర నిర్మాణ కమిటీ చీఫ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం చంపాత్ రాయ్ మాట్లాడుతూ.. మందిర నిర్మాణానికి భక్తులు ఇచ్చే విరాళాల కోసం అయోధ్య ఎస్‌బీఐలో ఖాతా తెరుస్తామన్నారు. పుణెకి చెందిన స్వామి గోవింద్ దేవ్ గిరిని కోశాధికారిగా నియమించినట్టు వెల్లడించారు. ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వం తరపున ప్రతినిధిగా హోంశాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్, యూపీ ప్రభుత్వ ప్రతినిధిగా అవినాశ్ అవస్తి, అయోధ్య జిల్లా మెజిస్ట్రేట్ జస్టిస్ అనూజ్‌కుమార్ ఝా హాజరయ్యారు.

## ‘మెజిస్ట్రేట్లు జిల్లా జడ్జీలుగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అర్హులు కారు’

**న్యూఢిల్లీ:** మెజిస్ట్రేట్లు, సివిల్ జడ్జీలు తదితర న్యాయ వ్యవస్థలోని దిగువ విభాగానికి చెందిన వారు జిల్లా జడ్జీల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అర్హులు కారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉన్న కాలంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లా జడ్జీలుగా విధుల్లో చేరిన జ్యుడీషియల్ అధికారులు.. మళ్లీ తమ పాత హోదాకు తిరిగివెళ్లాలని ఆదేశించింది. మెజిస్ట్రేట్లు, సివిల్ న్యాయమూర్తులు మెరిట్‌తో, సీనియారిటీతో పదోన్నతుల ద్వారా కానీ, లిమిటెడ్ కాంపిటీటివ్ పరీక్ష ద్వారా కానీ జిల్లా జడ్జీలుగా నియామకం కావచ్చని పేర్కొంది. సాధారణంగా ఏడేళ్ల పాటు వరుసగా న్యాయవాద వృత్తిలో కొనసాగిన వారు మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లా జడ్జీలు అయ్యేందుకు అర్హులవుతారు. జ్యుడీషియల్ అధికారులుగా విధుల్లో చేరకముందు, ఏడేళ్ల వరుస సర్వీసు ఉన్నప్పటికీ.. వారు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లా జడ్జీలు అయ్యేందుకు అర్హులు కాబోరని ధర్మాసనం స్పష్టం చేసింది. జిల్లా జడ్జీల నియామకానికి సంబంధించిన ఆర్టికల్ 233కి ధర్మాసనం వివరణ ఇచ్చింది.

## యూకేలో ‘పాయింట్స్ బేస్డ్ వీసా’

- కొత్త వీసా విధానాన్ని ప్రారంభించిన కేబినెట్ మంత్రి ప్రీతి పటేల్



**లండన్:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ, అత్యంత తెలివైన నిపుణులను తమ దేశంలోకి ఆహ్వానించే నూతన పాయింట్స్ ఆధారిత వీసా విధానాన్ని బ్రిటన్ బుధవారం ఆవిష్కరించింది. నిపుణులు కాని, చవక కార్మికుల వలసలను నిరోధించే దిశగా ఈ విధానాన్ని రూపొందించామని భారత సంతతికి చెందిన యూకే హోం మంత్రి ప్రీతి పటేల్ పేర్కొన్నారు. ఈ తాజా వీసా విధానం వచ్చే సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. విద్యార్హతలు, ప్రత్యేక నైపుణ్యాలు, వృత్తులు, వేతనాలు.. మొదలైన వాటికి పాయింట్లను కేటాయించి, అవసరమైన అర్హత పాయింట్లు సాధించిన వారికే వీసా ఇచ్చేలా ఈ విధానాన్ని రూపొందించారు. ‘ఈ రోజు చరిత్రాత్మకం. ఈ దేశ పౌరులు కోరుకుంటున్నట్లుగా, పాయింట్ల ఆధారిత వీసా విధానాన్ని ప్రారంభిస్తున్నాం’ అని ఈ సందర్భంగా ప్రీతి పటేల్ పేర్కొన్నారు. తాజా వీసా విధాన ప్రకారం యూకేకి రావాలనుకునేవారు కచ్చితంగా ఆంగ్లం మాట్లాడగలగాలి. అర్హత ఉన్న యాజమాన్యం నుంచి తమ నైపుణ్యానికి సంబంధించిన ఉద్యోగ ఆహ్వానం పొంది ఉండాలి. నైపుణ్యాల ద్వారా వారికి పాయింట్లు వస్తాయి. యూకేలో నిపుణులైన ఉద్యోగుల కొరత అధికంగా ఉన్న రంగాలకు ఉపాధి కోసం వచ్చేవారికి ప్రత్యేక పాయింట్లు ఉంటాయి. వివిధ రంగాల్లో అత్యుత్తమ నైపుణ్యత కలిగినవారికి వెంటనే వీసా ఇచ్చే ఫాస్ట్ ట్రాక్ గ్లోబల్ టాలెంట్ స్కీమ్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని హోం శాఖ వెల్లడించింది. యూకేలోని కంపెనీలు, విద్యా సంస్థల నుంచి ఉద్యోగ ఆహ్వానం లేని ఈయూ దేశాల్లోని నిపుణులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులకు ఈ ఫాస్ట్ ట్రాక్ వీసా విధానం వచ్చే సంవత్సరం నుంచి అమలు చేస్తామన్నారు.

## కోవిడ్ మృతులు 2 వేలు

- 74,185 మందికి వ్యాధి నిర్ధారణ
- జపాన్ ఓడ నుంచి 500 మందికి విముక్తి

**బీజింగ్/టోక్యో:** చైనాలో కోవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారానికి 2,004కు చేరుకోగా, బాధితుల సంఖ్య 74,185కు చేరుకుంది. దాదాపు 25 దేశాల్లోని వెయ్యిమందికి వ్యాధి సోకినట్లు అధికారులు నిర్ధారించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు వ్యాధిబారిన పడడంపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా కారణంగా పౌరులు తమకు కావాల్సిన ఆహారం, నిత్యావసరాలను ఆన్‌లైన్‌లో ఇంటి వద్దకే తెప్పించుకుంటున్నారు. దీంతో ఈ కామర్స్ సంస్థలకు గిరాకీ భారీగా పెరిగిపోయింది. ఇప్పటికే తమ వద్ద ఉన్న 1.80 లక్షల మంది సిబ్బందికి అదనంగా 20వేల మందిని నియమించుకున్నట్లు జేడీ డాట్ కామ్ పేర్కొంది. కోవిడ్ భయంతో జపాన్ తీరంలో 14 రోజులుగా నిలిపి ఉంచిన డైమండ్ ప్రిన్సెస్ ఓడ నుంచి కరోనా లక్షణాలు లేని 500 మంది బయటకు వచ్చారు. ఓడలోని 3,711 మందిలో 542 మందికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణ అయింది.

కోవిడ్ కట్టడిలో చైనా విఫలమైందంటూ ఈ నెల 3వ తేదీన ‘వాల్‌స్ట్రీట్ జర్నల్’ ప్రచురించిన ‘చైనాయే అసలైన రోగి’ (చైనా ఈజ్‌ది రియల్ సిక్ మ్యాన్ ఆఫ్ ఆసియా)కథనంపై ఆ దేశం మండిపడింది. క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌కు వాల్‌స్ట్రీట్ జర్నల్ తలొగ్గక పోవడంతో ఆ పత్రిక రిపోర్టర్లు ముగ్గురికి చైనా దేశ బహిష్కారం విధించింది.



సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 20

## సంచలన 'ఆత్మకథ'

కీలక స్థానాల్లో పనిచేసి పదవులనుంచి తప్పుకున్న వారు రాసే పుస్తకాలకు మంచి గిరాకీ ఉంటుంది. వారు బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో సంచలనాత్మకమైన ఘటనలు జరిగుంటే ఇది మరిన్ని రెట్లు పెరుగుతుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ బారు, కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నట్వర్ సింగ్, కాగ్ మాజీ చీఫ్ వినోద్ రాయ్ తదితరులు రాసిన ఆత్మకథలు చెప్పుకోదగ్గ వివాదం రేపాయి. ఇందులో సంజయ బారు పుస్తకం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' ఆధారంగా అదే పేరుతో చలనచిత్రంగా కూడా వచ్చింది. కనుక ముంబై మాజీ సీనియర్ పోలీస్ అధికారి రాకేశ్ మారియా 'లెట్ మీ సే ఇట్ నౌ' పేరిట వెలువరించిన గ్రంథం అందరిలోనూ ఆసక్తి కలిగించడంలో ఆశ్చర్యం లేదు. ముంబై నగరం ఒకప్పుడు మాఫియా డాన్‌ల అడ్డా. వ్యాపారులను, పారిశ్రామికవేత్తలను, సినీ నటుల్ని బెదిరించి డబ్బులు గుంజడం, మాట విననివారిని కిడ్నాప్ చేయడం, నేర సామ్రాజ్యంపై ఆధిపత్యం కోసం పోరాటాలు అక్కడ నిత్యకృత్యం.

2008 నవంబర్ 26న ముంబై నగరంపై ఉగ్రవాదులు విరుచుకుపడి 173మంది పౌరులను పొట్టనబెట్టుకున్న ఘటన వీటన్నిటినీ తలదన్నింది. కన్నకూతురు షీనా బోరాను పథకం ప్రకారం రప్పించి, తన భర్తతో కలిసి ఆమెను పొట్టనబెట్టుకున్న ఇంద్రాణి ముఖర్జీ ఉదంతం కూడా అక్కడిదే. ఇలాంటి మహానగరంలోని పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా, ప్రత్యేకించి పోలీస్ కమిషనర్‌గా పని చేసిన రాకేష్ ఆత్మ కథ రాశారంటే ఆసక్తి అత్యంత సహజం. పైగా రాకేష్ వివాదాలకు కేంద్ర బిందువుగా వున్నారు. ముంబై ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఐపీఎస్ అధికారి అశోక్ కామ్టే భార్య వినీత తన భర్త మరణానికి రాకేష్ వ్యవహరించిన తీరే కారణమని ఆరోపించారు. ఆ రోజు పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌చార్జిగా వున్న రాకేష్ సరిగా మార్గదర్శకత్వం చేయనందువల్లే అశోక్ ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు బలయ్యారని ఒక పుస్తకంలో ఆమె చెప్పారు. అప్పట్లో రాకేష్ ఈ ఆరోపణలు కొట్టి పారేసినా తాజాగా ఆ ఎపిసోడ్ గురించి ఈ పుస్తకంలో ఏం రాసి వుంటారన్నది చూడాల్సివుంది. అలాగే రాకేష్‌ను పదవీ విరమణకు చాలా ముందుగానే పోలీస్ కమిషనర్ పదవినుంచి తప్పించడం అప్పట్లో సంచలనం రేపింది. దాంతోపాటు బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన నీరవ్ మోదీని ఆయన కలవడం పెను వివాదమైంది. ఇంత నేపథ్యంవున్న రాకేష్ పుస్తకం రాశారంటే చదవకుండా ఎలావుంటారు?

అయితే ఈ ఆత్మకథలో ఇతరత్రా అంశాలకంటే ఉగ్రవాది కసబ్ గురించి ఆయన చెప్పిన అంశాలు మీడియాలో ప్రముఖంగా వచ్చాయి. దాని చుట్టూ వివాదం రాజేసేందుకు కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ ప్రయత్నించారు. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ, ఉగ్రవాద సంస్థ లష్కరేలు రెండూ కసబ్ పేరును దినేశ్ చౌధరి అని మార్చి, నకిలీ ఐడీ కార్డు సృష్టించి, అతనితో కాషాయ రంగు తాడు కట్టించి, మారణాయుధాలిచ్చి ఉగ్రవాద దాడులకు పంపాయని రాకేష్ తెలిపారు. పీయూష్ గోయెల్ అభ్యంతరమల్లా ఈ సంగతి ఇన్నాళ్లూ ఎందుకు దాచివుంచారన్నదే. అందుకాయన రాకేష్‌తోపాటు అప్పటి యూపీఏ ప్రభుత్వంపై కూడా విరుచుకుపడ్డారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగుందన్నది గోయెల్ అనుమానం. వాస్తవానికి ఈ సమాచారం కొత్తదేమీ కాదు. ఆ దాడి జరిగిన మరుసటి రోజునుంచే ఉగ్రవాదుల గురించి, వారి పన్నాగాల గురించి పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడ్డాయి. కసబ్‌ను ప్రశ్నించే క్రమంలో వెల్లడైన అంశాలన్నీ మీడియాలో అప్పట్లోనే ప్రముఖంగా వచ్చాయి. ఉగ్రవాదుల వద్ద హైదరాబాద్, బెంగళూరు కళాశాలల్లో చదువుకుంటున్నట్టు దొంగ గుర్తింపు కార్డులుండటం, వాటిపై హిందువుల పేర్లు వుండటం పాత కథే. ఉగ్రవాద దాడులకు పథక రచన చేసింది ఐఎస్ఐ కనుక, దాడులు చేసేది భారత్‌లో కనుక తమ సంగతి బయట పడకుండా వుండటం కోసం, దర్యాప్తు సంస్థలను పక్కదోవ పట్టించేందుకు, అయోమయం సృష్టించేందుకు ఇదంతా చేసివుంటారని సులభంగానే గ్రహించవచ్చు. ఇలాంటివి బయటపడినప్పుడు వెల్లడించడానికి ప్రభుత్వాలకు అభ్యంతరం ఎందుకుంటుంది? రాకేష్ మారియా కూడా దాన్ని తొలిసారి బయటపెడుతున్నట్టు ప్రకటించలేదు. కసబ్‌ను తానే స్వయంగా ప్రశ్నించారు గనుక, దర్యాప్తును పక్కదోవ పట్టించే పన్నాగంతో ఐఎస్ఐ ఏమేం చేసిందో చెప్పడానికి ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రాణాలకు తెగించి కసబ్‌ను సజీవంగా పట్టుకున్న కానిస్టేబుల్ గురించి కూడా రాకేష్ ప్రస్తావించారు. కసబ్ సజీవంగా పట్టుబడకపోయివుంటే పాకిస్తాన్ కుట్రను రుజువు చేయడం కష్టమయ్యేది. దేశంలో అంతక్రితమూ, ఆ తర్వాత అనేక ఉగ్రవాద దాడులు జరిగాయి. వీటన్నిటిలో పాకిస్తాన్ ప్రమేయం వున్న సంగతి తెలుస్తూనే వున్నా అందుకు అవసరమైన పక్కా సాక్ష్యాలివ్వడం సాధ్యపడలేదు. ముంబై మహానగరం ఆర్థిక రాజధాని కనుక ఉగ్రవాదుల దాడి ఘటన గురించి తెలిసిన వెంటనే నగర పోలీసులు వారిని మట్టు బెడతారని పాకిస్తాన్ ఊహించింది. కానీ పాక్ అంచనాలకు భిన్నంగా అనుకోకుండా కసబ్ పోలీసులకు చిక్కాడు.

ఒకప్పుడు తాము ఇష్టపడే నేతలు లేదా సెలబ్రిటీలు రాసిన ఆత్మకథల కోసం జనం ఆసక్తి కనబరిచేవారు. వారి జీవితాల నుంచి నేర్చుకోవాల్సింది వుంటుందన్న భావనే అందుకు కారణం. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. పదవీకాలంలో వివాదాస్పదులుగా పేరు తెచ్చుకున్నవారు రాసినా, ఆత్మకథల్లో వివాదాల ప్రస్తావనవున్నా వాటికి పఠితలు అధికంగానే వుంటున్నారు. ఈ పుస్తకంలో రాకేష్ తన తదనంతరం పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన అహ్మద్ జావేద్, మరో పోలీస్ అధికారి దేవేన్ భారతిల గురించి చేసిన ప్రస్తావనలు ఇప్పుడు ముంబై పోలీసుల్లో కాక పుట్టిస్తున్నాయి. తన గురించి వున్నవీ లేనివీ రాశారని జావేద్ అంటున్నారు. ఏదేమైనా మారియా పుస్తకం విడుదలైన రోజే కావలసినంత వివాదం రేపింది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.ద్వాదశి సా.5.10 వరకు, తదుపరి త్రయోదశి నక్షత్రం పూర్వాషాఢ ఉ.9.02 వరకు, తదుపరి ఉత్తరాషాఢ వర్జ్యం సా.5.16 నుంచి 5.55 వరకు, దుర్ముహూర్తం ఉ.10.18 నుంచి 11.03 వరకు, తదుపరి ప.2.55 నుంచి 3.41 వరకు అమృతఘడియలు.. రా.3.12 నుంచి 4.33 వరకు.

**సూర్యోదయం :** 6.28
**సూర్యాస్తమయం:** 5.59
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# పదోన్నతుల కోటాలోనూ అన్యాయమే!

**భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడం కానీ, వాటి అమలులో నిర్లక్ష్యం వహించడం కానీ చాలా తీవ్రమైన తప్పులుగా భావించాలి. ఉద్యోగాల్లో ప్రమోషన్ల అంశం ప్రాథమిక హక్కు కాదనీ, ఈ విషయంలో జోక్యం చేసుకోబోమంటూ వారం రోజుల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా విస్మరించిందనే చెప్పాలి. పైగా రిజర్వేషన్లు అనేవి కొన్ని వర్గాలను, కులాలను సంతృప్తిపరిచే చర్యగా చాలా మంది భావిస్తున్నారు. ఇదేరకమైన అభిప్రాయం న్యాయనిపుణులలో కూడా ఉండడం విచారకరం. ఇప్పుడు భారతదేశంలో ఎస్సీ, ఎస్టీలకు అమలు జరుగుతున్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు స్వాతంత్ర్యం ముందునుంచే అమలులో ఉన్నాయి. తరతరాలుగా సమాజ వృద్ధిలో రక్తం, చెమటను ధారపోసిన దళితుల పట్ల ఇలాంటి తీర్పులను వెలువరించడం బాధాకరమైన విషయం.**


మల్లెపల్లి లక్ష్మయ్య

'మీరు ఇస్తున్న తీర్పుల పట్ల నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. మీరు ఇచ్చే తీర్పులను అంగీకరించవచ్చు. కానీ గౌరవించలేననే విషయాన్ని నేను చాలాసార్లు కరాఖండిగా చెప్పాను. అదే సమయంలో ప్రతి న్యాయవాదికీ అట్లా చెప్పే స్వేచ్ఛ ఉండాలని నేను విశ్వసిస్తున్నాను. సరిగ్గా అదే అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులపైన వ్యాఖ్యానించదల్చుకున్నాను' అంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగానికి జరిగిన మొదటి సవరణపై 1951, మే 18వ తేదీన పార్లమెంటులో ప్రసంగిస్తున్న సందర్భంలో చేసిన వ్యాఖ్యలివి. అప్పటికి ఆయన కేంద్ర న్యాయశాఖా మంత్రిగా ఉన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం పునాదిగా ఏర్పర్చుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడాది దాటక ముందే ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు, సుప్రీంకోర్టులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులిచ్చాయి. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 29ని ఉల్లంఘిస్తున్నాయని న్యాయస్థానాలు తీర్పులిచ్చాయి. అయితే అప్పటికే కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టికల్ 15కు సవరణ చేయాలని భావించింది. ఆ సందర్భంలోనే బాబాసాహెబ్ అంబేడ్కర్ పైవిధంగా మాట్లాడారు. ఇది నేటి పరిస్థితులకు నూటికి నూరుపాళ్లూ వర్తిస్తుందని నా భావన.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిన ప్రతీసారీ, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు చేయాల్సి వచ్చింది. అయితే వారం క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మరింత ఆందోళనకరంగా ఉన్నది. ఎస్సీ,ఎస్టీల ఉద్యోగాలలో ప్రమోషన్ల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోబోదనీ, అయితే ఉద్యోగాల్లో ప్రమోషన్ల అంశం అసలు ప్రాథమిక హక్కు కాదనీ, రాష్ట్ర ప్రభుత్వాలకు తాము ఆదేశాలివ్వలేమనీ, రాష్ట్రాలు తమకు తాముగా నిర్ణయాలు తీసుకోవచ్చనీ సుప్రీంకోర్టు ఒక అనూహ్యమైన తీర్పు నిచ్చింది. ఇందులో రెండు విషయాలున్నాయి. ప్రమోషన్ల విషయం పేర్కొన్న ఆర్టికల్ 16(4)ఎ ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రభుత్వ సర్వీసులలో తగినంత ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం భావించినట్లయితే అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకొని తగువిధమైన నిబంధనలు రూపొందించడానికి ప్రభుత్వానికి ఎటువంటి ఆటంకాలు ఉండకూడదు. రాజ్యాంగంలో ఆర్టికల్ 14 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కులుగా పరిగణిస్తున్నాం. ఇందులో ఆర్టికల్ 32 ప్రకారం, పౌరులెవరికైనా పైన పేర్కొన్న ఆర్టికల్స్ అమలు చేసే విషయంలో ప్రభుత్వాలు విఫలమైనా, నిర్లక్ష్యం వహించినా జోక్యం చేసుకునే హక్కు హైకోర్టు, సుప్రీంకోర్టులకు ఉంటుందనే విషయం న్యాయశాస్త్రం చదివిన ఎవరికైనా అర్థం అవుతుంది. అంతేకాకుండా భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడం కానీ, వాటి అమలులో నిర్లక్ష్యం వహించడం కానీ చాలా తీవ్రమైన తప్పులుగా భావించాలి. అయితే వారం రోజుల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయాలను పూర్తిగా విస్మరించిందనే చెప్పాలి.

అసలు రిజర్వేషన్లు అనేవి కొన్ని వర్గాలను, కులాలను సంతృప్తి పరిచే చర్యగా చాలా మంది భావిస్తున్నారు. ఇదేరకమైన అభిప్రాయం

**కొత్త కోణం**



సాధారణ వ్యక్తులతోపాటు, న్యాయనిపుణులలో కూడా ఉండడం విచారకరం. భారతదేశంలో ఎస్సీ, ఎస్టీలకు అమలు జరుగుతున్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు స్వాతంత్ర్యం ముందునుంచే అమలులో ఉన్నాయి. బాబాసాహెబ్ అంబేడ్కర్ 1942లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంలో కార్మిక శాఖామంత్రిగా ఉన్నప్పుడు, అప్పటి ప్రభుత్వాధినేతలను ఒప్పించి, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. కానీ ఆరంభం నుంచి ఇప్పటి దాకా ఎస్సీ, ఎస్టీల విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో ఒక తీవ్రమైన వ్యతిరేకత, ద్వేషం సమాజంలో నెలకొని వుంది. దాని ప్రభావం అధికారయంత్రాంగం, న్యాయవ్యవస్థ మీద పడుతున్నది. అందువల్లనే ఇప్పటికీ ఎన్నో తీర్పులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రావడం మనం చూడవచ్చు.

నిజానికి ఏ దేశంలోనైనా కొన్ని వర్గాలకు, తెగలకు ప్రత్యేకమైన రాయితీలు ఉంటాయి. ఇవన్నీ కూడా సామాజిక వివక్షను రూపుమాపడానికి చేసిన, చేస్తున్న ప్రయత్నాలు. వాటి వల్ల ప్రజల మధ్య అంతరాలు తగ్గుతాయన్న ఆశాభావంతో ఆనాటి నుంచి ఈనాటి వరకూ సమాజం ఉంది. అదే ఉద్దేశ్యంతో భారతదేశంలో కూడా అంటరాని కులాలైన ఎస్సీలకూ, అడవుల్లో, కొండల్లో నివసించే ఆదివాసీలైన ఎస్టీలకూ రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. కొన్ని పథకాలను రూపొందించారు. అయితే సమాజంలో ఆధిపత్య కులాల్లో ఉన్నవాళ్ళకు అంటరాని కులాల కోసం అమలు చేస్తున్న రిజర్వేషన్ల పట్ల చాలా ఆగ్రహం ఉన్నది. తమ ఉద్యోగాలను, తమ చదువులు, సీట్లనూ, తమ అవకాశాలనూ వీళ్ళు కొల్లగొడుతున్నారని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా గత ఇరవై, ముప్పై ఏళ్లలో వచ్చిన యువతరం ఇటువంటి భావాన్ని కలిగి ఉన్నారు. అంతకన్నా ముందుతరం చాలా వివక్షను ప్రదర్శించింది. అప్పుడు ఉద్యోగాల్లో అంత ఎక్కువ మంది కనిపించలేదు. ఇప్పుడు ఉద్యోగాల్లో విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదిగి వస్తున్నారు. ఇదే కొందరికి మింగుడుపడడంలేదు. సమాజ పరిణామక్రమంపట్ల అవగాహన లేకపోవడం, ఒకవేళ తెలిసినా దానిని అంగీకరించే స్థాయిలేకపోవడం, వాళ్ళ ప్రవర్తనకు కారణం కావచ్చు. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా, ఒక మనిషిని అంటుకోకూడదనే భావన మన దేశంలోనే ఉన్నది. వాళ్ళను ముట్టుకుంటే మైలపడతామనే భావన అందరికీ నరనరానా వ్యాపించి ఉన్నది. ఇప్పటికే గ్రామాల్లో దేవాలయాల్లోకి రానివ్వకపోవడం, దళితులు వంట చేసినా, వస్తువులు అమ్మినా తీసుకోకపోవడం, ఎవరైనా అమ్మాయిలు, అబ్బాయిలు కులాంతర వివాహాలు చేసుకుంటే కూతుళ్ళని కూడా చూడకుండా హత్యచేయడం రోజూ మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఇవి వేల ఏళ్ళుగా సాగుతున్న అత్యాచారాలు, అంతేకాకుండా వేలమందిని అమానుషంగా హత్యలు చేసిన సమాజం ఇది.

అయితే ఇన్ని ఘోరాలకు బలవుతూ కూడా వేల ఏళ్ళ నుంచి సమాజాభివృద్ధికి తమ ప్రాణాలను ధారపోశారు. యాంత్రీకరణ జరగక ముందు అన్ని రకాల వృత్తులకు తోలు పరికరాలను అందించింది అంటరానివారే. చెరువులను నిర్మించి, నిర్వహించి, ప్రాణాలకు తెగించి చెరువులను రక్షించిన వాళ్లూ అంటరానివాళ్ళే. దహన కార్యక్రమాలూ, ఖనన కార్యక్రమాలూ చేసింది వారే. వీధులనూ, వాకిళ్ళనూ శుభ్రంచేసి యావత్ సమాజం ఆరోగ్యాన్ని కాపాడి, మానవ జాతి మనుగడకు కారణమైందీ ఈ అంటరానివారే. అంటే వ్యవసాయ యుగంలో ప్రాణాలను, ఆరోగ్యాలను పణంగా పెట్టింది కూడా ఈ అంటరానివారే. పైగా, పారిశ్రామిక రంగానికి ప్రథమ అవసరాలైన రైల్వేలు, గనులలో ఎండనకా, వాననకా, రక్తాన్ని చెమటగా ధారపోసింది కూడా ఈ అంటరానివారే. 1938లో ఇల్లందు బొగ్గుగనిలో ప్రమాదం జరిగి 42 మంది మరణిస్తే, అధికారులు మినహా మిగతా 37 మంది అంటరానివారే. ఇప్పటికీ మల మూత్రాలను ఒంటినిండా పులుముకొని, ప్రాణాలకు తెగించి మ్యాన్‌హోల్స్‌లో దిగుతున్నది కూడా వాళ్లే. నిజానికి వాళ్లు సమాజానికి చేసిన సేవతో పోలిస్తే ప్రస్తుతం అమలుచేస్తున్న రిజర్వేషన్లు ఏ మూలకూ సరిపోవు. ఒకవైపు సమాజ వృద్ధిలో రక్తం, చెమటను ధారపోసిన వీళ్ళను వేల ఏళ్ళుగా పశువుల కన్నా హీనంగా చూస్తున్నారు. అభివృద్ధిపథంలో దూసుకెళుతున్నామనుకుంటోన్న ఈ ఆధునిక, నవీన యుగంలో కూడా ఇలాంటి తీర్పులను వెలువరించడం బాధాకరం.

'హిరోషీమా, నాగసాకిలపై బాంబులు వేసి, మారణహోమం సృష్టించినందుకు జపాన్ వెళ్ళిన ప్రతి అమెరికా అధ్యక్షుడూ, ఆ ప్రాంతానికి వెళ్ళి జపాన్ ప్రజలకు క్షమాపణ చెప్పడం ఆనవాయితీ, అమృతసర్‌లోని స్వర్ణదేవాలయం మీద భారత సైన్యం చేసిన దాడిపట్ల పశ్చాత్తాపంతో స్వర్ణదేవాలయాన్ని సందర్శించి ప్రతిప్రధాని విచారం వ్యక్తం చేస్తారు. కానీ రెండువేల ఏళ్ళకుపైగా నూటికి 25 శాతం మంది మీద అమానుషమైన వివక్ష, హత్యలను, అత్యాచారాలను చేస్తున్న హిందూ సమాజంలో మాత్రం ఎటువంటి సానుభూతి కనిపించకపోవడం, కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం బాధకలిగిస్తున్నది. ఒక హిందువుగానే నేను తలవంచి దళితులకు క్షమాపణలు చెబుతాను' అన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్‌గారి మాటలను హిందూ సమాజం ఒకసారి అవలోకనం చేసుకుంటే యావత్ సమాజం దళితులు, అంటరానివారిపట్ల గౌరవాన్ని ప్రదర్శించగలుగుతుంది. తమ ప్రవర్తన పట్ల పునరాలోచించుకోగలుగుతుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



**సోషల్ మీడియా**

### ట్వీట్స్ కాదు



"చాలామందికి ఏం చేయాలో తోచడం లేదు. కవిత్వం చదవండి. మీ భాగస్వామితో, పిల్లలతో కొంత సమయం గడపండి. వారికి నక్షత్రాలను చూపిస్తూ కొత్త ప్రపంచాన్ని వాగ్దానం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ట్విట్టర్‌కు బయట కూడా ప్రపంచం ఉంది. ఒక పార్కుకు వెళ్లండి. పరిచయం లేని వ్యక్తితో మాటలు కలపండి. మీరే భోజనం తయారు చేయండి. ఓ స్నేహితుడిని కలిసి వాళ్లు మౌనంగా ఉన్నంత మాత్రాన మతోన్మాదులుగా భావించమని హామీ ఇవ్వండి. మనం అంటే కేవలం ట్వీట్లు మాత్రమే కాదు"

– సిద్రాహ్, కవయిత్రి

### ప్రశ్న



"పరిశోధనా విద్యార్థులు పొడవైన ప్రశ్నపత్రాలను మెయిల్‌లో పంపి వాటికి రాతపూర్వకంగా స్పందించమంటారు. లేదంటే మాటలు రికార్డు చేసి పంపమంటారు. కేవలం జర్నలిజంలో మాత్రమే ఇలాంటి పడక కుర్చీ పరిశోధకులు ఎక్కువ వున్నారేమో అనిపిస్తోంది. దీనికి విద్యారంగంలోని మిత్రులు ఏమంటారో"

– నేహా దీక్షిత్, జర్నలిస్ట్

### సంబరం



"అమూల్ బటర్ బదులుగా మదర్ డెయిరీ వాడటం ప్రారంభించా. కశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనపై సంబరాలు చేసుకునే ప్రకటనలు జారీ చేసేవారి నుంచి ఏమీ కొనకూడదని నిర్ణయించుకున్నా"

– రూపా గులాబ్, జర్నలిస్ట్

### శాంతి



"దేశంలో శాంతి నెలకొనడం కోసం నా వంతుగా నా టీవీ నుంచి జీ న్యూస్, రిపబ్లిక్ టీవీ, సుదర్శన్ న్యూస్ చానల్స్ తొలగించా"

– రేష్మా ఆలం, విద్యార్థిని

### రక్తం



"ఆఖరికి మన రక్తంలోనూ అసమానతలు ఉన్నాయన్న మాట. పురుషుడు నెత్తురు చిందిస్తే హీరోయిజం, స్త్రీ చిందిస్తే అవమానకరం"

– సుఖద, కన్సల్టెంట్

### కోణం



"నేను పూర్తిగా నా విలేకరి కోణం నుంచి మాట్లాడుతున్నా. 36 ఏళ్ల నా జర్నలిస్ట్ వృత్తిలో కశ్మీర్ ఎప్పుడూ సాధారణ స్థితిలో లేదు. ఇంకముందెప్పుడైనా ఉంటుందని కూడా చెప్పలేను. ఆ స్వర్గాన్ని ఒక ఊహగానే మిగల్చడానికి నరకం సిద్ధమవుతోంది. త్వరలో ఆ పరిస్థితి మారే అవకాశం కనిపించడం లేదు. తీవ్ర ఆవేదనతో నేను ఈ విషయం చెబుతున్నా"

– సంకర్షణ్ ఠాకూర్, జర్నలిస్ట్

### మరొకరు



"ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ త్రిపాఠిపై అత్యాచార ఆరోపణలు నమోదు అయ్యాయి. ఆయనతోపాటు అతని కుటుంబంలోని ఆరుగురిపై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీలోనే ఇలాంటివారు ఎక్కువగా ఉన్నట్టున్నారు"

– గౌరవ్ పాంధి, కాంగ్రెస్ నేత

# అక్షరాలా 'నడిచే' విజ్ఞాన సర్వస్వం రాంభట్ల!

**సందర్భం**


మందలపర్తి కిశోర్

ప్రముఖ కవి, విమర్శకుడు, చిత్రకారుడు, పత్రికా రచయిత, సంపాదకుడు, తొలి తెలుగు కార్టూనిస్ట్ కవి ('శవవిషాణం'), వేదాల గురించి సృజనాత్మకంగా ఆలోచించి విస్తృతంగా రాసిన పరిశోధకుడు, 'కన్యాశుల్కం' నిపుణుడు, మార్క్సిస్టు మేధావి, తెలుగులో జర్నలిజం అధ్యయన కేంద్రానికి మొట్టమొదటి ప్రధాన అధ్యాపకుడు, రాంభట్ల కృష్ణమూర్తి. ఆయన శతజయంతి సంవత్సరమిది. పుట్టింది ఎక్కడో తూర్పు తీరంలో అయినప్పటికీ, రాంభట్లగారు తన జీవితంలో అత్యధిక భాగం గడిపింది హైదరాబాద్‌లోనే. నిజానికి, రాంభట్ల ఒక స్వయంనిర్మిత సౌధం! హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం లాంటి గ్రంథాలయాల్లోనే ఆయన తెలుగుసంస్కృత సాహిత్య అధ్యయనం సాగింది. మాతృభాష తెలుగులోనూ, స్వయంకృషితో నేర్చుకున్న ఇంగ్లిష్‌లోనూ, కొద్దోగొప్పో పాఠశాలల్లో చదువుకున్న ఉర్దూలోనూ రాంభట్లగారు తర్వాతి కాలంలో పాండిత్యం సంపాదించడం విశేషం.

తరుణ యవ్వనంలో రాంభట్ల ఆర్య సమాజ్ ప్రభావంలో వేదాల గురించి తెలుసుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. 'అందరికీ విద్య జ్ఞానప్రాప్తి సత్యప్రకాశం' అనే దయానంద సరస్వతి ఆదర్శం రాంభట్లను ప్రభావితం చేసింది. చివరివరకూ ఆయన తన వృత్తి నాలుగు విషయాలు నేర్చుకోవడమూ ఆ నేర్చుకున్నదాన్ని నలుగురికి నేర్పడమేనని నమ్మి, దాన్నే ఆచరించారు. వాస్తవానికి రాంభట్ల జీవనం మేలిమలుపు తిరిగింది ఆ నవయవ్వన దశలోనే. ఆయన దయానంద సరస్వతి దగ్గరే వేద మంత్రాల ప్రతిపదార్థ తాత్పర్యాల దగ్గరే ఆగిపోలేదు! ఫ్రెడ్రిక్ రాసెన్, ఫ్రాంజ్ బాప్, రుడాల్ఫ్ ఫాన్ రాత్, ఫ్రెడ్రిక్ మ్యాక్స్ మ్యూలర్‌ల రచనలు చదవడానికి ఆయన పడరానిపాట్లు పడ్డారు. ఏమాత్రం తీరిక చిక్కినా మ్యాక్స్ మ్యూలర్ సంకలించిన 'ద సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ద ఈస్ట్' చదువుతుండేవారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అచ్చువేసిన ఈ సంకలనం మొత్తం రాంభట్లగారికి నిత్యపారాయణీయం. కానీ, జర్మన్ ఇండాలజిస్టుల దగ్గరా ఆయన ఆగిపోలేదు. జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీపద అమృత డాంగే, రాహుల్ సాంకృత్యాయన్ తదితరులు చూపిన బాటలో రుగ్వేద కాలపు గణసమాజాన్ని ఊహించే సాహసానికి ఆయన చిన్ననాటనే తెగించారు! తంత్ర సంస్కృతి గురించి సంపాదించిన పరిజ్ఞానం రాంభట్లని భౌతికవాదం వైపు నడిపించింది. ప్రాచీన ఆచారాల్లో నిబిడీకృతమయి వున్న తాంత్రిక భావనలను వెతికే దిశగా అది దారితీసింది. సామెతలూ, ఊళ్ల పేర్ల వెనక దాగిన అర్థాలను విశ్లేషించడానికి ఈ భౌతికవాదమే తోవ చూపించింది. అదే ఆయన్ని తాపీ ధర్మారావు లాంటి బహుముఖ ప్రజ్ఞావంతుడికి చేరువ చేసింది. ఆ ఆలోచన క్రమమే రాంభట్లని మార్క్సిజం వైపు నడిపించింది. ఈ మేధోపరిణామమే ఆయన్ని గ్రంథస్థమయిన చరిత్ర రచనకు మించి ఆలోచించే సాహసిగా పదును పెట్టింది. అదే, తనను అరుదయిన మేధావిగా మార్చింది.

1940 దశకంలో వెలువడుతూ ఉండిన నిజాం అధికార పత్రిక 'మీజాన్.' ఇది, ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో వచ్చేది. తెలుగు పత్రికకు అడివి బాపిరాజు సంపాదకులు. ఆయన దగ్గర సహాయ సంపాదకులుగా చేసే శ్రీనివాస చక్రవర్తి సంస్కృత రూపకాల్లో దిట్ట. ఆయనకు ఆధునిక తెలుగు నాటకాల్లో 'కన్యాశుల్కం' అంటే తగని మక్కువ. రాంభట్లకయితే కన్యాశుల్కమంటే ప్రాణం! చక్రవర్తిగారు రాంభట్లకి ఆర్యసమాజ్ రోజులనుంచీ పరిచయస్తులు. ఆయన ద్వారానే అడివి బాపిరాజుతో రాంభట్లకు పరిచయమయింది. బాపిరాజు గారు రాంభట్లను ఎప్పుడూ 'మైడియర్ యంగ్‌మ్యాన్!' అని గిరీశం ఫక్కీలో పలకరించేవారట. (రాంభట్ల మమ్మల్నందర్నీ 'ఏం ఫ్రెండూ!' అనే పలకరించేవారు!) కన్యాశుల్కమే వారిని కట్టిపడేసింది. ఆ కన్యాశుల్కం నాటకమే రాంభట్లను అభ్యుదయ రచయితగా మార్చింది. దాని రచయిత గురజాడే సామాజిక, ప్రాంతీయ మాండలికాల పట్ల ఆయనలో ఆసక్తి కలిగించారు. గురజాడనుంచే, బాధితులపట్ల పక్షపాతం కలిగి వుండాలనే నీతిని రాంభట్ల నేర్చుకున్నారు. అదే అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళిక రచనలో 'శ్రామికవర్గ పక్షపాతం'గా ప్రతిఫలించింది. 'మృచ్ఛకటికం కన్యాశుల్కం', 'గిరీ శంశకారుడు', 'వసంతసేనమధురవాణి' అనే అంశాలను తులనాత్మకంగా అధ్యయనం చెయ్యడం రాంభట్ల ప్రవృత్తిలోనే భాగంగా మారిపోయింది! ఫ్రెడ్రిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరంలో చెప్పుకోవలసిన ఓ విశేషం ఉంది ఎంగెల్స్ రచన 'ఆరి జిన్ ఆఫ్ ఫ్యామిలీ'ని రాంభట్ల వారానికి ఒకసారయినా చదివేవారు!

విభిన్న అధ్యయనరంగాల్లో విస్తృతమయిన పరిజ్ఞానం కలిగివుండి, ఏ 'రెఫరెన్సూ' లేకుండానే గళగ్రాహిగా మాట్లాడుతూవుండే వ్యక్తులను సంచార విజ్ఞాన సర్వస్వాలుగా పిలవడం కద్దు. అయితే, రాంభట్లని సంచార విజ్ఞాన సర్వస్వం అన డం కన్నా, నడిచే విజ్ఞాన సర్వస్వం అనడమే భావ్యమని నా నమ్మకం. ఎందుకంటే, ఆయన అక్షరాలా 'నడిచే' విజ్ఞాన సర్వస్వమే! 1970–80లలో, హైదరాబాద్ పురవీథుల్లో రాంభట్ల, చిన్నపాటి శిష్యబృందాన్ని వెంటపెట్టుకుని, కిలోమీటర్ల తరబడి నడుస్తూ కనిపించేవారు. వేదవేదాంగాలు మొదలుకుని ఫ్రాయిడియన్ సైకోఎనాలిసిస్ వరకూ ఫ్రీ స్టైల్ లెక్చర్ దంచుతూ రాంభట్ల గారు నడుస్తూవుంటే, మేమందరం ఆయన వెంట అబ్బురపడుతూ నడిచిపోతూండే వాళ్లం. సరమఅపాల మొదలుకుని గిల్గమేష్‌ఎంకిడు వరకూ ఎందరెందరి ప్రస్తావనో వస్తూవుండేది. కాస్త ఖాళీగా వుండే ఇరానీ రెస్టారెంట్ కనిపించే వరకూ ఈ వాకథాన్ సాగుతూ వుండేది. ఎక్కడయినా 'అడ్డా బిఠాయించామంటే' చర్చనీయాంశం ఓ కొలిక్కివచ్చే వరకూ 'బైఠక్' కొనసాగాల్సిందే! ఈ చర్చ ఎప్పుడూ వన్‌వే ట్రాఫిక్‌లా జరిగేదికాదు. నిజానికి రాంభట్లగారే అలా జరగనిచ్చేవారు కారు. ఒకవేళ అలా జరిగే ప్రమాదం కనబడితే, అప్పటిదాకా తాను చెప్తూవచ్చిన వాదాన్ని తానే ఖండించడం మొదలుపెట్టేవారాయన! 'వాదానువాద సంవాద ప్రతివాదా'లనే తర్క ప్రక్రియల గురించి సహచరులకు వివరిస్తూ చర్చను మోడరేట్ చేసేవారాయన. ఆయన పాతకాలపు 'చండామార్కుల మార్కు' గురువు కారు. తన కన్నా పాతిక ముప్పైయేళ్లు చిన్నవారయిన శిష్యులందరినీ ప్రేమగా 'ఫ్రెండూ!' అని పిలిచే ఆధునిక గురువు. ఏథెన్స్ వీధుల్లో సోక్రటీస్ నిర్వహించాడని చెప్పే 'ఎలింకస్' తరహా సంచార చర్చాగోష్ఠులను రాంభట్ల ఏళ్ల తరబడి కొనసాగించారు. నాకు తెలిసి, తెలుగునాట ఇలాంటి కార్యక్రమం చేపట్టిన మరో వ్యక్తి లేరు! అదీ రాంభట్ల విశిష్టత. శతజయంతి వేళ మనం స్మరించుకోవలసిన ముఖ్యమైన అంశం ఇదే. రాంభట్లగారు రాసింది బహుతక్కువ. ఆ రాసిన పది పుస్తకాలూ కూడా మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ శతజయంతి సందర్భంగానైనా తన లభ్య రచనల సర్వస్వం వెలువడితే బావుంటుంది. రాంభట్లగారి 'ఫ్రెండ్స్' వింటున్నారా?

(ఫిబ్రవరి 22 ఉదయం విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి సభ సందర్భంగా..)

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు



# తృష్ణ

తృష్ణ అంటే దాహం, కోరిక, ఆశ, అత్యాశ వంటి అర్థాలు ఉన్నాయి. ఈ తృష్ణ మానవ మస్తిష్కంలో అనేక రూపాలలో మొలకెత్తి ప్రవర్ధమానమై, వికసించి మనిషిని ఆకర్షిస్తుంది. అతడి చుట్టూ తీగలా అల్లుకుని బంధిస్తుంది. ఇది మనిషి ఎదుగుదలకు దోహదం చేసే కోరి కైతే మంచిదే. ఏదైనా సాధించాలనే తపన, గుర్తింపు పొందాలనే ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. అతని చేత ప్రయోజనకరమైన పను లను చేయిస్తుంది. తృష్ణ ధర్మబద్ధమైనదైతే, ప్రయత్నం నిజాయితీతో కూడుకున్నదైతే సత్ఫలితాలే వస్తాయి. అది యత్నరహితమైన అత్యాశ అయితే తనకు చేటు, సమాజానికి చేటు. ఈ అత్యాశ అనే జిగిబిగి అల్లిక నుంచి బయట పడాలంటే మనిషి తనేం చేయగలడో, ఎంతవరకు కృతకృత్యుడు కాగలడో తెలుసుకోవాలి. అప్పుడే అతడు తనలోని వికృత మనసును చూడగలడు. తనను తాను సరిదిద్దుకోగలడు.


జ్యోతిర్మయం

అసాధ్యమైన కోరికలు, అనువుగాని కోరికలు దుఃఖానికి హేతువులవుతాయి. మనిషిని అశాంతికి గురిచేస్తాయి. ఒకచోట నిలువనీయవు. అసూయాగ్రస్తుని చేస్తాయి. సాటివారితో శత్రుత్వాన్ని పెంచుతాయి. చెడును ప్రేరేపించే ఇటువంటి తృష్ణకు మనిషి దూరంగా ఉండాలి. తృష్ణను మనిషి తనకు అనుకూలంగా మలచుకుంటే జీవితం అర్థవంతమవుతుంది. బంధువులు, సంపదలు, సౌఖ్యాలు అనే అశాశ్వత విషయాలను దూరంగా ఉంచగలిగితే అతడి మనసులో ప్రశాంతత ఏర్పడుతుంది. మనిషికి సత్యసంధతతో, నిజాయితీగా బతకాలనే తృష్ణ ఉండాలి. తనకు చేతనైనంతలో ఇతరులకు సాయపడాలనే కోరిక ఉండాలి.

జ్ఞాన సంపద ఎప్పటికీ తరిగిపోనిది. ఇతరులకు పంచే కొద్దీ పెరిగేది. మనిషికి జ్ఞాన తృష్ణ ఉండాలి. జ్ఞానానికి ఎల్లలు లేవు. జీవితానికి పనికివచ్చే ఏ అంశాన్నైనా ఏ దేశం నుంచైనా స్వీకరించాలి. విషయ సంపదను పెంచుకోవటానికి ఎప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. తనకు తెలిసిన జ్ఞానాన్ని అందరికీ పంచాలనే తపన ఉండాలి. ఇదే నిజమైన తృష్ణ.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 20-2-2020



**తగ్గుతున్నా!**
సినిమా పేజీలో



**విషాలను**
వదిలేద్దామిలా!
– హెల్త్ పేజీలో



నాలుగు కుర్చీలలో ఊర్వశీ రౌతేలా

# ఫిల్మ్‌ఫేర్‌లో ఆస్కార్ గౌను

**ఆ**స్కార్ వేడుకల్లో ఎరుపు రంగు తివాచీ రిచ్‌గా కనిపిస్తుంది. ఆ తర్వాతి ‘రిచ్’దనమంతా నటీమణుల ఎర్ర గౌన్లదే. ఇటీవలి మన ఫిల్మ్‌ఫేర్ సినిమా అవార్డుల వేడుకల్లో కూడా ఆస్కార్ కళ కనిపించింది! కొంచెం వాళ్లని ఫాలో అయినట్లున్నారు మనవాళ్లు. గౌహతిలోని ఇందిరాగాంధి అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన ఈ ఏడాది ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవానికి నటి ఊర్వశీ రౌటేలా ఎర్రరంగు గౌను వేసుకుని వచ్చారు. ఒక్కక్షణం అక్కడివారికి ఇది హాలీవుడ్డో, బాలీవుడ్డో అర్థం కాలేదు. ఊర్వశి వేసుకొచ్చిన గౌను వేదికకు ఆస్కార్ కళను తెప్పించింది. ఆ గౌనుతో ఆడియెన్స్ మధ్యలో కూర్చోడానికి ఆమెకు నాలుగు సీట్లు అవసరం అయ్యాయి. ఆమెకు ఒక సీటు, ఆమె గౌను అంచులు మడతలు పడకుండా ఉండేందుకు మూడు సీట్లు! కూర్చున్నాక అంతపెద్ద గౌను ఎక్కడో ఒకచోట మడత పడకుండా ఉంటుందా? ఆ మడతల్ని సరిచేయడానికి ఒక టీము. గౌనుకు ఎంత ఖర్చయిందో తెలీదు కానీ.. గౌన్ కుట్టడానికి మాత్రం 730 గంటలు పట్టిందట! అంటే నెలకు పైగానే. ఈ వివరాలన్నీ అప్పుడు బయటికి రాలేదు. ఈవెంట్ అయ్యాక కాస్త ఆలస్యంగా బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో గౌను విశేషాలన్నిటినీ కుప్పపోశారు ఊర్వశి. ఊర్వశి హరిద్వార్ అమ్మాయి. వయసు 25. ఏడేళ్లుగా సినిమాల్లో ఉన్నారు. తొలి సినిమా ‘సింగ్ సాబ్ ది గ్రేట్’. ఇటీవలి సినిమా ‘పాగల్‌పంతీ’. మధ్యలో ఏడు సినిమాలు. ఈసారి ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానంలో ప్రతిభను పక్కన పెట్టారన్న విమర్శలు చాలా వచ్చాయి. వాటి గురించి ఊర్వశి ఏమీ మాట్లాడడం లేదు. అవార్డొచ్చి, ఆ అవార్డును తీసుకోడానికి వెళ్లలేదు ఆమె. ఆహ్వానం వస్తే వెళ్లింది. కాసేపు అలా కూర్చొని వచ్చింది. వివాదాలకు దూరంగా ఉండేవాళ్లెప్పుడూ సంతోషంగా ఉంటారు.



ఊర్వశీ రౌతేలా

క్లాస్‌మేట్స్

**లక్ష్మిస్ నాయక్ పదహారేళ్ల కుర్రాడు. బెంగళూరు, రాజాజీ నగర్‌లోని ఈస్ట్-వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ఆ స్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతున్న కుర్రాళ్లు చాలామందే ఉన్నారు. అయితే లక్ష్మిస్ నాయక్ మాత్రం ఆ స్కూల్‌కి ప్రత్యేకం.**



స్కూలు ఆవరణలో లక్ష్మిస్ నాయక్‌ను ‘నడిపిస్తున్న’ స్నేహితులు

# స్నేహ హస్తాలు

**ఎం**దుకు ప్రత్యేకం అంటే... పదేళ్లుగా ఒక అందమైన దృశ్యానికి ఆ స్కూల్ ప్రత్యక్షసాక్షిగా ఉంటూ వస్తోంది. అయితే ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలతోపాటే మనసును తాకే ఆ దృశ్యం కూడా కనుమరుగు కాబోతోంది. ఒక స్నేహబృందం చెల్లాచెదురు అయిపోవాల్సిన సమయం వచ్చేసింది. ‘‘టెన్త్ పూర్తయిన తర్వాత పిల్లలు ఎవరికి ఇష్టమైన కోర్సుల్లో వాళ్ల చేరతారు. లక్ష్మిస్ నాయక్ స్నేహబృందంలోని కుర్రాళ్లు కూడా ఒక్కొక్కరు ఒక్కో కాలేజ్‌లో చేరిపోతారు’’ అంటూ.. ఆ స్కూలుకే ప్రత్యేకమైన లక్ష్మిస్ నాయక్ గురించి స్కూల్ టీచర్ గ్రేస్ సీతారామన్ తెలిపారు.

**అంతా టెన్త్‌కి వచ్చేశారు**

లక్ష్మిస్ నాయక్‌ను ఇప్పటివరకు స్నేహితుల హస్తాలే నడిపించాయి. నాయక్ ఏడాది పిల్లాడిగా ఉన్నప్పుడు పోలియో బారిన పడ్డాడు. తనకై తాను నడవలేడు. మొదట్లో వాళ్ల అమ్మానాన్న రోజూ స్కూల్లో దించేవాళ్లు. ఆ తర్వాత నాయక్ స్నేహితులు ఆ బాధ్యత తీసుకున్నారు. అందరూ చిన్న పిల్లలే. కానీ అందరిదీ పెద్ద మనసు. ఏడెనిమిది మంది పిల్లలు రోజూ నాయక్‌ను ఇంటినుంచి స్కూలుకు తీసుకెళ్తారు. వీల్ చైర్‌లో కూర్చోబెట్టి స్కూలు ఆవరణంతా తిప్పుతారు. చేతులతో ఎత్తి పై అంతస్థులోని క్లాస్ రూమ్‌కు తీసుకెళ్తారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా కొన్నేళ్లుగా జరుగుతోంది. ఇప్పుడు వాళ్లంతా పదవ తరగతికి వచ్చారు. పరీక్షలైపోగానే విడిపోక తప్పదని ఆవేదన చెందుతున్నారు.



పై అంతస్తులోని తరగతి గది నుంచి లక్ష్మిస్ నాయక్‌ను కిందికి తీసుకొస్తున్న స్నేహితుడు

**వాడిని వదిలేసి వెళ్లలేం**

ఓ రోజు ఓ టీచర్ ఆ పిల్లల్ని ‘‘రోజూ ఇలా చేతులతో ఎత్తుకుని తీసుకెళ్లడం కష్టంగా అనిపించడం లేదా’’ అని అడిగారు. అప్పుడు ఆ కుర్రాళ్లు చెప్పిన మాట ‘‘అందరం షేర్ చేసుకుంటాం. కాబట్టి బరువు అని కానీ, కష్టం అని కానీ అనిపించదు. వాడిని తీసుకెళ్లకుండా మేము ఎక్కడికైనా వెళ్లినప్పుడు కూడా వాడే గుర్తుకు వస్తుంటాడు’’ అన్నాడు ఆ స్నేహబృందంలోని సిద్ధార్థ. మరో స్టూడెంట్ మయూర్ అయితే... ‘‘మేము వాడిని మోసుకు పోవడమే కనిపిస్తుంది. వాడు మాకు ఎన్ని సబ్జెక్టుల్లో సహాయం చేస్తాడో తెలుసా? క్లాస్‌లో మాకు అర్థం కాని సందేహాలను వాడు చక్కగా క్లియర్ చేస్తాడు. నాయక్ కామర్స్ చదవాలనుకుంటున్నాడు. నేను ఏదైనా డిప్లమో కోర్సులకు వెళ్లాలనుకుంటున్నాను. వేరే వేరే కాలేజీలకు వెళ్లక తప్పదు’’ అని ఆవేదన చెందాడు.

**‘నాకూ దిగులేస్తోంది’**

‘‘నాయక్ ఫిజికల్లీ చాలెంజ్‌డ్ అని బయటి వాళ్లు అనుకోవాల్సిందే తప్ప మాకు అలా అనిపించదు. స్కూల్లో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ మా అందరితోపాటు నాయక్ కూడా ఉంటాడు’’ అన్నారు కుర్రాళ్లందరూ ముక్తకంఠంతో. నాయక్ మాత్రం ‘‘ఇప్పటి వరకు నన్ను చేతుల్లో పెట్టుకుని చూసుకున్న నా స్నేహితులకు దూరం కావాల్సి వస్తోంది. ఒకరి సహాయం లేకుండా కృత్రిమ సాధనాల సహాయంతో నడవడానికి నేను సిద్ధమే. కానీ పదవ తరగతి పరీక్షల తర్వాత ఎదురయ్యే ఒంటరితనం ఇప్పటి నుంచే గుర్తుకొస్తోంది’’ అని దిగులుగా అంటున్నాడు.

**– మంజీర**

చెట్టు నీడ

# గట్టివాడు

**ని**త్యమూ దైవనామ స్మరణంతోనే గడిపే ఓ సన్యాసి దగ్గరకు వచ్చాడు ఓ నాస్తికుడు.

అతనిని చూస్తూనే ‘‘ఏం కావాలి నాయనా.. ’’ అని అడిగాడు సన్యాసి.

‘‘స్వామీ! మీరు చెబుతున్న విషయాలన్నీ చాలా కాలంగా శ్రద్ధగా వింటున్నాను.. కానీ మీరు ప్రతి విషయానికీ దేవుడిని కల్పించి చెబుతున్నారు’’ అన్నాడు

‘‘నీ సందేహమేమిటి నాయనా..?’’ అన్నాడు సన్యాసి

‘‘కనిపించని దేవుడి గురించి గొప్పలు చెబుతూ పబ్బం గడుపుకుంటున్నారని నేనంటున్నాను. మీరు నిజంగా దైవ సమానులయితే ఆ దేవుడ్ని చూపించండి. చూసి నేను కూడా మీకు శిష్యుణ్ణయిపోతాను’’ అన్నాడు నాస్తికుడు వెటకారంగా..

అతని మాటలకు సన్యాసి రెండు క్షణాలు ఆగి, తన సంచిలో ఉన్న ఓ బూరను నాస్తికుడికి ఇచ్చాడు.



నాస్తికుడు అర్థం కానట్టు చూస్తుంటే.. సన్యాసి కల్పించుకుని ‘‘ఈ బూరను గాలితో నింపు’’ అన్నాడు.

నాస్తికుడు అలానే చేసి బుడగను సన్యాసికి ఇచ్చాడు.

దానిని తన చేతిలోకి తీసుకుంటూ ‘‘గాలిని బాగానే ఊదావు.. గట్టివాడవే.. అయితే నువ్వు ఊదిన గాలి ఎంత పరిమాణంలో ఉందో నాకు తెలియడం లేదు.. ముందు దానిని చూపించు’’ అన్నాడు.

‘‘గాలిని చూపించడమేమిటి స్వామీ.. అదెలా సాధ్యం..’’ అన్నాడు నాస్తికుడు.

‘‘భగవంతుడు కూడా అంతే... తాను కనిపించడు.. మన ద్వారా తన లీలలను చూపిస్తాడు’’ అన్నాడు సన్యాసి.

నాస్తికుడు మరి మాట్లాడలేదు.

**– దాసరి దుర్గాప్రసాద్**

బ్యూటిప్స్

**పా**దాల పగుళ్లు పోవాలంటే... కీరా జ్యూస్‌లో బియ్యపు పిండిని వేసి చిక్కగా కలపాలి. ఆ మిశ్రమాన్ని పాదాలకు ప్యాక్‌లా వేసి, అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. నెలరోజుల పాటు ఇలా చేస్తే పాదాల పగుళ్లు మాయమైపోతాయి. ఎండవల్ల ఏర్పడిన నలుపూ పోతుంది.



**పె**దవుల నలుపు పోవాలంటే.. అరటిపండు గుజ్జులో కొద్దిగా పెరుగు, తేనె కలిపి... ఆ మిశ్రమాన్ని పెదవులమీద, పెదవుల చుట్టూ అప్లై చేసి, ఇరవై నిమిషాల తరువాత చల్లటినీటితో కడిగేసుకోవాలి. కొన్ని వారాలపాటు ఇలా చేస్తే నలుపు తగ్గుతుంది.



# పాపాయితో హైలెవల్ మీటింగ్‌కి

**పు**దుచ్చేరిలోని లెఫ్టినెంట్ గవర్నర్ ఆఫీస్‌లో మంగళవారం అత్యవసర సమావేశం జరుగుతోంది. ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసినవారు లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడి! వివిధ శాఖల కార్యదర్శులు ఈ హైలెవల్ మీటింగ్‌కి హాజరయ్యారు. వారిలో ఐటీ శాఖ నుంచి వచ్చిన ఓ మహిళా కార్యదర్శి కూడా ఉన్నారు. సమావేశం గంభీరంగా సాగుతోంది. అంతలో.. మీటింగ్ హాలు బయట నుంచి పసిబిడ్డ ఏడుపు! ఆ ఏడుపు వింటూ మహిళా కార్యదర్శి స్థిమితంగా ఉండలేకపోయారు. అది గమనించారు కిరణ్ బేడి. ‘ఏమైంది?’ అన్నట్లు ఆమె వైపు చూశారు. ‘‘బయట ఏడుస్తున్నది నా కూతురే. పది నెలలు. నేను కనిపించకపోతే ఏడ్చేస్తుంది. వాళ్ల అమ్మమ్మ దగ్గర కూర్చోబెట్టి వచ్చాను’’ అని చెప్పారు ఆ ఆఫీసర్. పసికందు ఏడుపు ఆపడం లేదు. ‘‘వెళ్లి పాపను తెచ్చుకోండి’’ అన్నారు కిరణ్ బేడీ. ఆమె ముఖంలో సంతోషం. పరుగున వెళ్లి, పాపను ఎత్తుకుని తనతోపాటు లోపలికి తెచ్చుకుంది. ఆమె రాగానే మళ్లీ మీటింగ్ మొదలైంది. తల్లి ఒడిలో కూర్చొని ఉన్న పాప కూడా ఏడుపు మాని కిరణ్ బేడీ వైపే గంభీరంగా చూడ్డం మొదలు పెట్టింది. ఆ తల్లీ బిడ్డల ఫొటోను కిరణ్ బేడీ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ‘చైల్డ్ ఈజ్ హ్యాపీ’ అని కామెంట్ రాశారు. స్ట్రిక్ట్ ఆఫీసర్ అని కిరణ్‌బేడీకి పేరు. దేశంలోనే తొలి మహిళా ఐపీఎస్ అధికారి. కుటుంబ బాధ్యతల వల్ల మహిళలు ఉద్యోగాలను సరిగా చేయలేరు అనే మాటను కిరణ్ ఒప్పుకోరు. బిడ్డ ఏడుస్తుంటే పనిపై ధ్యాసపెట్టడం తల్లికి కష్టమే. బిడ్డ దగ్గర ఉంటే ఆ తల్లి ఇంకా బాగా పనిచేస్తుంది అంటారు ఆమె. ఇప్పుడీ ట్విట్టర్‌లో కూడా కిరణ్ బేడీ ‘చైల్డ్ ఈజ్ హ్యాపీ’ అన్నారు కానీ.. ‘మదర్ ఈజ్ హ్యాపీ’ అని అనలేదు. దానర్థం.. పిల్లల లాలన కూడా డ్యూటీలో భాగమేనని. పిల్లల బాధ్యతను సక్రమంగా నెరవేరిస్తే పిల్లలు సంతోషంగా ఉంటారు. వాళ్లసంతోషం తల్లిని సంతోషంగా ఉంచుతుంది. పనిలో తల్లి సామర్థ్యాన్ని పెంచుతుంది.



కూతురితో మీటింగ్‌లో కూర్చున్న ఐటీ శాఖ మహిళా కార్యదర్శి, (పక్కన) కిరణ్ బేడీ






సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
గురువారం
20-2-2020



● త్రివిక్రమ్, ఎన్టీఆర్

# అయినను పోయి రావలె హస్తినకు?

'అరవింద సమేత వీర రాఘవ' సినిమా కోసం దర్శకుడు త్రివిక్రమ్, హీరో ఎన్టీఆర్ తొలిసారి కలిశారు. ఈ సినిమా మంచి విజయం సాధించింది. మరోసారి ఈ కాంబినేషన్లో ఓ సినిమా తెరకెక్కనుంది. హారికా హాసినీ, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై యస్. రాధాకృష్ణ, కల్యాణ్రామ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. మే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. 2021 ఏప్రిల్లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఎన్టీఆర్ కెరీర్లో ఇది 30వ చిత్రం. ఈ సినిమాకు 'అయినను పోయి రావలె హస్తినకు' అనే టైటిల్ను పరిశీలిస్తున్నారని సమాచారం. కాంబినేషన్ కలవబోతున్న సంగతిని బుధవారం అధికారికంగా ప్రకటించారు. మరి టైటిల్ ఇదే షురూ అవుతుందా? వేచి చూడాలి.

# దుబాయ్ ప్రయాణం

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లవ్స్టోరీ'. నారాయణ్ దాస్, పి. రామ్మోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ దుబాయ్లో జరగనుంది. ఈ నెల 21 నుంచి నెలాఖరు వరకూ దుబాయ్లో చిత్రీకరణ జరుపుతారు. ఈ షెడ్యూల్లో ఓ పాటను, కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట చిత్రబృందం. ఈ సినిమాలో తెలంగాణ కుర్రాడి పాత్రలో కనిపించనున్నారు నాగచైతన్య. వేసవిలో విడుదల కానున్న ఈ సినిమాకి సంగీతం: పవన్, కెమెరా: విజయ్ సి.కుమార్.



● నాగచైతన్య, సాయి పల్లవి

# కరోనా ఎఫెక్ట్



● కమల్హాసన్

చైనాను వణికిస్తున్న కరోనా వైరస్ ఎఫెక్ట్ చెన్నైలో షూటింగ్ చేసుకుంటున్న 'ఇండియన్ 2'పై పడింది. కమల్హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'ఇండియన్ 2'. గతంలో వీరి కాంబినేషన్లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్, సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కోసం ఓ భారీ షెడ్యూల్ను చైనాలో షూట్ చేయాలనుకున్నారు. కరోనా వైరస్ ఇబ్బంది ఉండటంతో లొకేషన్ను మార్చుకోవాలనుకుంటున్నారట. ఈ షెడ్యూల్ను ఇటలీలో చేయనున్నారని తాజా సమాచారం.

# కపుల్ దేవ్



● రణ్వీర్ సింగ్, దీపికా పదుకోన్

''తన కలల కంటే కూడా తన భర్త కలల్ని తనవిగా భావించే స్త్రీలందరికీ ఈ సినిమా అంకితం'' అంటున్నారు దీపికా పదుకోన్. 1983లో భారత జట్టు తొలిసారి క్రికెట్ ప్రపంచ కప్ను గెలిచిన సంఘటన ఆధారంగా కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '83'. కపిల్ దేవ్ పాత్రలో రణ్వీర్ సింగ్ నటించారు. ఆయన భార్య రోమీ పాత్రను దీపికా పదుకోన్ చేశారు. ఆల్రెడీ రణ్వీర్ లుక్ని విడుదల చేశారు. రణ్వీర్–దీపికా కలిసి ఉన్న లుక్ను బుధవారం విడుదల చేశారు. వివాహం తర్వాత ఈ కపుల్ కలసి నటించిన చిత్రమిది. ''దేశానికి గర్వకారణంగా నిలిచిన సంఘటనతో తీసిన సినిమాలో చిన్న పాత్ర చేయడం గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు దీపికా. '83' ఏప్రిల్ 10న విడుదల కానుంది.

# ఛత్రపతి శివాజీగా రితేష్

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి బుధవారం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శివాజీ జీవితం ఆధారంగా మూడు భాగాల సినిమాను ప్రకటించారు బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్ముఖ్. మరాఠీ చిత్రం 'సైరాట్' ఫేమ్ నాగ్రాజ్ మంజులే దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. అజయ్–అతుల్ సంగీతాన్ని సమకూర్చనున్నారు. మొదటి భాగానికి 'శివాజీ', రెండో భాగానికి 'రాజా శివాజీ', మూడో భాగానికి 'ఛత్రపతి శివాజీ' అని టైటిల్ ఫిక్స్ చేశారు. మొదటి భాగం 2021లో విడుదల కానుంది. ''శివాజీ జయంతికి ఈ సినిమాను ప్రకటించడం సంతోషంగా ఉంది'' అన్నారు చిత్ర బృందం. సుమారు నాలుగైదు భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



● రితేష్ దేశ్ముఖ్

# తగ్గుతున్నా!



● కృతీసనన్

సాధారణంగా సంతానం లేనివారు పిల్లలను దత్తత తీసుకుంటారు. కానీ ఓ అనాథ యువకుడు తల్లిదండ్రులను దత్తత తీసుకుంటాడు. దాంతో అతని జీవితం మారుతుంది. అయితే అతని ప్రేమ, పెళ్లి విషయాల్లో సమస్యలు వస్తాయి. ఆ సమస్యలను ఆ యువకుడు ఎలా పరిష్కరించాడు? ఇందులో అతని ప్రేయసి ప్రమేయం ఎంత? అనే అంశాలకు కాస్త హాస్యం జోడిస్తూ హిందీలో ఓ సినిమా తెరకెక్కనుంది. రాజ్ కుమార్రావు, కృతీసనన్ హీరో హీరోయిన్లుగా నటించనున్నారు. పరేష్ రావల్, డింపుల్ కపాడియా కీలక పాత్రధారులు. ఈ సినిమా షూటింగ్ మార్చిలో ఢిల్లీలో ప్రారంభం కానుంది. ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు నిర్మాత దినేష్ విజన్ తెలిపారు. ప్రస్తుతం కృతీ 'మిమీ' అనే సినిమాలో నటిస్తున్నారు. ఇందులో ఆమె సరోగేట్ మదర్ పాత్ర చేస్తున్నారు. ఈ పాత్ర కోసం కృతీ 15 కిలోల బరువు పెరిగారు. రాజ్కుమార్ రావుతో ఒప్పుకున్న తాజా సినిమా కోసం బరువు తగ్గుతున్నారు.

# ఇక ఒకేసారి మూడు సినిమాలు చేయను

**"ఇష్క్' (2012)కి ముందు నావి 12 సినిమాలు ఆడలేదు. ఇంటికెళ్లిపోతామా? అనే ఆలోచన రాబోతున్నప్పుడు 'ఇష్క్' సూపర్హిట్గా నిలిచింది. ఆడియన్స్ మళ్లీ చాన్స్ ఇచ్చారనిపించింది. ఈ మధ్య నావి మూడు సినిమాలు (లై, ఛల్ మోహన్ రంగ, శ్రీనివాస కళ్యాణం) ఆడలేదు. జాగ్రత్తలు తీసుకుని 'భీష్మ' చిత్రం చేశాను. ఈ సినిమా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు నితిన్. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'భీష్మ'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా నితిన్ చెప్పిన విశేషాలు.**



● ఈ సినిమాలో 'మీమ్స్' క్రియేటర్గా నటించాను. నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. సినిమాలో ఒక లేయర్గా మాత్రమే సేంద్రియ వ్యవసాయం గురించిన ప్రస్తావన ఉంటుంది. సినిమాలో వచ్చే ఓ పొలం ఫైట్ను 'అతడు' సినిమాలోని ఫైట్ను ఇన్స్పిరేషన్గా తీసుకుని చేశాం. 'గుండెజారి గల్లంతయ్యిందే' తర్వాత బాగా డ్యాన్స్లు చేసే అవకాశం ఈ చిత్రంలో లభించింది. త్రివిక్రమ్గారు సినిమా చూసి హిట్ అవుతుందని చెప్పారు.

● నేను 'శ్రీనివాసకల్యాణం' సినిమా చేస్తున్నప్పుడు వెంకీ కుడుముల 'భీష్మ' కథ చెప్పారు. నా గత మూడు సినిమాలు అంతగా ఆడలేదు కాబట్టి 'భీష్మ' స్క్రిప్ట్ పూర్తిగా లాక్ అయిన తర్వాతే సెట్స్కు వెళ్దాం అని చెప్పాను. ఇందుకు కొంత సమయం పట్టింది. అలాగే 'రంగ్ దే' (వెంకీ అట్లూరి దర్శకత్వంలో...), 'చెక్' (చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో...) సినిమాల స్క్రిప్ట్స్ని కూడా విని ఓకే చేశాను. షూట్ కూడా స్టార్ట్ చేశాం. ఆ తర్వాత హిందీ హిట్ 'అంధాధూన్' తెలుగు రీమేక్ (మేర్లపాకగాంధీ దర్శకత్వంలో..), 'పవర్ పేట' (కృష్ణచైతన్య దర్శకత్వంలో) కథలను కూడా ఓకే చేశాను. గత ఏడాది నా సినిమా ఒక్కటి కూడా రాలేదు. కానీ ఈ ఏడాది నావి కనీసం నాలుగు సినిమాలు విడుదలవుతాయి. అయితే జీవితంలో ఇకపై మూడు సినిమాలను ఒకేసారి చేయను. సరిగ్గా నిద్ర లేదు. విశ్రాంతి లేదు. నాకు ఒక్క రోజు గ్యాప్ వస్తే చాలు.. నా కాల్షీట్ కోసం ముగ్గురు డైరెక్టర్స్ కొట్టుకుంటారు (నవ్వుతూ). ఇప్పుడు 'భీష్మ' అయిపోయింది కాబట్టి రిలాక్స్గా అనిపిస్తోంది.

● జాతీయ అవార్డు సాధించిన హిందీ హిట్ 'అంధాధూన్' తెలుగు రీమేక్లో నటించడం రిస్క్తో కూడుకున్న పని. కానీ చాలెంజింగ్గా తీసుకుని చేస్తున్నాను. నా కెరీర్ గ్రాఫ్ సరిగ్గా లేదని నాకూ అనిపిస్తోంది. అందుకే ఇప్పుడు జాగ్రత్తగా సినిమాలు చేస్తున్నాను.

● ఓ సినిమా బాగున్నప్పుడు అభినందనలు తీసుకున్న నేను, మరో సినిమా బాగోలేదన్నప్పుడు విమర్శలను కూడా తీసుకుంటాను. విమర్శలను విశ్లేషించుకుని తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతుంటాను. కమర్షియల్, డిఫరెంట్ సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్దాం అనుకుంటున్నా.

● ఇండస్ట్రీకి ఎప్పుడో వచ్చాను. అప్పట్లో బుట్టో.... ఇప్పుడు ముషారఫ్ ('దిల్' సినిమాలోని డైలాగ్) అన్నట్లు నన్ను యంగ్ హీరో అంటుంటే హ్యాపీగానే ఉంది కానీ నేను ఇంకా యంగ్ ఏంటీ? జట్టు కూడా నెరిసింది. గెడ్డం కూడా తెల్లబడింది అని నా ఇన్నర్ఫీలింగ్ (నవ్వుతూ).

## పెళ్లి ముచ్చట్లు

● పెళ్లనేది జీవితంలో ఓ బిగ్ స్టెప్. మెంటల్గా రెడీ అవ్వాలి. అందుకే కాస్త సమయం పట్టినట్లుంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న నిశ్చితార్థం జరుగుతుంది. దుబాయ్లో ఏప్రిల్ 16న వివాహం జరుగుతుంది. వచ్చిన తర్వాత ఏప్రిల్ 21న ఇండస్ట్రీ ప్రముఖులకు రిసెప్షన్ ఏర్పాటు చేస్తాం. షాలినీ (నితిన్ కాబోయే భార్య)కి నేను నటించిన 'ఇష్క్, సై' చిత్రాలంటే ఇష్టం ● నా పెళ్లి గురించి కొందరు హీరోలు సంతోషపడుతుంటే మరికొందరు బాధపడుతున్నారు. నాని ఏమో.. మా పెళ్లి బ్యాచ్లోకి రా అని పిలుస్తున్నాడు. రానా ఏమో 'ఏంటీ బ్రో' అంటున్నాడు. వరుణ్తేజ్.. 'ఏంటీ నితిన్ ఇలా చేశావ్. నీ వల్ల ఇప్పుడు మా ఇంట్లో నన్ను పెళ్లి చేసుకోమని అంటున్నారు' అన్నాడు (నవ్వుతూ).

# అప్పుడు మంచి సినిమా బతుకుతుంది

**- నందినీరెడ్డి**



● సుశీల్, సాయి రోనక్, ప్రీతి, నందినీరెడ్డి, తనికెళ్ల భరణి, సంగీత, క్రిష్, సుజోయ్

''మూడు నెలల క్రితం 'ప్రెజర్ కుక్కర్' చూసి, నచ్చింది కానీ చిన్న కరెక్షన్స్ చేయాలని చెప్పాను. 3 వారాల క్రితం మళ్లీ చూశాను. సుజోయ్, సుశీల్ మంచి సినిమా తీశారనిపించింది. 12 ఏళ్ల క్రితం ఇండస్ట్రీలోని చాలామంది హెల్ప్ చేయడం వల్ల నేనిప్పుడీ స్థాయిలో ఉన్నాను. ఈ సినిమా అద్భుతమైన విజయం సాధించి ఈ డైరెక్టర్లు ఇంకా మంచి సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను'' అన్నారు దర్శకుడు క్రిష్. సాయిరోనక్, ప్రీతి అస్రాని జంటగా సుజోయ్, సుశీల్ దర్శకత్వంలో సుశీల్ సుభాష్, అప్పిరెడ్డి నిర్మించిన చిత్రం 'ప్రెజర్ కుక్కర్'. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్లో దర్శకురాలు నందినీరెడ్డి మాట్లాడుతూ– ''బాగున్న సినిమాను చూసినవారు మరో పదిమందికి చూడమని చెబితే మంచి సినిమా బతుకుతుంది. ఈ టీజర్ చూసినప్పుడు నా ప్రెజర్ కుక్కర్ జర్నీ గుర్తుకు వచ్చింది'' అన్నారు. ''డైరెక్టర్ క్రిష్ మాకు ఎంతో సహాయం చేశారు. భవిష్యత్లో కొత్తవారికి మేం కూడా ఇలానే చేయాలని చెప్పారు. ఆ మాట గుర్తుపెట్టుకుంటాం. తరుణ్ భాస్కర్, 'మధుర' శ్రీధర్కు థ్యాంక్స్'' అన్నారు దర్శకులు. ''అమెరికా వెళ్లిన చాలామంది చాలా కష్టాలు పడుతున్నారు. నువ్వు అమెరికాకు వెళ్లకపోతే ఎందుకూ పనికిరావని తోమేస్తున్న తల్లిదండ్రులకు ఈ సినిమా ఓ కనువిప్పు'' అన్నారు నటుడు తనికెళ్ల భరణి. నటి సంగీత, హీరోలు సాయి రోనక్, విశ్వక్ సేన్, నిర్మాతలు రాజ్ కుందుకూరి, దర్శక–నిర్మాత 'మధుర' శ్రీధర్ తదితరులు మాట్లాడారు.

# కుర్రాడు లోకల్



● ధనుష్

తమిళ ప్రాచీన యుద్ధ విద్య అడిమురై నేపథ్యంలో రూపొందిన చిత్రం 'లోకల్ బాయ్'. ధనుష్ హీరోగా, మెహరీన్, స్నేహ హీరోయిన్లుగా తెలుగు నటుడు నవీన్ చంద్ర విలన్గా నటించారు. ఆర్.ఎస్. దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో 'పటాస్' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతికి తమిళంలో విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని జగన్మోహిని సమర్పణలో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సీహెచ్ సతీష్కుమార్ 'లోకల్ బాయ్' పేరుతో ఈ నెల 28న తెలుగులో విడుదల చేస్తున్నారు. సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ– ''మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ఈ సినిమా కోసం ధనుష్ మార్షల్ ఆర్ట్స్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ప్రాచీన యుద్ధవిద్య అడిమురై గొప్పదనం వివరించే చిత్రమిది. గతంలో ధనుష్, సెంథిల్ కుమార్ కాంబినేషన్లో వచ్చిన 'ధర్మ యోగి' చిత్రాన్ని తెలుగులో మేమే విడుదల చేశాం.. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఈ సినిమా కూడా అంతకంటే పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు.

# ఎర్లీగా వచ్చి ఎర్లీగా దూరం అయ్యాను



● లక్ష్

**''పదహారేళ్లకే ఇండస్ట్రీకి వచ్చాను. వచ్చినప్పటి నుంచే బ్రేక్ లేకుండా నటించాల్సింది. ఇండస్ట్రీకి ఎర్లీగా వచ్చి ఎర్లీగా దూరం అయ్యాను'' అన్నారు లక్ష్. రమేశ్ కుడుముల దర్శకత్వంలో లక్ష్ చదలవాడ, దిగంగనా సూర్యవంశీ జంటగా పద్మావతి చదలవాడ నిర్మించిన 'వలయం' రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా లక్ష్ చెప్పిన విశేషాలు.**

● చైల్డ్ ఆర్టిస్టుగా మూడు, హీరోగా నాలుగు సినిమాలు చేశాను. 'నీతో వస్తా' నా మొదటి సినిమా. ఆ నెక్ట్స్ 786, మేస్త్రీ, శంకర్ సినిమాలు చేశాను. ఆ తర్వాత సింగపూర్ వెళ్లి ఎంబీఏ చేసి దాదాపు 13 ఏళ్ల తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నాను. 'వలయం' వంటి మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమాలోని పాత్ర కోసం దాదాపు ఇరవై కేజీల బరువు తగ్గాను. ● 'బిచ్చగాడు' సినిమాతో నిర్మాతగా మారాను. ఈ రోజుల్లో చిన్న సినిమాలు విడుదల చేయడం కష్టం. సినిమా బాగుంటేనే ప్రేక్షకుల అటెన్షన్ ఉంటుంది. నిర్మాతగా చేయడం కన్నా కూడా హీరోగా నటించడమే కాస్త కష్టంగా అనిపించింది. ● దిశ సంఘటనకు, 'వలయం' చిత్రానికి సంబంధం లేదు. డైరెక్టర్ స్క్రిప్ట్ రాసినప్పుడే దిశ పేరు రావడం జరిగింది. అలాంటి సున్నితమైన సంఘటనను సినిమా ప్రచారానికి వాడుకున్నట్లు ఉంటుందని హీరోయిన్ పేరు మార్చాలని ప్రయత్నించాం. కానీ డబ్బింగ్లో లిప్ సింక్ కాకపోవడంతో అదే పేరు కొనసాగించాల్సి వచ్చింది.






# భుజం జాగ్రత్త!



ఈ ప్రపంచంలో ఏపని జరగాలన్నా భుజం కదిలించడం ద్వారానే అది సాధ్యం. మనకు ఎవరైనా బాగా దగ్గరివారైతే... 'అతడు నా కుడిభుజం' అంటూ కితాబిస్తాం. ఎవరికైనా బాధ్యతను అప్పగిస్తే... 'నీ భుజాల మీద పెడుతున్నా'నంటాం. కష్టసాధ్యమైన బాధ్యతను నెరవేరుస్తున్న వారిని... 'భారాన్నంతా తన భుజస్కంధాల మీద మోస్తున్నాడ'ంటాం. పనుల బాధ్యతలను పంచుకునే వాడు దూరమైతే నా కుడి భుజం విరిగినట్టయిందని సామెత చెబుతాం. ఇదీ భుజానికి ఉన్న ప్రాధాన్యత. దానికి ఏవైనా వైద్యపరమైన సమస్యలు వస్తే... మన పనులు మనం చేసుకోవడం సాధ్యం కాదు. అలాంటి పరిస్థితే రాకూడదని అందరూ భావిస్తారు. మన రోజువారీ పనులన్నింటికీ భుజం కాసే... ఆ అవయవం ప్రాధాన్యతనూ, దానికివచ్చే సమస్యలనూ, వాటి నివారణను తెలుసుకుందాం.

భుజంలో అత్యంత సంక్లిష్టమైన నాలుగు కీళ్లు, ముప్ఫయికి పైగా కండరాలు, ఆరు ప్రధానమైన లిగమెంట్లు ఉండి, అవన్నీ సమన్వయంతో కొనసాగుతూ మన రోజువారీ పనులన్నీ సక్రమంగా జరిగేలా చూస్తాయి. అయితే మన బరువంతా కాళ్లమీద పడుతుంది. కాబట్టి కాళ్ల అరుగుదలతో పోలిస్తే... భుజాలకు వచ్చే అరుగుదల సమస్యలు కాళ్ల అంతకాకపోయినా... కాస్తంత తరచుగా వీటికీ సమస్యలు రావడం చాలామందిలో కనిపించేదే. పైగా ఇటీవల క్రికెట్ వంటి ఆటల మూలంగా చేతిని గుండ్రంగా తిప్పుతూ బంతి విసరడం వల్ల భుజం పైన చాలా భారమే పడుతుండటం చాలా తరచూ కనిపించే విషయం. దాంతో ఫ్రోజెన్ షోల్డర్, భుజం కీలు అరగడం వల్ల వచ్చే రొటేటర్ కఫ్ వంటి అనేక సమస్యలు వస్తుంటాయి. భుజానికి వచ్చే అనేక సమస్యలు, వాటి పరిష్కారాలపై అవగాహన పెంచుకుందాం.

### షోల్డర్ ఆర్థ్రైటిస్

భుజం నిర్మాణంలో చేతి ఎముక బంతి అంత పరిమాణంలో ఉండి, భుజంలోని 'గోల్ఫ్‌టీ'తో పోల్చదగ్గ ఒక సాకెట్‌లో ఇమిడి ఉంటుంది. భుజాన్ని చాలా ఎక్కువగా ఎక్కువగా ఉపయోగించి పనిచేసేవారిలో చాలా ఏళ్ల తర్వాత ఈ ఎముక చివరన ఉండే బంతి వంటి భాగంలోని కార్టిలేజ్ (ఎముక చివరన మృదువుగా ఉండే మృదులాస్థి) అరిగిపోతుంది. కొన్నిసార్లు ఏదైనా గాయమైనప్పుడు లేదా భుజం 'గూడ' తప్పినప్పుడు లేదా భుజం విరిగినప్పుడు కూడా ఎముక చివరన ఉండే కార్టిలేజ్ దెబ్బతింటుంది. ఈ కారణం వల్ల కూడా షోల్డర్ ఆర్థ్రైటిస్ రావచ్చు. ఇలాంటప్పుడు భుజంలో నొప్పి వస్తుంది.

**లక్షణాలు:** భుజంలో తీవ్రమైన నొప్పి ఉంటుంది. కదలించినప్పుడు కీళ్ల మధ్య రాపిడి జరుగుతున్నట్లుగా ఉంటుంది. భుజం కదిలించడంలో ఇబ్బంది.

**నిర్ధారణ:** సాధారణ ఎక్స్–రేతో భుజం ఆర్థ్రైటిస్‌ను స్పష్టంగా నిర్ధారణ చేయవచ్చు.

**చికిత్స:** సమస్య తొలి దశలో ఉన్నప్పుడు ఫిజియోథెరపీ, ఇంజెక్షన్స్‌తో దీనికి చికిత్స చేయవచ్చు. అయితే భుజం నొప్పి తీవ్రంగా ఉండి, అనంతర దశల్లోకి ప్రవేశిస్తే... షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ లేదా రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ అవసరం కావచ్చు. సర్జరీ అవసరం ఎప్పుడన్నది ఆర్థ్రైటిస్ తీవ్రత మీద ఆధారపడుతుంది.

### ఫ్రోజెన్ షోల్డర్

ఈ సమస్య ప్రధానంగా పురుషుల్లో కంటే మహిళల్లోనే ఎక్కువ. సాధారణంగా 40 – 60 ఏళ్ల వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇది ఎందువల్ల వస్తుందో నిర్దిష్టంగా తెలియదు. కానీ... డయాబెటిస్ ఉన్నవారిలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తుంది. భుజానికి గాయమైన వారిలో, గతంలో ఏ కారణం వల్లనైనా భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నవారిలో మరింత ఎక్కువ. చేతి ఎముక, భుజంతో కలిసే చోట గుండ్రంగా ఉండి, అది అక్కడి సాకెట్‌లో ఇమిడి ఉండే భాగం చాలా సంక్లిష్టమైన నిర్మాణం. ఇందులో భుజం కీలు చుట్టూ కవచంలా ఉండే భాగాన్ని క్యాప్సూల్ అంటారు. ఈ సమస్య వచ్చినవారిలో కీలు అంతా బాగానే ఉన్నప్పటికీ క్యాప్సూల్ భాగం బాగా మందంగా మారుతుంది. ఇది ఎక్స్‌రేలో, ఎమ్మారైలో పెద్దగా కనిపించదు. ఈ సమస్య ఉన్నవారిలో భుజం కదలికలు చాలా పరిమితంగా మారతాయి. గతంలోలా భుజం సులువుగానూ, తేలిగ్గానూ కదిలించలేరు. విపరీతమైన భుజం నొప్పి ఉంటుంది. డయాబెటిస్ వచ్చినవారిలో ఈ నొప్పి ఎక్కువ. అందుకే ఈ నొప్పిని డయాబెటిస్‌కు ఒక సూచికగా కూడా డాక్టర్లు తీసుకుంటూ ఉంటారు.

**చికిత్స:** సాధారణంగా చాలామందిలో ఫ్రోజెన్ షోల్డర్ వల్ల వచ్చే నొప్పి కొన్నాళ్ల తర్వాత దానంతట అదే తగ్గిపోతుంటుంది. అయితే ఫ్రోజెన్‌షోల్డర్‌ని ఫిజియోథెరపీ, స్ట్రెచ్చింగ్ వ్యాయామాల ద్వారా తగ్గించవచ్చు. నొప్పి మరీ తీవ్రంగా ఉంటే పెయిన్ కిల్లర్స్‌తో కొద్దిమేర ప్రయోజనం ఉంటుంది. అయితే దీర్ఘకాలికంగా నొప్పినివారణ మందుల్ని అదేపనిగా వడటం మాత్రం చాలా ప్రమాదం. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొని పరిమితంగా... అందునా డాక్టర్ సలహా మేరకు మాత్రమే పెయిన్‌కిల్లర్స్ వాడాలి. పాశ్చాత్యదేశాల్లో ఉపయోగించే 'హైడ్రోడయలటేషన్' వంటి ప్రక్రియలు ఇప్పుడు మన వద్ద కూడా లభ్యమవుతున్నాయి. అరుదుగా ఆర్థోస్కోపీ వంటి ప్రక్రియలు అవసరం కావచ్చు.



### రొటేటర్ కఫ్ పెయిన్

ఎవరైనా మన చేతిని మెలిదిప్పితే... మన భుజం వద్ద కూడా నొప్పి రావడం చూస్తుంటాం కదా... చెయి మెలిదిప్పకపోయినా అచ్చం అలాంటి నొప్పే రొటేటర్ కఫ్ సమస్య ఉన్నవారిలో కనిపిస్తుంటుంది. రొటేటర్ కఫ్ అన్న సమస్య వారిలో భుజంలోని ఏడు ప్రధాన కండరాల్లో నాలుగు కండరాలు ప్రభావితమవుతాయి. ఈ కండిషన్ ఉన్నవారిలో చేతి ఎముకకూ, భుజం ఎముకకూ మధ్య ఉండాల్సిన గ్యాప్ తగ్గుతుంది. ప్రధాన కండరమైన రొటేటర్ కఫ్‌కు పగుళ్లు ఏర్పడతాయి. దాంతో గతంలో తమ భుజాన్ని చాలా తేలిగ్గా పైకి లేపగలిగిన వారు కూడా ఈ సమస్య ఉన్నప్పుడు భుజాన్ని పైకెత్తడంలో చాలా ఇబ్బందిని ఎదుర్కొంటారు. భుజాన్ని పక్కలకు కదిలించినా నొప్పి ఉంటుంది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేదా ఎమ్మారై ప్రక్రియల ద్వారా కండరాల్లో ఏవైనా పగుళ్లు ఉన్నాయేమో కనుగొంటారు.

**చికిత్స:** ఈ సమస్య ఉన్నవారిలో ఫిజియోథెరపీ మంచి ఉపశమనం కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇంజెక్షన్స్‌తో చికిత్స అవసరమవుతుంది. ఇక కొందరిలో ఆర్థోస్కోపీ ప్రక్రియ ద్వారా చేతి ఎముకకూ, భుజంలోపల ఉండే ఎముకకూ మధ్య ఉన్న గ్యాప్‌ను సరిచేస్తారు. ఈ సమస్య తీవ్రత తక్కువగా ఉన్నప్పుడే చికిత్స తీసుకోవాలి. లేకపోతే అది ఆర్థ్రైటిస్‌కు దారితీసి, భవిష్యత్తులో అతి సంక్లిష్టమైన 'షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ' అవసరం పడవచ్చు.



#### భుజం సమస్యల నివారణ ఇలా...

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇందువల్ల భుజం కండరాలు బలంగా మారి భుజానికి వచ్చే అనేక సమస్యలు నివారితమవుతాయి
- వ్యాయామంలో వెనకవైపు కండరాలపై కూడా దృష్టిపెట్టడం... చాలామంది శరీరానికి ముందువైపు ఉన్న కండరాలు బలంగా రూపొంది కనిపించడానికి తగిన వ్యాయామాలు చేస్తుంటారు. అయితే భుజం విషయంలో మాత్రం చేతులకు వెనకవైపున ఉండే కండరాలు కూడా అంతే బలంగా రూపొందేలా వ్యాయామాలు చేయాలి
- డయాబెటిస్ రోగులు తమ రక్తంలోని చక్కెర పాళ్లను ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. వారు వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం అవసరం
- కంప్యూటర్‌పై పనిచేసేవారు, వీడియోగేమ్స్ ఆడేవారు, టీవీ చూసేవారు, డ్రైవింగ్ చేసేవారు సరైన భంగిమలో కూర్చోవడం అవసరం.

#### ఆటల కారణంగా భుజానికి అయ్యే గాయాలతో...

భుజం ఎప్పుడూ కదులుతూ ఉండే భాగం కాబట్టి దానికి గాయమయ్యే అవకాశాలూ ఎక్కువే. ఉదాహరణకు భుజం గూడ తప్పడం (షోల్డర్ డిస్‌లొకేషన్), రొటేటర్ కఫ్ టేర్, స్లాప్ టేర్స్, టెండనైటిస్, టెండన్ రప్చర్స్ వంటివి జరగవచ్చు. సాధారణంగా ఆటల్లో భుజంలో గూడ తప్పడం సమస్య తరచూ కనిపిస్తుంటుంది. ఇలా జరిగినప్పుడు దాన్ని సరైన స్థానంలో అమర్చాల్సి ఉంటుంది. ఇదే సమస్య ప్రతి నిత్యం జరుగుతూ ఉంటే ఆర్థోస్కోపీ స్టెబిలైజేషన్ అనే శస్త్రచికిత్స ద్వారా వైద్య నిపుణులు దాన్ని సరిచేస్తారు.



డాక్టర్ కె. సుధీర్‌రెడ్డి, చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్,
ల్యాండ్‌మార్క్ హాస్పిటల్స్, హైదరాబాద్

డీటాక్సిఫికేషన్

# విషాలను వదిలేద్దామిలా!

మన చుట్టూ ఉన్న వాతావరణం ఎంతగా కలుషితమై ఉందో మనకు తెలియంది కాదు. అంతేనా... మనం రోజూ తినే పదార్థాల్లోనూ ఎన్నో రకాల హానికరమైన రసాయనాలుంటాయి. ఇలా మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి... ఇలా ప్రతి చోటా ఏవో వ్యర్థ రసాయనాల కారణంగా మనం నిత్యం ఎంతో కొంత మనకు సరిపడని రసాయనాల బారిన పడుతూనే ఉంటాం. అయితే... ఈ విషపదార్థాల నుంచి బయటపడటం ఎలా? ఇలాంటి హాని చేసే పదార్థాలను మన ఒంట్లోంచి బయటకు పంపడాన్ని డీ–టాక్సిఫికేషన్ అంటారన్నది తెలిసిందే. 'డి–టాక్స్' అని సంక్షిప్తంగా వ్యవహించే ఈ ప్రక్రియ కోసం చాలామంది పెద్ద పెద్ద డీ–టాక్స్ సెంటర్లనూ, నేచర్ కేర్ / నేచర్ క్యూర్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. అలాంటి కష్టమే లేకుండా ఇంట్లోనే స్వాభావిక పదార్థాలతో డీ–టాక్స్ చేసుకోవడం ఎలాగో తెలుసుకుందాం.



### శరీరంలో విష పదార్థాలు చేరే మార్గాలివి

- మన చుట్టూ ఉండే వాతావరణంలోకి దగ్గర్లో ఉండే పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థాలు, మోటార్ కార్ల నుంచి వెలువడే కర్బన రసాయనాలతో గాలి కలుషితం అవుతుంది. ఆ గాలి పీల్చినప్పుడు మన ఒంట్లోకి విష రసాయనాలు చేరతాయి. గాలి కాలుష్యం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉంది. డీజిల్ పొగ క్యాన్సర్ గడ్డలకు కారణమవుతుందని అనేక అధ్యయనాల్లో తేలింది
- అలాగే ఇవే పరిశ్రమలు నీళ్లలోకి వదిలే వ్యర్థాల ద్వారా నీళ్లు కలుషితమవుతాయి. ఇలాంటి పరిశ్రమలు కేవలం పొగమాత్రమే గాక... సీసం, పాదరసం వంటి హానికరమైన రసాయనాలను వెలువరిస్తూ... ఇటు గాలినీ, ఇటు నీళ్లనూ కలుషితం చేస్తుంటాయి
- ఇక మనం రోజూ వాడే ప్లాస్టిక్ పదార్థాల ద్వారా కొన్ని హానికర రసాయనాలు మనలోకి చేరతాయి. ఉదాహరణకు ప్లాస్టిక్‌లో బిస్‌ఫినాల్ అనే విషపూరితమైన పదార్థం ఉంటుంది. మనం రోజూ నీళ్లు తాగడానికి ఉపయోగించే ప్లాస్టిక్ బాటిల్స్, భోజనం పెట్టుకునే లంచ్‌బాక్స్‌లు... ఎలాంటి ఎన్నో పదార్థాల ద్వారా ఈ బిస్‌ఫినాల్ మన ఒంట్లోకి చేరుతుంది
- కలుషితమైన నీటిలో పెరిగే చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా కూడా మెర్క్యూరీ వంటి హానికర పదార్థాలు మన ఒంట్లోకి చేరుతుంటాయి
- వీటితో కొన్నిరకాల మందులు, హార్మోన్‌లు, ఫాస్ట్ ఫుడ్స్, సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ఉప్పు, చక్కెర కూడా శరీరాన్ని విషతుల్యం చేస్తుంటాయి.

### దుష్పరిణామాలివే...

హానికరమైన పదార్థాలు మన ఒంట్లోకి తీసుకోవడం వల్ల మలబద్ధకం, తలనొప్పి, వీపునొప్పి, పొట్టనొప్పితో పాటు ఇతర గ్యాస్ట్రో ఎంటరాలజీ సమస్యలు, బరువు తగ్గటం, హైబీపీ (హైపర్ టెన్షన్), చర్మసంబంధ సమస్యలు, పెద్ద పేగు క్యాన్సర్, ఊపిరితిత్తులు, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్‌ల వంటి సమస్యలు తలెత్తుతాయి.

### తీసుకోవాల్సినవి...

- పచ్చిగానే తినదగ్గ కూరగాయలను సలాడ్స్ రూపంలో తీసుకోవాలి. తాజా పండ్లను, నట్స్‌నూ, పప్పుదినుసులను, తృణధాన్యాలను మన ఆహారంగా మార్చుకోవాలి
- డీటాక్స్ డైట్‌లో భాగంగా ఆర్గానిక్‌గా పండించిన ఉత్పాదనలు ఉదా. బ్రౌన్‌రైస్, పండ్లు, ఉడకబెట్టిన కూరగాయలు తీసుకోవాలి
- డీటాక్స్ కోసం అల్లం, వెల్లుల్లి, దాల్చినచెక్క వంటివి ఆహారపదార్థాలపై చల్లి వాడటం మేలు. పసుపు వంటి వాటిని మజ్జిగలో కొద్ది మోతాదులో కలుపుకుని తాగవచ్చు. ఇక్కడ పేర్కొన్న సుగంధ ద్రవ్యాలన్నీ నేచురల్ డీటాక్సిఫైయర్స్ కాబట్టి అవి దేహం నుంచి ఎన్నో మలిన రసాయనాలను తొలగిస్తాయి
- రోజూ తగినంత నీటిని తాగాలి. రోజులో కనీసం మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి
- చేపల్లోని చాలా పోషకాలు, ప్రొటీన్లు ఒంటికి మంచిది. వీటిని ఎక్కువగా తీసుకోవాలి. అయితే కలుషిత జలాల్లో పెరిగిన చేపలు మంచిది కాదు. వాటిలోని మెర్క్యూరీ వల్ల మళ్లీ మనలోకి విషాలు చేరే అవకాశం ఉంది. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి
- ఎక్కువ క్యాలరీలను విడుదల చేసే కూల్‌డ్రింక్స్, కోలా డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉంటూ, స్వాభావికంగానే నీటి పాళ్లు ఎక్కువగా ఉండే కొబ్బరిబొండాలు, పండ్లరసాలు, మజ్జిగ వంటివి తాగాలి.

### సహజ డీటాక్సిఫికేషన్ కోసం ఇలా చేయండి...

### తీసుకో కూడనివి

- ప్రాసెస్‌డ్ ఫుడ్స్ అని పేర్కొనే రంగుపూసిన, ఎక్కువ పిండి వంటి పదార్థాలను పూసినవీ, చక్కెరలు కలిపినవీ, ఉప్పు ఎక్కువగావేసిన వాటికి దూరంగా ఉండాలి. మన జీర్ణ వ్యవస్థ ప్రాసెస్‌డ్ ఆహారాన్ని అంత తేలిగ్గా గ్రహించదు. వాటి కారణంగా కొన్ని సేంద్రీయ రసాయనాలు వెలువడి అవి ఒంట్లో విషపదార్థాలుగా రూపొంది, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి
- డీటాక్సిఫికేషన్ కోసం వారంలో ఏదో ఒకరోజు ఎంచుకొనిగానీ లేదా ప్రతి పదిహేనురోజులకోసారిగానీ... ఆరోజున పైన పేర్కొన్న స్వాభావికమైన పదార్థాలను (నేచురల్ ఫుడ్స్) మాత్రమే తీసుకుంటూ ఉండేలా ఒక నియమాన్ని పాటించడం చాలా మేలు చేస్తుంది. ఇలా క్రమబద్ధంగా చేయడం వల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. కాలేయానికి కూడా తగిన విశ్రాంతి లభించి, భారం తగ్గి మళ్లీ మరింత శక్తిమంతంగా పనిచేస్తుంది.

### డిటాక్స్ చేసుకోవడం ఎలా?

మన శరీరంలో సహజసిద్ధంగానే డీటాక్సిఫికేషన్ ప్రక్రియ నిత్యం జరుగుతూనే ఉంటుంది. తొలుత మొదటి దశలో ఆహారనాళం బ్యాక్టీరియాను నిరోధిస్తుంది. ఇలా చాలారకాల విషపూరిత పదార్థాలు శరీరంలోకి చేరకుండా చూసే యంత్రాంగం ఉంటుంది. ఆ దశను దాటుకుని ఏదైనా విషపూరిత పదార్థం శరీరంలోకి చేరితే దానిని కాలేయం విరిచేసి నీటిలో కరిగే పదార్థంగా మార్చి పంపుతుంది. అవి కిడ్నీలకు చేరి అక్కడినుంచి విసర్జితమవుతాయి. ఇదీ శరీరం తనకు తాను స్వాభావికంగానే (నేచురల్‌గా) డిటాక్సిఫై చేసుకునే ప్రక్రియ. అయితే శరీరం బయటకు పంపే దాని కంటే మనం అదేపనిగా విషాలను ఒంట్లోకి చేరుస్తుంటే వాటన్నింటినీ బయటకు పంపించడంలో కాలేయం అలసిపోతుంది. అందుకే పైన మనం పేర్కొన్న విష పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండటంతో పాటు... స్వాభావికంగానే మన దేహం నుంచి టాక్సిన్స్‌ను తేలిగ్గా బయటికి పంపగల ఆహారం తీసుకోవడం మేలుచేస్తుంది. ఇది ఆరోగ్యంగా ఉండటానికి ఎంతగానో దోహదపడుతుంది. డీటాక్సిఫికేషన్‌కు ఉపయోగపడే ఆహారాన్ని డీ–టాక్స్ డైట్ అంటుంటారు.

## ఏ వయసు మహిళ అయినా...

# రొమ్ముక్యాన్సర్‌కు అతీతం కాదు

వయసు, ఎత్తు, బరువు, పేద, ధనిక... ఇలాంటి ఏ అంశమూ క్యాన్సర్‌ను అడ్డుకోలేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిదిమందిలో ఒకరు రొమ్ముక్యాన్సర్‌కు గురవుతున్నారు. మన దేశంలో ప్రతి 22 మంది మహిళల్లో ఒకరు దీనిబారిన పడుతున్నారు. పట్టణమహిళల్లో ఇది చాలా ఎక్కువ. అధిక బరువు ఉండేవారిలో, వయసు పైబడిన స్త్రీలలో, లేటు వయసులో పిల్లలు పుట్టినవారిలో, పాలివ్వని స్త్రీలలో, రజస్వల త్వరగా అయినవారిలో, 55 ఏళ్లు పైబడ్డా మెనోపాజ్ రానివారిలో, దీర్ఘకాలికంగా హార్మోన్ చికిత్స తీసుకున్నవారిలో ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు ఎక్కువ. అయితే కేవలం వారికి మాత్రమే గాక ఎవరిలోనైనా ఇది వచ్చే ప్రమాదం ఉంది. తొలిదశలోనే కనుగొని, చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంది.

ఎత్తుకు తగిన బరువు, ఆరోగ్యకరమైన జీవనశైలి, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయడం వంటి అంశాలు ఎలాంటి ఆరోగ్య సమస్యనైనా కొంతవరకు దూరంగా ఉంచుతాయి. కానీ దురదృష్టవశాత్తు క్యాన్సర్ అన్నది ఆరోగ్యకరమైన జీవనశైలికి కూడా సవాల్ విసురుతోందనడానికి చాలా ఉదాహరణలే ఉన్నాయి. అయితే అనేక మంది ప్రముఖులు క్యాన్సర్‌ను జయించి మరెంతోమందికి స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తున్నారు. వారి అనుభవాలను ఇతరులతో పంచుకొని ధైర్యం నింపడమే కాకుండా, కొందరు పుస్తకరూపంలో తమ అనుభవాలను ఇతరులకు అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో ముందుకు దూసుకెళ్లిన స్త్రీలు, అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించడం మహిళలందరికీ ఓ పాఠం లాంటిది. మరీ ముఖ్యంగా క్యాన్సర్ అనగానే జీవితం అయిపోయిందని కుంగిపోయి, కొందరు చికిత్స కూడా తీసుకోకుండా జీవితాన్ని త్వరగా ముగించుకోవాలనుకునేవారు తప్పకుండా క్యాన్సర్ జయించిన వారి గురించి తెలుసుకోవాలి.

గౌతమి మనందరికీ తెలిసిన ప్రముఖ నటి. దక్షిణ భారతదేశంలోని అన్ని భాషలలో ప్రముఖ నటుల సరసన అనేక సినిమాల్లో నటించారు. 2004లో 35 ఏళ్ల వయసులో ఆమె రొమ్ములో క్యాన్సర్ గడ్డ ఉందని తెలిసినప్పుడు మొదట్లో కొంత ఆందోళన చెందినా ఆ తర్వాత ధైర్యంగా దాన్ని జయించగలిగాననీ, ఇప్పుడు వైద్యం ఎంతో అభివృద్ధి చెందిందనీ, వైద్యుల సలహాలు, సూచనలు పాటించగలిగితే పూర్తిగా నయమవుతుందని నమ్మకంగా చెబుతారామె. అలాగే ఒకప్పటి అమెరికా ప్రథమమహిళ లేడీ నాన్సీరీగన్, ఆస్ట్రేలియా నటి, గాయని కైలిమీనాగ్, 2010లో 53 వయసులో డక్టల్ కార్సినోమాను జయించిన మార్టినా నవ్రతిలోవా, బాలివుడ్ నటి ముంతాజ్ ఇలా క్యాన్సర్‌ను జయించిన వారెందరో ఉన్నారు. వీరంతా క్యాన్సర్ అనగానే భయాందోళనలకు గురయ్యే వారికి స్ఫూర్తిప్రదాతలు.

ఇక ప్రపంచ ప్రసిద్ధి చెందిన హాలివుడ్ నటి ఏంజిలినా జోలీ గురించి మరింత ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె తల్లి 56 ఏళ్ల వయసులో రొమ్ముక్యాన్సర్‌కు గురయి మరణించారు. దాంతో తనకు కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఏదైనా ఉందా అని తెలుసుకునేందుకు ముందుగానే బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 అనే జీన్ మ్యూటేషన్ పరీక్షలు చేయించుకున్నారు. ఆ పరీక్షల్లో తనకు క్యాన్సర్ వచ్చే ముప్పు ఉందని తెలియడంతో మాసెక్టమీ అనే ప్రక్రియ ద్వారా తన రెండు రొమ్ములనూ తొలగించుకోవడమే కాకుండా మే 14, 2013న ఆ విషయాన్ని ప్రపంచానికంతా తెలిపారు. అంతేకాదు... ఈ జీన్ మ్యూటేషన్ పరీక్ష పాజిటివ్ వచ్చినవారిలో అండాశయాల క్యాన్సర్ వచ్చే అవకాశాలు 50 శాతం ఉండటంతో తాను ఓవరీలు సైతం తొలగించుకునే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ఇలా జీవితం గురించి అవగాహన ఉన్నవారు, జీవితం చాలా అమూల్యమైనదని గుర్తించిన వారు మొదట్లో కొంత ఆందోళను గురైనా సరైన చికిత్స తీసుకుని తాము ఎంచుకున్న రంగాలలో కొనసాగుతున్నారు. అంతేకాదు తమకు ఇష్టమైన వ్యాపకాలను చేపట్టడం ద్వారా... అంటే కొందరు వ్యాయామాలు చేయడం, ఇంకొందరు లాఫింగ్ థెరపీని ఆశ్రయించడం, మరికొందరు రోజుకొక సినిమా చూడటం, ఎక్కువగా పుస్తకాలు చదవడం, బయటకు వెళ్లి నలుగురితో కలిసే పనులు చేయడం, మొక్కలు నాటడం, క్లాసులు తీసుకోవడం వంటి పనులు చేయడం వల్ల త్వరగా కోలుకోగలుగుతున్నారు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

ఎంత అవగాహన ఉన్నా, మనోధైర్యం ఉన్నా, వైద్యంలో ఆధునిక పద్ధతులు ఉన్నా క్యాన్సర్‌ను జయించడానికి అందరూ చేయాల్సింది మాత్రం తొలిదశలో గుర్తించడమే. క్యాన్సర్ కణాలు శరీరమంతా పాకిపోయిన తర్వాత, జీవితాన్ని మరికొంత పొడిగించడం తప్ప ఎవరూ ఏమీ లేయలేరనేది అక్షరసత్యం. రొమ్ములో మార్పులు త్వరగా గుర్తించగలరు కాబట్టి రొమ్ముక్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం తేలికే.

రొమ్ములో కణితిలాగా చేతికి తగలగానే క్యాన్సర్ అని అనుమానించి, ఆందోళన చెందాల్సిన అవసరం లేనేలేదు. నెలసరి ముందు రోజుల్లో, పాలిచ్చే స్త్రీలలో, మెనోపాజ్ దశలో రొమ్ములో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. కొంతకాలంగా కణితి అలాగే ఉంటూ, పెరుగుతూ, రొమ్ములోపల గట్టిగా చేతికి తగులుతూ, కదలకుండా, నొప్పిలేకుండా ఉంటే మాత్రం అనుమానించాల్సిందే.

ప్రతి స్త్రీ 20 ఏళ్ల వయసు నుంచే నెలసరి అయిన ఏడో రోజు స్నానం చేసేటప్పుడు సబ్బు రాసుకున్న చేతుతో, వేళ్లతో రొమ్ములను పరీక్షించుకోవాలి. అలా స్వయంగా పరీక్షించుకోవడంతోపాటు 30 ఏళ్లు పైబడ్డాక అల్ట్రాసౌండ్, మామోగ్రామ్ వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. మరీ అనుమానంగా ఉంటే ఎమ్మారై, బయాప్సీ వంటివి తప్పనిసరి. ఈ స్క్రీనింగ్ పరీక్షలతో రొమ్ములోని కణితి చేతికి కూడా తగలనంత చిన్న సైజులో ఉన్నప్పుడే పసిగట్టగలము. దగ్గరి బంధువుల్లో, రక్తసంబంధీకుల్లో రొమ్ముక్యాన్సర్ ఎక్కువగా ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి.

ఎలాంటి రిస్కులేనివారు 40 ఏళ్ల వయసులో ఒకసారి, ఆ తర్వాత 40 – 50 ఏళ్ల మధ్య ప్రతి రెండేళ్లకొకసారి, 50 ఏళ్లు పైబడ్డాక ప్రతి ఏడాదీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే కణితిని మాత్రమే తీసివేయగలిగే లంపెక్టమీ సాధ్యమవుతుంది. అలా రొమ్ముక్యాన్సర్ నుంచి విముక్తులు కావచ్చు.



# సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
20-2-2020


## ఉద్యోగ సమాచారం

### ఇండియన్ నేవీ-6

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ నేవీ.. డెహ్రాడూన్‌లోని నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ 6 డ్రాఫ్ట్స్‌మెన్ (కార్టోగ్రాఫిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రాఫ్ట్స్‌మెన్‌షిప్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి.
- **వయసు:** 18–25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 15–21)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** www.indiannavy.nic.in

### ఎంఓఐఎల్-36

భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన నాగ్‌పూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్).. 36 గ్రాడ్యుయేట్ ట్రెయినీ అండ్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** మైనింగ్, పర్సనల్, మార్కెటింగ్, మెటీరియల్, కెమికల్, మెటలర్జీ, మినరల్ ప్రాసెసింగ్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంబీఏ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ, ఎంటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** మార్చి 9, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** మార్చి 29, 2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 9, 2020
- **వెబ్‌సైట్:** www.moil.nic.in



# ఆకాశ హర్మ్యాలకు చిరునామా
# ఆర్కిటెక్చర్

నాటా-2020

పెద్ద పెద్ద భవనాలు.. వాణిజ్య సముదాయాలు.. ప్రముఖ కట్టడాలు.. అన్నీ ఆర్కిటెక్టర్ల ప్రతిభకు నిదర్శనాలు. వీరు అందించిన ప్లానింగ్, డిజైన్ బ్లూప్రింట్ ఆధారంగానే నిర్మాణాలను రూపొందిస్తారు. సృజనాత్మకత, కొత్తగా ఆలోచించడం, ఆధునికతకు అనుగుణంగా డిజైన్ల రూపకల్పన వంటి లక్షణాలు ఉంటే ఆర్కిటెక్చర్ మంచి కెరీర్‌గా నిలుస్తుంది. ఆర్కిటెక్చర్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే యువత బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సును పూర్తిచేయాలి. దేశవ్యాప్తంగా బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే నేషనల్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా)-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నాటా 2020కు సంబంధించిన సమగ్ర సమాచారం..

» బీఆర్క్‌లో ప్రవేశాలకు నాటా నోటిఫికేషన్
» ప్రతి ఏటా రెండుసార్లు ప్రవేశ పరీక్ష నిర్వహణ
» దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 16, 2020

### ఐదేళ్ల బీఆర్క్

బీఆర్క్ కోర్సు వ్యవధి ఐదేళ్లు. ఈ కోర్సులో భాగంగా ఆరు నెలల ప్రాక్టికల్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయడం తప్పనిసరి. నాలుగో ఏడాది తర్వాత విద్యార్థులకు జ్యూరీ నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బీఆర్క్ డిగ్రీ పట్టా ప్రదానం చేస్తారు. దేశంలోని ఆర్కిటెక్చర్ విద్యను, కాలేజీలను పర్యవేక్షించి, నియంత్రించే అధికారం కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు ఉంది. స్వతంత్ర ప్రతిపత్తితో ఈ సంస్థ పనిచేస్తుంది. ఆర్కిటెక్చర్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆర్కిటెక్ట్‌గా ప్రాక్టీస్ చేయాలంటే మాత్రం ఇందులో రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

### నాటా

నాటాలో మంచి స్కోర్ సాధిస్తే.. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 450కిపైగా ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఆర్క్ కోర్సులో ప్రవేశం పొందేందుకు అవకాశం లభిస్తుంది. జాతీయ స్థాయిలో 26 వేలకు పైగా బీఆర్క్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. డీమ్డ్ యూనివర్సిటీలతో సహా అన్ని కాలేజీలు నాటా ర్యాంకులను పరిగణనలోకి తీసుకొని ప్రవేశాలను కల్పిస్తాయి. విద్యార్థుల్లో ఉన్న ఆప్టిట్యూడ్ స్కిల్స్‌ను పరీక్షించడానికి ఈ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో డ్రాయింగ్, ఈస్థటిక్ సెన్సిటివిటీ, క్రిటికల్ థింకింగ్ వంటి అంశాలు ఉంటాయి. నాటా ఏడాదికి రెండు సార్లు జరుగుతుంది. రెండుసార్లు పరీక్షకు హాజరు కావచ్చు. రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

### అర్హతలు

- ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్య(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 50శాతం మార్కులు సాధించిన వారు అర్హులు.
- మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఉండి, 50శాతం మార్కులతో డిప్లొమా(10+3) పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కోర్సు ఫైనల్ ఇయర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వేషన్ వర్గాలకు అర్హత మార్కుల్లో ఐదు శాతం సడలింపు లభిస్తుంది.

### పరీక్ష విధానం

మొత్తం 200 మార్కులకు నాటా పరీక్ష జరుగుతుంది. నాటా పరీక్షను రెండు భాగాలుగా నిర్వహిస్తారు. ఒకటి డ్రాయింగ్ టెస్ట్, రెండు ఈస్థటిక్ సెన్సిటివిటీ టెస్ట్. ఈ రెండింటిలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకుమాత్రమే బీఆర్క్‌లో ప్రవేశాలను కల్పిస్తారు.

### పార్ట్-ఏ (డ్రాయింగ్ టెస్ట్)

ఈ పరీక్షను ఆఫ్‌లైన్ విధానం(పేపర్ బేస్డ్)లో నిర్వహిస్తారు. మొత్తం మూడు ప్రశ్నలుంటాయి. 35, 35, 55 మార్కుల చొప్పున మొత్తం 125 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష కాల వ్యవధి 135 నిమిషాలు. ఇందులో స్కెచ్ విజువలైజింగ్, క్రియేటివిటీ, అండర్‌స్టాండ్ స్కేల్ అండ్ ప్రపోర్షన్స్ ఆఫ్ ఆబ్జెక్ట్, జియోమెట్రిక్ కాంపోజిషన్, షేప్, బిల్డింగ్ ఫామ్స్ అండ్ ఎలిమెంట్స్, కలర్ టెక్చర్స్, హార్మొని అండ్ కాంట్రాస్ట్, డ్రాయింగ్ ఆఫ్ ప్యాటర్న్, ఫామ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్ ఇన్ 2డీ, 3డీ, సబ్‌స్ట్రాక్షన్, రొటేషన్, సర్ఫేసెస్ అండ్ వాల్యూమ్స్, జనరేటింగ్ ప్లాన్స్ వంటి వాటిపై ప్రశ్నలుంటాయి.

### పార్ట్-బి (ఈస్థటిక్ సెన్సిటివిటీ టెస్ట్)

మొత్తం విభాగాలు కలిపి 75 మార్కులకు జరిగే ఈ పరీక్ష కాల వ్యవధి 45 నిమిషాలు.

- ఈ పరీక్షలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ నుంచి 15 ప్రశ్నలుంటాయి. దాంతోపాటు జనరల్ ఆప్టిట్యూడ్‌పై 35 ప్రశ్నలుంటాయి. ఇలా మొత్తం 50 ప్రశ్నలు ఒక్కో ప్రశ్నకు 1.5 మార్కుల చొప్పున 75 మార్కులకు ఉంటుంది.
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో అభ్యర్థుల్లోని సృజనాత్మకత, పరిశీలనాత్మక దృక్పథం, ఆర్కిటెక్చర్‌పై అవగాహన, ఇమాజినేషన్, వంటి అంశాలపై అభ్యర్థులకున్న ప్రతిభ, నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఈ పరీక్షలో ఎలాంటి నెగిటివ్ మార్కులుండవు. కానీ పార్ట్–ఏ, పార్ట్–బిలలో రెండింటిలో 25 శాతం మార్కులు సాధిస్తేనే బీఆర్క్ కోర్సులో ప్రవేశాలకు అర్హత లభిస్తుంది.

| విభాగాలు సబ్జెక్టు | మార్కులు | సమయం |
|---|---|---|
| పార్ట్ –ఏ డ్రాయింగ్ | 125 | 135 ని. |
| పార్ట్ –బీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ అప్టిట్యూడ్ | 75 | 45 ని. |

### దరఖాస్తు ఫీజు

జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000 (ఒకసారి పరీక్షకు), రూ.3800 (రెండుసార్లు పరీక్షకు); ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 1700 (ఒకసారి పరీక్షకు), రూ.3100 (రెండుసార్లు పరీక్ష ).

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ప్రారంభ తేదీ:** ఫిబ్రవరి 01, 2020 (ఏప్రిల్, మే సెషన్)
- **దరఖాస్తుకు ముగింపు తేదీ:** మార్చి 16, 2020 (ఏప్రిల్), మే 04, 2020 (మే సెషన్)
- **ఎడిట్ ఆప్షన్:** మార్చి 21–23, 2020 (ఏప్రిల్), మే 09–11, 2020 ( మే సెషన్)
- **పరీక్ష తేదీ:** 19 ఏప్రిల్ 2020, మే 31, 2020
- **వెబ్‌సైట్:** www.nata.in



### అద్భుత నిర్మాణాలు

ప్రస్తుతం ప్రపంచం సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంటుంది. అబ్బురపరిచే నిర్మాణాలు, ఆకట్టుకునే డిజైన్‌లు ఇలా ప్రతీ దానికీ అందమైన ఆకృతిని ఇచ్చే నిపుణులే ఆర్కిటెక్ట్‌లు. ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణరంగం అతివేగంగా దూసుకుపోతోంది. అటువంటి నిర్మాణాలకు చక్కని రూపాన్నిచ్చే ఆర్కిటెక్ట్‌లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో అనేక ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్వే, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్, నేషనల్ బిల్డింగ్, ఆర్గనైజేషన్స్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. ఇలా చాలా ప్రభుత్వ, అనుబంధ విభాగాలతోపాటు ప్రయివేటు విభాగాల్లో కూడా ఉపాధి అవకాశాలుంటాయి.

### ఇద్దరూ ప్రధానమే!

నిర్మాణ రంగాలకు సంబంధించి ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజనీరింగ్.. రెండూ ముఖ్యమే! ఆర్కిటెక్చర్ అంటే..యజమానుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని వారి కళల భవనానికి ఒక రూపాన్ని ఇచ్చే వృత్తి. అలాగే సివిల్ ఇంజనీర్ ఒక నిర్మాణానికి సంబంధించి పునాదుల దగ్గర నుంచి పటిష్టత, నాణ్యత, వాస్తు, డ్రెయినేజీ, రోడ్ల తదితర అంశాలపై పనిచేయాల్సి ఉంటుంది. పెద్ద పెద్ద వంతెనలు, ప్రాజెక్టుల నిర్మాణంలో సివిల్ ఇంజనీర్‌లదే కీలక పాత్ర.

# ఆఫ్ క్యాంపస్ ఆఫర్స్.. అందుకునే మార్గం

**క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్.. ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లు మొదలు స్థానిక కళాశాలల్లో చదివే విద్యార్థుల వరకు.. ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తుంటారు! వీటిలో విజయం సాధించి ఆఫర్ అందుకుంటే.. కెరీర్‌లో తిరుగుండదనే భావన! అలాంటి అవకాశం చేజారితే విద్యార్థుల్లో భవిష్యత్తు గురించి ఆందోళన మొదలవుతుంది! జాబ్ మార్కెట్‌లో స్వీయ ఉద్యోగాన్వేషణలో.. సఫలం అవడమెలా? అనే సందేహం! జాబ్ మార్కెట్‌లో.. ఉద్యోగాన్వేషణకు అందుబాటులో ఉన్న మార్గాలేంటి? ఆఫ్-క్యాంపస్‌లో కంపెనీలు అనుసరిస్తున్న విధానాలు.. వాటిలో రాణించడమెలాగో తెలుసుకుందాం...**



» తుది దశకు చేరుకున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్
» క్యాంపస్‌లో ఆఫర్స్ అందని విద్యార్థుల్లో ఆందోళన
» ఆదరువుగా నిలుస్తున్న ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్
» స్వీయ ఉద్యోగాన్వేషణకు మార్గాలు అనేకం

జాబ్ ట్రెండ్స్

మరికొద్ది రోజుల్లో 2019–20 విద్యా సంవత్సరం ముగియనుంది. ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ సైతం తుది దశకు చేరుకుంది. పలు స్టాఫింగ్ సంస్థల అంచనాల ప్రకారం– ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో నూటికి తొంబై శాతం మందికి క్యాంపస్ ఆఫర్స్ లభించాయి. కానీ.. టైర్–2, టైర్–3 ఇన్‌స్టిట్యూట్‌ల్లో అందిన ఆఫర్ లెటర్లు అంతంతమాత్రమే. మరి.. ఇలాంటి ద్వితీయ శ్రేణి కళాశాలల్లో చదివే విద్యార్థులు తమ కార్పొరేట్ కొలువుల కలను సాకారం చేసుకోవడానికి మార్గం ఏంటి? అంటే.. వినిపిస్తున్న సమాధానం 'ఆఫ్–క్యాంపస్' రిక్రూట్‌మెంట్స్. ప్రస్తుతం పలు ప్రముఖ సంస్థలు మొదలు అనేక కంపెనీలు ప్రతిభావంతులను ఒడిసి పట్టుకునేందుకు అనుసరిస్తున్న విధానమే.. ఆఫ్–క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్!

### ఉమ్మడి వేదిక

ఆఫ్–క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ అంటే.. స్థూలంగా నియామకాలకు ఉమ్మడి వేదికగా పేర్కొనవచ్చు. ఈ ప్రక్రియలో చదివిన కాలేజీతో సంబంధం లేకుండా.. ప్రతి ఒక్కరూ పాల్గొనొచ్చు. వాస్తవానికి సంస్థలు నిర్దిష్ట సంఖ్యలో నియామకాలు చేపట్టేందుకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తాయి. సంస్థ అవసరాలకు తగ్గ నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించకుంటే.. ఆఫ్ క్యాంపస్ నియామకాలు చేపడతాయి. దాంతోపాటు అప్పటికప్పుడు ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు ఆఫ్‌క్యాంపస్ నియామక విధానాలను అనుసరిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో కంపెనీలు విడుదలచేసే నియామక ప్రకటనలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎంపిక ప్రక్రియకు హాజరవుతారు. అదేవిధంగా జాబ్‌సెర్చ్ పోర్టల్స్ ద్వారా సంస్థల్లో ఖాళీల వివరాలు తెలుసుకొని పోటీపడుతుంటారు.

### అనేక మార్గాలు

ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పరంగా ఇప్పుడు యువత ముందు ఎన్నో అవకాశాలు, మరెన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. కానీ.. విద్యార్థుల్లో అధిక శాతం మందికి వీటిపట్ల సరైన అవగాహన లేకపోవడంతో అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ఇటీవల కాలంలో సంస్థలు.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌తోపాటు.. ఆఫ్ క్యాంపస్ నియామకాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం.. ప్రతిభావంతులు ఎక్కడున్నా.. గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశమే. ఇలాంటి పరిస్థితుల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అవకాశం లభించని అభ్యర్థులు.. 'ఆఫ్–క్యాంపస్' విధానం వైపు దృష్టిసారించాలని నిపుణులు సూచిస్తున్నారు. సంస్థలు అనుసరిస్తున్న ఆఫ్ క్యాంపస్ నియామక విధానాలపై అవగాహన పెంచుకొని ఆఫర్లను అందిపుచ్చుకోవాలంటున్నారు.

### టాలెంట్ టెస్టులు

ఆఫ్ క్యాంపస్ నియామకాల పరంగా పలు ప్రముఖ సంస్థలు కొత్తగా అనుసరిస్తున్న విధానం.. టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించడం. ఇంతకాలం పేరున్న కాలేజీల్లోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్న సంస్థలు.. ఇప్పుడు ప్రతిభ ఎక్కడున్నా గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా టాలెంట్ రిక్రూట్‌మెంట్ టెస్టులకు శ్రీకారం చుట్టాయి. తద్వారా సాధారణ కాలేజీలో కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సైతం తమ ప్రతిభను నిరూపించుకొని.. కార్పొరేట్ కొలువు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయి. ఇలాంటి విధానం ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, బీపీఓ సంస్థల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఈ టెస్ట్‌లకు సంబంధించి సదరు సంస్థలు తమ వెబ్‌సైట్స్‌లోనూ, పత్రికల్లోనూ ప్రకటనలు విడుదల చేస్తున్నాయి.

### వెబినార్స్

ఇటీవల కాలంలో ఆఫ్–క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ పరంగా సంస్థలు అనుసరిస్తున్న మరో విధానం... వెబినార్స్. నిర్దిష్ట సంఖ్యలో అభ్యర్థులను ఆన్‌లైన్ విధానంలో ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకొచ్చి.. ఏదైనా ఒక అంశానికి సంబంధించి టాస్క్‌లు ఇవ్వడం లేదా గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించడం వంటివి చేస్తున్నాయి. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉండే ఈ వెబినార్స్ విషయంలోనూ సాఫ్ట్‌వేర్ సంస్థలే ముందంజలో నిలుస్తున్నాయి.

### హ్యాకథాన్స్

ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ విధానంలో హ్యాకథాన్ ముందంజలో నిలుస్తోంది. ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని.. దానికి కోడింగ్, ప్రోగ్రామ్ రాయమని కోరే పోటీలే హ్యాకథాన్‌లు. వీటికి నమోదు చేసుకున్న అభ్యర్థులను బృందాలుగా విభజించి.. సంబంధిత టాస్క్‌ను ఇస్తున్నాయి. హ్యాకథాన్ పోటీలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లోనూ నిర్వహిస్తున్నారు. బృందాలతోపాటు, వ్యక్తిగతంగానూ ఈ పోటీలను జరుపుతున్నారు. కంపెనీ మెచ్చే విధంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ రూపొందించిన వారికి.. తదుపరి దశ ఎంపిక ప్రక్రియలు (ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ రౌండ్ తదితర) లేకుండానే నేరుగా ఆఫర్ లెటర్స్ అందిస్తున్నాయి. విజేతలకు నగదు బహుమతులను కూడా ఇస్తున్నాయి. హ్యాకథాన్‌ల నిర్వహణకు సంస్థలు ఉమ్మడి వేదికలను ఎంచుకుంటున్నాయి. నిర్దిష్టంగా ఒక ప్రాంతంలోని ఏదైనా ఒక కళాశాలను ఎంచుకొని.. దానికి సమీప ప్రాంతాల్లోని విద్యార్థులంతా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నాయి.

### రిఫరల్ ఎంట్రీ

ఆఫ్ క్యాంపస్ నియామకాల పరంగా ఇప్పుడు రిఫరల్ ఎంట్రీ విధానం సైతం ప్రముఖంగా వినిపిస్తోంది. అంటే.. ఒక సంస్థలో.. ఖాళీలు, అవసరమైన అర్హతలు, నైపుణ్యాల గురించి తమ ఉద్యోగులకు తెలియజేసి.. అందుకు సరితూగే అభ్యర్థులను రిఫర్ చేయమని అడగడం. దీనివల్ల నియామక ప్రక్రియలో వ్యయ ప్రయాసల నుంచి ఊరట లభిస్తుందని కంపెనీలు భావిస్తున్నాయి. అ ప్పటికే తమ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులు.. సంస్థ అవసరాలకు అనుగుణంగా మెరుగైన అభ్యర్థులనే సిఫార్సు చేస్తారని భావిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న తమ స్నేహితులు, సన్నిహితులతో నిరంతరం సంప్రదిస్తుండాలి.

### సోషల్ నెట్‌వర్క్

ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ విధానంలో కంపెనీలు అభ్యర్థుల సోషల్ నెట్‌వర్క్ ప్రొఫైల్స్‌ను పరిశీలించడం ద్వారా అవకాశాలు కల్పిస్తున్నాయి. సదరు అభ్యర్థులు సోషల్ నెట్‌వర్క్‌లో ఎంత చురుగ్గా ఉన్నారు.. ఎలాంటి అంశాలపై స్పందిస్తున్నారు.. అనుసరించే వారి ప్రొఫైల్స్ ఎలా ఉంది.. వంటివి పరిశీలిస్తున్నాయి. సోషల్ నెట్‌వర్క్‌లో ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న వారికే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. అంటే.. తమ సబ్జెక్ట్‌కు సంబంధించిన నిపుణులను అనుసరించడం.. వారితో సంబంధిత సబ్జెక్టుల్లో తాజా పరిణామాలపై సంప్రదింపులు చేయడం వంటివి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ఔత్సాహికులు తమ సోషల్ నెట్‌వర్క్‌లో చాటింగ్, పోస్టింగ్స్ పరంగా హుందాగా వ్యవహరించడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

### జాబ్ పోర్టల్స్

ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ పరంగా అందుబాటులో ఉన్న మరో మార్గం.. జాబ్ పోర్టల్స్ ద్వారా ఉద్యోగాన్వేషణ సాగించడం. ఇలాంటి అభ్యర్థులు ముఖ్యంగా తమ కీ స్కిల్స్, నాలెడ్జ్ విషయంలో రెజ్యూమేను ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్ది అప్‌లోడ్ చేయాలి. వీలైనంత మేరకు రెజ్యూమే రెండు పేజీల్లో ఉండేలా చూసుకోవాలి. నిర్దిష్టంగా తమకు పట్టున్న డొమైన్ గురించి పేర్కొనాలి. ఫలితంగా సదరు డొమైన్ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్స్‌నే తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఏదైనా ఒక ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేటప్పుడు అందుకు అవసరమైన స్కిల్స్, జాబ్ ప్రొఫైల్ వంటి వాటిని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. తమకు సరితూగుతాయి అనుకుంటేనే దరఖాస్తు చేయాలి. ఈ–మెయిల్ అలర్ట్స్, ఎస్ఎంఎస్ అలర్ట్స్ ద్వారా జాబ్ పోర్టల్స్ నుంచి నిరంతరం తమకు తగ్గ ఉద్యోగాల గురించి తెలుసుకోవచ్చు.

### సంస్థల వెబ్‌సైట్స్

ఆఫ్‌క్యాంపస్ విధానంలో ఉద్యోగాన్వేషణ సాగిస్తున్న అభ్యర్థులు నిరంతరం సంస్థల అధికారిక వెబ్‌సైట్స్‌ను పరిశీలిస్తుండాలి. ఇటీవల కాలంలో కొన్ని సంస్థలు తమ కంపెనీ వెబ్‌సైట్‌లోనే కెరీర్ ఆప్షన్స్ లింక్‌లో తాజా ఖాళీల గురించి పేర్కొంటున్నాయి. వాటికి అవసరమైన అర్హతలు, ఎంపిక ప్రక్రియ గురించి పూర్తి వివరాలు పొందుపరుస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ డొమైన్ ఏరియాకు సంబంధించిన సంస్థల వెబ్‌సైట్స్‌ను.. అందులోని కెరీర్ లింక్‌ను నిరంతరం అనుసరిస్తుండాలి.

### ఇంటర్న్‌షిప్స్

ఆన్ క్యాంపస్ డ్రైవ్స్‌లో నిరుత్సాహానికి గురైన అభ్యర్థులకు తక్షణం అందుబాటులో ఉన్న మార్గం.. ఇంటర్న్‌షిప్స్. వీటిద్వారా రియల్ టైమ్ నైపుణ్యాలను సొంతం చేసుకోవచ్చు. ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో మంచి పనితీరు కనబరిస్తే అదే సంస్థలో కొలువు సొంతం అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటర్న్‌షిప్స్ అవకాశం కోసం సంస్థల్లో పనిచేస్తున్న తమకు తెలిసిన వారి సిఫార్సుతోనో లేదా తమ కాలేజీ ప్రొఫెసర్స్ రిఫరెన్స్ ద్వారానో ప్రయత్నించొచ్చు. ఇంటర్న్‌శాల, ఇంటర్న్‌ఇండియా వంటి సంస్థలు.. విద్యార్థులకు, సంస్థలకు మధ్య వారధిగా ఉంటూ.. ఇంటర్న్‌షిప్ అవకాశాల గురించిన వివరాలను తమ వెబ్‌సైట్స్‌లో పొందుపరుస్తున్నాయి. విద్యార్థులు ఇలాంటి వెబ్‌సైట్స్‌ను అనుసరించడంతోపాటు, అందులో తమ ప్రొఫైల్స్‌ను అప్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఇంటర్న్‌షిప్ అవకాశం సొంతం చేసుకోవచ్చు.

### ఆఫ్ క్యాంపస్ నియామకాల సంఖ్య

ఆఫ్ క్యాంపస్ డ్రైవ్స్ ద్వారా జరిపే నియామకాల సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువగానే ఉంటోంది. కంపెనీలు ప్రతిభ ఎక్కడున్నా గుర్తించి నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కాబట్టి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అవకాశం లేని విద్యార్థులు స్వీయ ఉద్యోగాన్వేషణ సాగించేందుకు సన్నద్ధులై ఉండాలి. ఇందుకోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్స్ కూడా సహకరిస్తున్నాయి. ప్లేస్‌మెంట్ సెల్స్‌ను, సీనియర్లను సంప్రదించడం ద్వారా సంస్థల ఆఫ్ క్యాంపస్ డ్రైవ్ విధి విధానాల గురించి తెలుసుకోవచ్చు.

– **ప్రొఫెసర్ ఏముల ప్రదీప్ కుమార్**, ఫ్యాకల్టీ ఇంచార్జ్, ఐఐటీ–హెచ్ ప్లేస్‌మెంట్ సెల్


నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
SOCIAL STUDIES







epaper.sakshi.com



టెస్టు సిరీస్ ట్రోఫీతో విలియమ్సన్, కోహ్లి

# ‘టెస్టు’ సమయం

## రేపటి నుంచి భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టు ● ఆత్మవిశ్వాసంతో టీమిండియా

### సత్తా చాటేందుకు విలియమ్సన్ సేన సిద్ధం ● ఉదయం 4 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

**ఉపఖండం బయట ఇతర దేశాల్లో పోలిస్తే న్యూజిలాండ్‌లోనే భారత జట్టు తక్కువ సంఖ్యలో టెస్టు క్రికెట్ ఆడింది. 1967 నుంచి 2014 వరకు 9 టెస్టు సిరీస్‌లలో పాల్గొంటే ఆడిన మ్యాచ్‌లు 23 మాత్రమే! గత ఏడాది కివీస్ పర్యటనలో కూడా టెస్టులు ఆడాల్సి ఉండగా... తెల్లవారుజామున భారత అభిమానులు టెస్టులు చూడరంటూ ప్రసారకర్తలు తెచ్చిన ఒత్తిడితో షెడ్యూల్ నుంచి టెస్టులను తొలగించి వన్డేలు, టి20లకే పరిమితం చేశారు. ఇప్పుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగం కావడంతో తప్పనిసరిగా ఆడాల్సిన స్థితిలో భారత జట్టు ఐదు రోజుల ఫార్మాట్‌కు సన్నద్ధమైంది. స్వింగ్‌కు బాగా అనుకూలించే కివీస్ పిచ్‌లపై టీమిండియాకు ఎర్ర బంతితో అతి పెద్ద సవాల్ ఎదురవ్వడం ఖాయం. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు రేపటితో తెర లేవనుంది.**

**వెల్లింగ్టన్:** టి20, వన్డే సిరీస్‌లను సమంగా పంచుకున్న తర్వాత భారత్, న్యూజిలాండ్ ఇప్పుడు సాంప్రదాయ ఫార్మాట్‌కు సై అంటున్నాయి. ఇరు జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా రేపటి నుంచి (శుక్రవారం) తొలి మ్యాచ్ జరుగుతుంది. సొంతగడ్డపై వరుస సిరీస్ విజయాల తర్వాత భారత జట్టు మళ్లీ టెస్టు బరిలోకి దిగుతుండగా... ఇటీవలే ఆస్ట్రేలియా చేతిలో క్లీన్‌స్వీప్‌నకు గురైన కివీస్ స్వదేశంలో తమ రాత మార్చుకోవాలని పట్టుదలగా ఉంది. కోహ్లి నాయకత్వంలో న్యూజిలాండ్ గడ్డపై భారత్ టెస్టులు ఆడుతుండటం ఇదే మొదటిసారి కావడం విశేషం.

### విహారికి చోటు!

టీమిండియా తమ ఆఖరి టెస్టును కోల్‌కతాలో బంగ్లాదేశ్‌పై ఆడింది. అక్కడితో పోలిస్తే వాతావరణం, పిచ్ పరిస్థితులు న్యూజిలాండ్‌లో పూర్తిగా భిన్నం కాబట్టి స్వల్ప మార్పులు ఖాయం. రోహిత్ శర్మ గాయంతో దూరం కావడంతో మయాంక్‌కు తోడుగా పృథ్వీ షా ఓపెనింగ్ చేయడం దాదాపుగా ఖాయమైంది. బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ ఇదే సంకేతాన్నిచ్చింది. కాబట్టి శుబ్‌మన్ గిల్ టెస్టు అరంగేట్రం కోసం కొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. అయితే ప్రతికూల వాతావరణంలో కివీస్ పేసర్లను సమర్థంగా ఎదుర్కొని ఓపెనర్లు పరుగులు సాధించడం అంత సులువు కాదు. జట్టుకు శుభారంభం దక్కకపోతే ఆ తర్వాత అది మ్యాచ్‌పై ప్రభావం చూపించవచ్చు. సొంతగడ్డపై టీమ్ మేనేజ్‌మెంట్ ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌నే ఆడించేది. కానీ కివీస్‌లాంటి చోట లోతైన బ్యాటింగ్ అవసరం కాబట్టి ఆరో స్థానంలో కూడా రెగ్యులర్ బ్యాట్స్‌మన్‌ను ఆడించక తప్పని పరిస్థితి. అందుకోసం ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి సిద్ధంగా ఉన్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో కఠిన పరిస్థితుల్లో పట్టుదలగా నిలబడి అతను సాధించిన సెంచరీ కూడా విహారికి అనుకూలంగా మారింది. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లకే మొగ్గు చూపవచ్చు. గత రెండున్నరేళ్లలో ఇదే వ్యూహంతో విదేశాల్లో ప్రత్యర్థి జట్లను ఆలౌట్ చేశామంటూ కోహ్లి వ్యాఖ్యానించడం అతని ఆలోచనను స్పష్టం చేసింది. గాయం నుంచి కోలుకున్న ఇషాంత్ శర్మ ఎలాంటి ఇబ్బంది లేకుండా నెట్స్‌లో బౌలింగ్ చేశాడు. కాబట్టి అతనితో పాటు షమీ, బుమ్రాలు పేస్ భారం మోస్తారు. స్పిన్నర్‌గా మాత్రం ఒకరికే చోటు ఉంది. అశ్విన్ లేదా జడేజాలలో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరం. 2013 నుంచి విదేశాల్లో ఇద్దరి రికార్డు దాదాపు ఒకేలా ఉంది. కీపర్‌గా సందేహం లేకుండా వృద్ధిమాన్ సాహానే ఉంటాడు కాబట్టి రిషభ్ పంత్‌కు నిరాశ తప్పదు. 2014లో ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ప్రస్తుత జట్టులో కోహ్లి, పుజారా, రహానే, జడేజా, ఇషాంత్, షమీలకు ఉంది. కాబట్టి పరిస్థితులు పూర్తిగా కొత్త కాదు. ఆస్ట్రేలియాలో గెలిచినట్లుగా న్యూజిలాండ్ లోనూ సిరీస్ విజయం సాధిస్తే నాయకుడిగా కోహ్లి ఘనతల్లో మరొకటి చేరుతుంది.





### తుది జట్ల వివరాలు (అంచనా):

**భారత్:** కోహ్లి (కెప్టెన్), పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్, పుజారా, రహానే, విహారి, అశ్విన్/రవీంద్ర జడేజా, వృద్ధిమాన్ సాహా, ఇషాంత్ శర్మ, షమీ, బుమ్రా.

**న్యూజిలాండ్:** విలియమ్సన్ (కెప్టెన్), లాథమ్, బ్లన్‌డెల్, రాస్ టేలర్, నికోల్స్, వాట్లింగ్, గ్రాండ్‌హోమ్, సౌతీ, జేమీసన్, బౌల్ట్, హెన్రీ.

### పిచ్, వాతావరణం

బేసిన్ రిజర్వ్ మైదానం పిచ్‌పై బుధవారం 15–18 మిల్లీ మీటర్ల మందం పచ్చిక కనిపించింది. మ్యాచ్ రోజు కూడా పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. కాబట్టి పేసర్లకు బాగా అనుకూలం. పైగా ఇది ఓపెన్ గ్రౌండ్ కావడం వల్ల 100 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు స్వింగ్‌ను శాసిస్తాయి. బ్యాట్స్‌మెన్ ఆరంభ పరీక్షను అధిగమించాల్సి ఉంటుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకోవచ్చు. వర్షం సమస్య లేదు.

### వాగ్నర్ అవుట్!

తొలి టెస్టుకు ముందే కివీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేస్ బౌలర్ నీల్ వాగ్నర్ వ్యక్తిగత కారణాలతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. భార్య ప్రసవం కారణంగా వాగ్నర్ వెల్లింగ్టన్‌కు రావడం లేదని కివీస్ బోర్డు ప్రకటించింది. గత కొన్నేళ్లలో బౌల్ట్, సౌతీలతో పోలిస్తే వాగ్నర్ అత్యంత ప్రమాదకర కివీస్ బౌలర్‌గా మారాడు. కీలకమైన మ్యాచ్‌కు ముందు అతను దూరం కావడం జట్టుపై ప్రభావం చూపడం ఖాయం. ఇది సీనియర్లు బౌల్ట్, సౌతీలకు అదనపు భారం కానుంది. వాగ్నర్ స్థానంలో హెన్రీని తీసుకున్నారు. అయితే పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్ అయిన హెన్రీ టెస్టు రికార్డు మరీ పేలవంగా ఉంది. సొంతగడ్డపైనే 6 టెస్టుల్లో 12 వికెట్లు తీయగా సగటు 50కు పైగా ఉంది! అయితే మ్యాచ్ ముందు రోజు పిచ్‌ను బట్టి చూస్తే కివీస్ నలుగురు పేసర్లతో దిగాలని భావిస్తున్నట్లు అర్థమవుతోంది. కైలీ జేమీసన్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేయవచ్చు. ఏకైక స్పిన్నర్ ఎజాజ్ పటేల్‌కు తుది జట్టులో స్థానం కష్టమే. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఇటీవల న్యూజిలాండ్ బ్యాటింగ్ విఫలమైంది. ఇప్పుడు దానిని చక్కబెట్టుకునేందుకు ఆ జట్టుకు అవకాశం వచ్చింది. లాథమ్, బ్లన్‌డెల్ ఓపెనర్లుగా శుభారంభం ఇవ్వగల సమర్థులు. మూడు, నాలుగు స్థానాల్లో విలియమ్సన్, రాస్ టేలర్‌ల అనుభవమే జట్టుకు కీలకం. వీరిద్దరు తమ స్థాయికి తగినట్లుగా ఆడితే భారత్‌కు ఇబ్బందులు తప్పవు. వికెట్ కీపర్ వాట్లింగ్ బ్యాట్స్‌మన్‌గా కూడా తన సత్తా ఏమిటో ఇటీవలే ఇంగ్లండ్‌పై అద్భుత డబుల్ సెంచరీతో చూపించాడు. చివరి వన్డేలో భారత్ ఓటమికి కారణమైన గ్రాండ్‌హోమ్ ఆల్‌రౌండర్‌గా సత్తా చాటగలడు. మొత్తంగా కివీస్ బ్యాటింగ్ కూడా బలంగానే కనిపిస్తోంది. భారత పేస్ త్రయాన్ని వీరు సమర్థంగా ఎదుర్కోగలిగితే ఆపై జట్టును ఆపడం కోహ్లి బృందానికి కష్టం కావచ్చు.

| | |
|---|---|
| **2** | న్యూజిలాండ్ గడ్డపై 9 టెస్టు సిరీస్‌లు ఆడిన భారత్ 2 గెలిచి, 5 ఓడింది. మరో 2 డ్రాగా ముగిశాయి. 2014 సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0తో గెలిచింది. |
| **5** | భారత్ గెలిచిన టెస్టుల సంఖ్య. మొత్తం 23 ఆడగా... కివీస్ 8 మ్యాచ్‌లలో విజయం సాధించింది. మిగిలిన 10 ‘డ్రా’గా ముగిశాయి. |
| **3-0** | భారత్‌లో 2016లో జరిగిన సిరీస్‌లో చివరిసారి ఈ రెండు జట్లు తలపడగా... భారత్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది |

# రాస్ టేలర్ ‘ట్రిపుల్’ సెంచరీ



**భారత్‌తో** జరిగే తొలి టెస్టుతో న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతున్నాడు. ఇది అతని కెరీర్‌లో 100వ టెస్టు కావడం విశేషం. తద్వారా ఏ జట్టు తరఫు నుంచైనా మూడు ఫార్మాట్‌లలోనూ కనీసం వంద మ్యాచ్‌లు ఆడిన తొలి ఆటగాడిగా అతను రికార్డులకెక్కుతున్నాడు. 36 ఏళ్ల టేలర్ ఇప్పటి వరకు 99 టెస్టులు, 231 వన్డేలు, 100 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడాడు. న్యూజిలాండ్ తరఫున డానియల్ వెటోరి (112), స్టీఫెన్ ఫ్లెమింగ్ (111), బ్రెండన్ మెకల్లమ్ (101) తర్వాత వంద టెస్టులు ఆడనున్న నాలుగో ఆటగాడిగా టేలర్ నిలిచాడు.

### మరో మూడేళ్లు ఇంతే జోరుగా...

గత ఎనిమిదేళ్లుగా నేను మ్యాచ్‌లతో పాటు ప్రయాణాలు, ప్రాక్టీస్‌లు కలుపుకుంటే సంవత్సరంలో దాదాపు 300 రోజులు క్రికెట్ ఆడుతున్నాను. అయినా ఎక్కడా దూకుడు, తీవ్రత తగ్గదు. ఇక కెప్టెన్‌గా అదనపు ఒత్తిడి ఎలాగూ ఉంటుంది. కానీ ఒకటి మాత్రం ఖాయం. ఇదే జోరులో నేను అన్ని ఫార్మాట్‌లలో కనీసం వచ్చే మూడేళ్ల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడగలను. మరిన్ని కఠిన సవాళ్లకు సిద్ధంగా ఉన్నా. శరీరం అలసిపోవడం సహజమే కానీ అప్పుడప్పుడు తీసుకునే విరామాల వల్ల నేను మళ్లీ కోలుకోగలుగుతున్నా. గతంలో చెప్పినట్లు నా దృష్టిలో టెస్టు ఫార్మాటే అన్నింటికంటే అత్యుత్తమం. ఐసీసీ టోర్నీలపరంగా చూస్తే ఇప్పుడు జరుగుతున్న టెస్టు చాంపియన్‌షిప్‌కే నేను అగ్రస్థానం ఇస్తా.

– విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

# మా బలం... సానుకూల దృక్పథం

## ఏ జట్టునైనా ఒత్తిడిలోకి నెట్టగలం

### ఆసీస్‌తో పోరుకు రె‘ఢీ’ ● భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్



**సిడ్నీ:** మహిళల టి20 ప్రపంచకప్‌లో ఎంతటి జట్టునైనా ఒత్తిడిలోకి నెట్టే సత్తా భారత్‌కు ఉందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. సానుకూల దృక్పథమే తమ జట్టు బలమని, నాలుగుసార్లు చాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఎదుర్కొనేందుకు జట్టు సిద్ధంగా ఉందని చెప్పింది. శుక్రవారం జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్... ఆతిథ్య ఆసీస్‌తో తలపడనుంది. ‘మా మైండ్‌లో పాజిటివ్ ఎనర్జీ ఉన్నంతవరకు ఏ జట్టు ఎదురైనా బెంగలేదు. ఎంతటి మేటి జట్టునైనా కంగుతినిపించగలం. స్లో వికెట్ స్టేడియాలు మాకు బాగా అనుకూలిస్తాయి. సిడ్నీ షోగ్రౌండ్ కూడా స్లో ట్రాకే. ఇది మాకు బాగా సరిపోతుంది’ అని హర్మన్ తెలిపింది. భారతీయులంతా క్రికెట్ అభిమానులే కావడంతో ఉత్సాహపరిచే ప్రేక్షకుల మధ్య తప్పకుండా శుభారంభం చేస్తామని చెప్పింది. తొలి మ్యాచ్ కోసం తామంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నామని పేర్కొంది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హర్మన్‌కు అక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. ఇది జట్టుకు ఉపయోగపడుతుంది.



# చెన్నైలో సింధు పేరుతో అకాడమీ

**చెన్నై:** ప్రపంచ చాంపియన్, భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు పేరుతో చెన్నైలో అకాడమీ నిర్మాణమవుతోంది. ‘హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్’ ఆధ్వర్యంలో చెన్నై శివారులో ఈ అకాడమీని నిర్మిస్తున్నారు. బుధవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి తెలుగుతేజం సింధు స్వయంగా హాజరై పునాదిరాయి వేసింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ అనేది ధ్యానం నేర్పించే సంస్థ. కమలేశ్ పటేల్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థలో ఆమె ధ్యానం నేర్చుకున్నారు. మొత్తం 8 కోర్టులతో అత్యాధునిక హంగులతో నిర్మించనున్న ఈ అకాడమీని 18 నుంచి 24 నెలల్లో పూర్తిచేయనున్నట్లు తెలిసింది. జిమ్, ఫిజియో సెంటర్లు అందుబాటులో ఉంచుతారు. 1000 మంది ప్రేక్షకులు సౌకర్యంగా కూర్చునే ఏర్పాట్లు చేయనున్నారు.

# సౌరాష్ట్రతో ఆంధ్ర సై!

## నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్

**సాక్షి, ఒంగోలు:** రంజీ ట్రోఫీలో ఐదేళ్ల తర్వాత క్వార్టర్ ఫైనల్ చేరిన ఆంధ్ర ఇప్పుడు సెమీస్ బెర్తుపై కన్నేసింది. నేటి నుంచి స్థానిక సీఎస్‌ఆర్ శర్మ కాలేజీ మైదానంలో జరిగే క్వార్టర్ ఫైనల్లో శ్రీకర్ భరత్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు గత రన్నరప్ సౌరాష్ట్రతో తలపడుతుంది. సెమీస్ బెర్త్ లక్ష్యంగా బరిలోకి దిగుతున్న ఆంధ్రకు సౌరాష్ట్రను ఎదుర్కోవడం అంత సులభం కాదు కానీ... సొంతగడ్డపై జరిగే ఈ మ్యాచ్‌లో స్థానిక అనుకూలతలతో పైచేయి సాధించాలని ఆంధ్ర భావిస్తోంది. నిజానికి ఈ సీజన్ ఆరంభంలో ఆంధ్ర నిలకడగా రాణించింది. దీంతో ఎలైట్ ‘ఎ అండ్ బి’ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. అయితే లీగ్ దశ సాగేకొద్దీ ప్రతికూల ఫలితాలతో వెనుకబడింది. ఇక ముగింపుకొచ్చేసరికి వరుసగా రెండు పరాజయాలతో ఐదో స్థానానికి పడిపోయింది. టాపార్డర్‌లో జ్ఞానేశ్వర్, ప్రశాంత్‌లతోపాటు రికీ భుయ్, శ్రీకర్ భరత్‌లు రాణిస్తే ఆంధ్ర భారీస్కోరు సాధించే అవకాశముంటుంది. బౌలింగ్‌లో శశికాంత్, స్టీఫెన్, రఫీ మళ్లీ మెరిపించాలి. గత రన్నరప్ సౌరాష్ట్ర మేటి ఆల్‌రౌండ్ జట్టు. ఈ సీజన్‌లో ఒకే ఒక్క మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ చేతిలో ఓడింది. మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందిన సౌరాష్ట్ర నాలుగు మ్యాచ్‌ల్ని ‘డ్రా’ చేసుకుంది.



భరత్

# సైనా, శ్రీకాంత్ శుభారంభం

**బార్సిలోనా (స్పెయిన్):** భారత బ్యాడ్మింటన్ స్టార్స్ సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా 21–16, 21–14తో వైవోని లి (జర్మనీ)పై నెగ్గగా... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 23–21, 21–18తో శుభాంకర్ డే (భారత్)ను ఓడించాడు. పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రణయ్ 18–21, 15–21తో డారెన్ లియు (మలేసియా) చేతిలో ఓడిపోగా... వైగోర్ కోల్హో (బ్రెజిల్)తో జరిగిన మ్యాచ్‌లో కశ్యప్ మూడో గేమ్‌లో 12–14 స్కోరు వద్ద గాయంతో వైదొలిగాడు. జయరామ్ 21–14, 21–12తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)పై, సమీర్ వర్మ 21–12, 21–9తో క్లియర్‌బౌట్ (ఫ్రాన్స్)పై గెలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా జంట 10–21, 21–16, 21–17తో క్రిస్టియాన్సెన్–బోయె (డెన్మార్క్) జోడీపై గెలిచింది.

# భారత రెజ్లర్ల తీన్‌మార్...

## ఒకే రోజు మూడు కాంస్య పతకాలు



హర్‌దీప్



ఆదిత్య

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై భారత రెజ్లర్లు ఆకట్టుకున్నారు. ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు బుధవారం గ్రీకో రోమన్ శైలిలో అశు (67 కేజీలు), ఆదిత్య కుందు (72 కేజీలు), హర్‌దీప్ (97 కేజీలు) భారత్‌కు మూడు కాంస్య పతకాలను అందించారు. జ్ఞానేందర్ (60 కేజీలు) కాంస్య పతక పోరులో ఓడిపోయాడు. కాంస్యం కోసం జరిగిన బౌట్‌లలో అశు 8–1తో అబ్దుల్ కరీమ్ మొహమ్మద్ అల్ హసన్ (సిరియా)ను ఓడించగా... ఆదిత్య 8–0తో నవో కుసాకా (జపాన్)పై, హర్‌దీప్ 3–1తో బెక్‌సుల్తాన్ (కిర్గిస్తాన్)పై విజయం సాధించారు. జ్ఞానేందర్ 0–6తో బఖ్‌రమోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశాడు. ఓవరాల్‌గా భారత్‌కు గ్రీకో రోమన్ విభాగంలో ఐదు పతకాలు లభించాయి. నేడు, రేపు మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో పోటీలు జరుగుతాయి. ఆ తర్వాత శని, ఆదివారాల్లో పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో పోటీలుంటాయి.

# సానియా జంట పరాజయం

**న్యూఢిల్లీ:** దుబాయ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సానియా మీర్జా (భారత్)–కరోలినా గార్సియా (ఫ్రాన్స్) ద్వయం పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సానియా–గార్సియా జంట 4–6, 2–6తో సాయ్‌సాయ్ జెంగ్ (చైనా)–బార్బరా క్రెజిసికోవా (చెక్ రిపబ్లిక్) జోడీ చేతిలో ఓడిపోయింది. మరోవైపు ఫ్రాన్స్‌లో జరుగుతున్న మార్సెలీ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)–షపోవలోవ్ (కెనడా) జంట 5–7, 7–6 (7/3), 8–10తో నీల్సెన్ (డెన్మార్క్)–టిమ్ పుయెట్జ్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

## గ్లాస్టర్‌షైర్ కౌంటీ జట్టుతో పుజారా ఒప్పందం

**లండన్:** భారత టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా కౌంటీల్లో గ్లాస్టర్‌షైర్‌తో జతకట్టాడు. ఏప్రిల్‌లో మొదలయ్యే ఇంగ్లిష్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఆడేందుకు 32 ఏళ్ల భారత బ్యాట్స్‌మన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా ఏప్రిల్ 12 నుంచి మే 22 వరకు అతను నాలుగురోజుల మ్యాచ్‌లు 6 ఆడతాడు. పుజారా కౌంటీలాడటం ఇదేం కొత్తకాదు. గతంలో డెర్బీషైర్, యార్క్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్
55-17-2 to 4, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్, విజయవాడ-520 007
Email : procurement.apmarkfed@gmail.com
Webpage : www.apmarkfed.in
షార్ట్ టెండర్ ప్రకటన
ఆంధ్రప్రదేశ్‌లో వివిధ గోదాములలో ఉన్న కందులు మరియు పసుపును e-Auction Platforms ద్వారా విక్రయము చేయుటకు ప్రకటన
ఈ అక్షన్ 24.02.2020వ తేదీ నుండి మొదలగును RFP కొరకు www.apmarkfed.in, www.neml.in, www.agribazaar.com మరియు mktyard.com యొక్క వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం.లు: 9642332994, 9652076541, 9553996949, 9676412341.
సం/- మేనేజింగ్ డైరెక్టర్

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED
Corporate Office : H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati - 517503
Tender Notice No.CGM/Projects/08/2019-20, Dt.20.02.2020
Bids through "eprocure.gov.in" are invited from the eligible bidders under T&D Funding towards Request for Expression of Interest for Survey, Design, supply, install, commission, integration of 5,64,000Nos 3Ph, 4W whole current DLMS meter (10A-60A)/CT Operated with built in modem & 5 years AMC on LV side of Agriculture DTRs and data acquisition to APSPDCL MDAS server in 8 districts of APSPDCL/APCPDCL. The tender will be made available from 20.02.2020, 23:00Hrs in the Central Public Procurement Portal www.eprocure.gov.in.
CHIEF GENERAL MANAGER/PROJECTS

భారత ప్రభుత్వం
అంతరిక్ష శాఖ
నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్
బాలానగర్, హైదరాబాద్-500037, తెలంగాణ, ఇండియా.
టెలిఫోన్: +040-23884173/74, ఫ్యాక్స్: +040-23884179
కన్‌స్ట్రక్షన్ & మెయింటెనెన్స్ గ్రూప్
ఇ-టెండరు ప్రకటన
దిగువ తెలిపిన పనుల కోసం Gr. హెడ్ CMG, NRSC, హైదరాబాద్ వారిచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి.

| NIT నం. | పని పేరు | సుమారు అంచనా వ్యయం (రూ.) | టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు కాలవ్యవధి | బిడ్ అప్‌లోడింగ్ కోసం ఆఖరు తేది |
|---|---|---|---|---|
| NRSC/CMG/BN/NIT/9021/ET/64/2019-20 | NRSC క్యాంపస్, బాలానగర్ వద్ద క్యాంటీన్ సపోర్ట్ సర్వీసుల నిర్వహణ/ హౌస్‌కీపింగ్ కోసం వార్షిక కాంట్రాక్ట్. | రూ.219.76 లక్షలు | 20.02.2020 నుండి 27.02.2020 వరకు | 03.03.2020న 16:00 గంటల వరకు |
| NRSC/CMG/NIT/ES/ET/9505/15/2019-20 | NRSC క్యాంపస్, షాద్‌నగర్ వద్ద పెస్ట్, టర్మైట్ & రోడెంట్ కంట్రోల్ కోసం సమగ్ర AMC. | రూ.9.50 లక్షలు | 20.02.2020 నుండి 27.02.2020 వరకు | 03.03.2020న 16:00 గంటల వరకు |

సవివరమైన NIT మరియు అర్హతా ప్రమాణాలు, EMD బిడ్డింగ్ డాక్యుమెంట్ మొదలైనవి www.tenderwizard.com/ISRO పోర్టల్‌లో చూసి/దాని నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అన్ని సవరణలు, గడువు పొడిగింపు, స్పష్టీకరణలు మొ॥ అన్నీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడతాయి మరియు వార్తా పత్రికలలో ప్రచురించబడవు. బిడ్డర్లు తమంతటతాము అప్‌డేట్ చేసుకోవడానికి క్రమబద్ధంగా వెబ్‌సైట్‌ను దర్శించవలెను.
సం/-
గ్రూప్ హెడ్,
కన్‌స్ట్రక్షన్ & మెయింటెనెన్స్ గ్రూప్





## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 429 ▲ | 134 ▲ |
| 41,323 | 12,126 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

| సూచీ | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,825 | ▲ 93 |
| డోజోన్స్ | 29,386 | ▲ 154 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,457 | ▲ 75 |
| డాక్స్ | 13,789 | ▲ 108 |
| షాంఘై | 2,975 | ▼ 10 |
| నికాయ్ | 23,400 | ▲ 207 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యూఎస్ డాలర్ | 70.64 | 73.28 |
| బ్రిటన్ పౌండ్ | 91.60 | 95.23 |
| యూరో | 75.99 | 79.36 |
| జపాన్ ఎన్ (100) | 61.00 | 69.00 |
| ఆస్ట్రేలియా డాలర్ | 46.93 | 49.38 |
| సింగపూర్ డాలర్ | 50.56 | 53.07 |
| సౌదీ రియాల్ | 18.28 | 19.90 |
| యూఏఈ దిర్హామ్ | 19.01 | 20.22 |
| చైనా యువాన్ | 9.61 | 10.86 |

# బొమ్మ బంపర్ హిట్!



**పైరసీతో సినీ రంగం నష్టపోతోందంటూ పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. థియేటర్లకు వెళ్లి చూసే ప్రేక్షకుల సంఖ్యేమీ తగ్గడం లేదు. సినిమా కలెక్షన్లు అలవోకగా వందల కోట్లు దాటడమూ ఆగడం లేదు. ఆర్థిక వ్యవస్థలో మంద గమనం భయాల్లాంటివి ఎలా ఉన్నా .. సినీ ప్రేమికులు రేటెంతైనా సరే టికెట్లు కొనుక్కుని చూసేందుకు మొగ్గుచూపుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. గతేడాదే సినిమాలపై ప్రేక్షకులు ఏకంగా రూ. 10వేల కోట్లపైగానే వెచ్చించారు.**

**న్యూఢిల్లీ:** కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉంటున్న సినిమా టికెట్ల అమ్మకాలు మళ్లీ జోరు అందుకుంటున్నాయి. పైరసీ కష్టాలు ఎలా ఉన్నా.. టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ తేడా లేకుండా సినీ ప్రియులు .. రేటెంతయినా సరే టికెట్లు కొనుక్కుని థియేటర్లలో చూసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. గతేడాది గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఒర్మాక్స్ మీడియా అనే కన్సల్టింగ్ సంస్థ రూపొందించిన బాక్సాఫీస్ రిపోర్ట్ 2019 ప్రకారం.. భారతీయులు గతేడాది 103 కోట్ల సినిమా టికెట్లు కొనుగోలు చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 10,948 కోట్లు వెచ్చించారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 11.6 శాతం అధికం. 2018లో దేశీ సినీ ప్రియులు 94.5 కోట్ల టికెట్లు కొనుగోలు చేశారు. ఇందుకోసం రూ. 9,810 కోట్లు వెచ్చించారు. అమ్ముడైన టికెట్లలో దాదాపు మూడో వంతు వాటా హిందీ సినిమాలదే ఉంది. 19 శాతం తమిళ సినిమాలు, 18 శాతం తెలుగు సినిమాల వాటా ఉంది. హాలీవుడ్, మలయాళం సినిమాలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

### ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం..

సినిమాలు బంపర్ కలెక్షన్లు సాధించడంలో భాష ప్రధానంగా ఉంటోంది. ప్రభాస్ నటించిన సాహో (హిందీ, తమిళం, తెలుగు) బాక్సాఫీస్ ఆదాయాల్లో అత్యధికంగా 60 శాతం వాటా హిందీ నుంచే వచ్చినట్లు ఒర్మాక్స్ మీడియా సీఈవో శైలేష్ కపూర్ పేర్కొన్నారు. ఇక హృతిక్ రోషన్ నటించిన బాలీవుడ్ సినిమా 'వార్' కలెక్షన్లలో గణనీయ భాగం తెలుగు వెర్షన్ నుంచి వచ్చాయని వివరించారు. ఈ నేపథ్యంలో చాలా మటుకు టాప్ 10 సినిమాలు.. బహుభాషల్లో విడుదలవుతున్నాయని కపూర్ చెప్పారు. హాలీవుడ్ సినిమాలు కూడా తెలుగు, తమిళం, హిందీ తదితర పలు భారతీయ భాషల్లోకి డబ్ చేస్తున్నారని విశ్లేషించారు. 'అవెంజర్స్ సినిమా బాక్సాఫీస్ ఆదాయాల్లో 40–45 శాతం వాటా హిందీ, తెలుగు, తమిళ వెర్షన్లదే ఉంది. భారీ సినిమాలన్నింటికీ ఇది వర్తిస్తుంది. వాటి బాక్సాఫీస్ ఆదాయాల్లో సగటున 30–35 శాతం వాటా భారతీయ భాషల వెర్షన్ల నుంచే వస్తోంది. 1917 లాంటి చిన్న సినిమాలు ఇంగ్లీష్‌లో మాత్రమే విడుదలవుతున్నాయి' అని కపూర్ చెప్పారు. హాలీవుడ్ చిత్రాలైనా .. బాలీవుడ్ సినిమాలైనా .. పలు భాషల్లో డబ్ చేసి, విడుదల చేస్తుండటం వల్ల టికెట్ల అమ్మకాలు.. తద్వారా బాక్సాఫీస్ ఆదాయాలు పెరుగుతున్నాయి.

### కంటెంటే కింగ్..

అయితే, సినిమాల కలెక్షన్లు పెరగడానికి కారణం పలు భాషల్లో రిలీజ్ చేయడం ఒక్కటే కాదని, కంటెంట్ కూడా బాగుంటేనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని నివేదిక విశ్లేషించింది. స్టార్ హీరోలు, యాక్టర్లతో సంబంధం ఉండటం లేదని వివరించింది. హిందీ సినిమాలు.. కలెక్షన్ల కోసం తొలి వారాంతంపై ఆధారపడటమనేది దశాబ్దపు కనిష్ట స్థాయికి పడిపోయినట్లు పేర్కొంది. కేవలం తొలి వారానికే పరిమితం కాకుండా కంటెంట్ ఎంత బాగుంటే .. అంత ఎక్కువ కాలం థియేటర్లలో సినిమాలు నడుస్తున్నాయి. 'గతంలో కహానీ (2012), క్వీన్ (2014) వంటి సినిమాల్లో పెద్ద స్టార్లు లేకపోయినా అవి రూ. 100 కోట్ల వసూళ్లు సాధించడం గొప్పగా ఉండేది. కానీ 2019 విషయం తీసుకుంటే పెద్ద స్టార్లెవరూ లేని చిచోరే సినిమా అలవోకగా రూ. 140 కోట్ల వసూళ్లు సాధించింది. సల్మాన్ ఖాన్ వంటి పెద్ద స్టార్ నటించిన దబాంగ్ 3కి సరిసమాన స్థాయిలో నిల్చింది. కనుక స్టార్లు లేరు కాబట్టి సినిమా వసూళ్లు అంతంత మాత్రంగానే ఉంటాయని అనుకోవడానికి లేదు. కంటెంట్ బాగుంటే చాలు.. ఆదాయాలకు ఆకాశమే హద్దుగా ఉంటోంది' అని కపూర్ చెప్పారు. స్టార్ యాక్టర్ల సినిమాలకు సాధారణంగానే మంచి ఓపెనింగ్స్ వస్తుంటాయి. కానీ, ఎంత కాలం నిలదొక్కుకోగలుగుతాయి అన్నది కంటెంట్ పైనే ఆధారపడి ఉంటోంది. దబాంగ్ 3 ఓపెనింగ్స్ రూ. 32 కోట్లతో పోలిస్తే చాలా తక్కువగా రూ. 6 కోట్ల ఓపెనింగ్స్‌తో ప్రారంభమైన చిచోరే.. ఆ తర్వాత అదరగొట్టే కలెక్షన్లు సాధించడం దీనికి నిదర్శనమని కపూర్ తెలిపారు.

- టికెట్ల అమ్మకాలు రయ్‌రయ్...
- గతేడాది 103 కోట్ల టికెట్లు సేల్
- రూ.10,948 కోట్లు వెచ్చించిన సినీ ప్రియులు



### 2019 టాప్-10 సినిమాలు

| సినిమా | రూ. కోట్లలో |
|---|---|
| ఎవెంజర్స్ ఎండ్ గేమ్ | 433 |
| వార్ | 357 |
| సాహో | 349 |
| కబీర్ సింగ్ | 321 |
| యురి | 283 |
| హౌస్‌ఫుల్4 | 239 |
| గుడ్ న్యూస్ | 230 |
| భరత్ | 229 |
| మిషన్ మంగళ్ | 224 |
| సైరా | 196 |
| ది లయన్ కింగ్ | 184 |

(దేశీయంగా అన్ని భాషల్లో కలిపి గ్రాస్ బాక్సాఫీస్ కలెక్షన్లు)

### బాక్సాఫీస్‌పై 'లిప్‌స్టిక్' ప్రభావం: కేర్

బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరగడానికి 'లిప్‌స్టిక్' ఎఫెక్ట్ కూడా కారణమని రేటింగ్ ఏజెన్సీ కేర్ రేటింగ్స్ ఒక నివేదికలో పేర్కొంది. ఆర్థిక మందగమన పరిస్థితుల్లో వినియోగదారులు .. విలాసవంతమైన భారీ కొనుగోళ్ల జోలికి పోకుండా.. చిన్న చిన్న సరదాలపై ఖర్చు పెట్టే ధోరణిని లిప్‌స్టిక్ ఎఫెక్ట్‌గా వ్యవహరిస్తారు. ఈ ప్రభావంతో పాటు కంటెంట్ మెరుగుపడటం, సినిమా టికెట్లపై జీఎస్‌టీ తగ్గడం కూడా పరిశ్రమకు తోడ్పడిందని కేర్ రేటింగ్స్ పేర్కొంది. సినిమాల సగటు ఆదాయం 15 శాతం పెరిగి రూ. 23 కోట్లకు చేరిందని వివరించింది. 2018లో ఏడు చిత్రాలు రూ. 100 కోట్ల వసూళ్ల మార్కును దాటగా 2019లో ఇది పదమూడుకు పెరిగింది. గతేడాది ఆరు బాలీవుడ్ సినిమాలు రూ. 200 కోట్ల మార్కును అధిగమించాయి.

### విదేశీ మార్కెట్ల లోనూ దూకుడు..

**వ**సూళ్లు పెంచుకోవడానికి చిత్రాలను విదేశీ మార్కెట్లలోనూ పెద్ద ఎత్తున విడుదల చేసే ధోరణి పెరిగిందని కేర్ రేటింగ్స్ తెలిపింది. బాలీవుడ్ స్టార్ ఆమిర్‌ఖాన్ నటించిన దంగల్ సినిమా దీనికి నిదర్శనంగా పేర్కొంది. మొత్తం రూ. 1,968 కోట్ల వసూళ్లలో నాలుగింట మూడొంతుల వాటా విదేశీ మార్కెట్ల నుంచే వచ్చిందని వివరించింది. చైనా, మధ్య ప్రాచ్యం, తైవాన్, మలేషియా, హాంకాంగ్, బ్రిటన్ వంటి దేశాల్లో భారతీయ సినిమాలకు ఆదరణ ఉంటోందని కేర్ రేటింగ్స్ తెలిపింది. మరోవైపు, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ వంటి ఓవర్–ది–టాప్ కంటెంట్ ప్లాట్‌ఫాంల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. థియేటర్లలో టికెట్ల రాబడి కూడా పెరగడం గమనార్హమని వివరించింది. ఒకదాని వల్ల మరో దానికి ముప్పు రాకుండా ఓటీటీ ప్లాట్‌ఫాంలు, థియేటర్లు కలిసి ముందుకు సాగగలవని పేర్కొంది.




## 2023 నాటికి 90 కోట్ల ఇంటర్నెట్ యూజర్లు: సిస్కో



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశంలో 2023 నాటికి ఇంటర్నెట్ వినియోగదార్ల సంఖ్య 90.7 కోట్లకు చేరుతుందని, జనాభాలో ఈ సంఖ్య 64 శాతమని సిస్కో తన వార్షిక ఇంటర్నెట్ నివేదికలో వెల్లడించింది. 2018లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 39.8 కోట్లుగా ఉందని తెలిపింది. ఈ సంఖ్య జనాభాలో 29 శాతమని వివరించింది. '2018లో 76.3 కోట్ల మొబైల్ యూజర్లు ఉంటే, 2023 నాటికి 96.6 కోట్లకు చేరతారు. నెట్‌వర్క్‌డ్ డివైసెస్ 150 కోట్ల నుంచి 210 కోట్లకు చేరతాయి. మొబైల్ కనెక్టెడ్ డివైసెస్ 110 కోట్ల నుంచి 140 కోట్లకు ఎగుస్తాయి. వైర్డ్/వైఫై కనెక్టెడ్ డివైసెస్ 36 కోట్ల నుంచి 69.7 కోట్లను తాకనున్నాయి. నెట్‌వర్క్‌డ్ డివైసెస్‌లో స్మార్ట్‌ఫోన్ల వాటా 42 శాతం నుంచి 38 శాతంగా ఉండనుంది. 2023 నాటికి నెట్‌వర్క్‌డ్ డివైసెస్‌లో 66% స్మార్ట్‌ఫోన్లు, 34% వైఫై/వైర్డ్ కనెక్టెడ్ డివైసెస్ ఉంటాయి. 5జీ కనెక్షన్లు 6.72 కోట్లకు చేరతాయి. మొబైల్ కనెక్షన్లలో 4జీ వాటా 53.1%కి ఎగుస్తుంది. 2018లో ఇది 37.9%గా ఉంది. 2018లో 2,070 కోట్ల మొబైల్ యాప్స్ డౌన్లోడ్ అయితే, 2023 నాటికి ఈ సంఖ్య 4,620 కోట్లకు చేరుతుంది. మొబైల్ కనెక్షన్ సగటు స్పీడ్ 4.6 ఎంబీపీఎస్ నుంచి 16.3 ఎంబీపీఎస్‌కు చేరనుంది' అని తన నివేదికలో వివరించింది.

## కోవిడ్ భయం.. పసిడి పరుగు!

- అంతర్జాతీయంగా ఏడేళ్ల గరిష్ట స్థాయి...
- ఔన్స్ 1,614 డాలర్లపైకి అప్



**న్యూయార్క్:** చైనాలో మొదలై ప్రపంచాన్ని భయపెడుతున్న కోవిడ్–19 (కరోనా) వైరస్... ఇన్వెస్టర్లను బంగారంవైపు తిరిగేలా చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తమ పెట్టుబడులకు బంగారమే సురక్షిత మార్గమని వారు భావిస్తున్నారు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్– న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్– నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర బుధవారం ట్రేడింగ్ ఒక దశలో 1,614.25 డాలర్లను తాకింది. ఇది ఏడేళ్ల కనిష్టస్థాయి. ఈ వార్త రాసే 10 గంటల సమయంలో 1,607 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కరోనా భయాలతో ప్రపంచ వృద్ధిరేటు పడిపోయే పరిస్థితి ఉందని, ఈ పరిస్థితులను ఎదుర్కొనడానికి పలు ఆర్థిక వ్యవస్థలు ఉద్దీపన చర్యలు చేపడతాయని వస్తున్న వార్తలు కూడా పసిడికి బలంగా మారుతున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే, ఏడాదిలో పసిడి ధర 21 శాతం (1,277.9 డాలర్లు కనిష్టం) పెరిగింది.

**దేశీయంగానూ జోరు...**

ఇక అంతర్జాతీయ ధోరణికి తోడు, పెళ్లిళ్ల సీజన్ దేశంలో పసిడి ధరను పెంచుతోంది. డాలర్ మారకంలో రూపాయి బలహీన ధోరణి కూడా పసిడికి బలమవుతోంది. ఈ వార్తరాసే సమయానికి దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర లాభాల్లో రూ.41,470 వద్ద ట్రేడవుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో ఈ మెటల్ ధర రూ.462 ఎగసి రూ.42,339కు ఎగసింది.

## భారత పర్యటనలో వాణిజ్య ఒప్పందం కష్టమే..!

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** వాణిజ్యం విషయంలో భారత్ సరిగ్గా వ్యవహరించడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోపు భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం కుదరకపోవచ్చన్న సంకేతం ఇచ్చారు. ''భారత దేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకోవచ్చు. అయితే, తర్వాత కోసం దీన్ని పొదుపు చేస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు. ఈ నెల 24, 25 తేదీల్లో ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నారా? అన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. భారత్ మాతో సరిగ్గా వ్యవహరించడం లేదన్నారు. ఇతర దేశాలతో వాణిజ్యం విషయంలో అమెరికా ప్రయోజనాలే పరమావధిగా ట్రంప్ వ్యవహరిస్తున్న విషయం ప్రపంచానికి తెలిసిందే. ఈ విషయంలో భారత్‌ను మొదటి నుంచి ఆయన విమర్శిస్తూనే ఉన్నారు. ''భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం. ఇది మాకు అవసరం. అయితే, ఎన్నికల ముందు ఇది జరుగుతుందా అన్నది నాకు తెలియదు. కానీ, భారత్‌తో మాకు భారీ వాణిజ్య ఒప్పందం అయితే ఉంటుంది'' అంటూ కర్ర విరగకుండా, పాము చావకుండా రీతిలో ట్రంప్ చెప్పారు. ఇరు దేశాల మధ్య ట్రంప్ పర్యటనలో భాగంగా డీల్ కుదురొచ్చన్న అంచనాలు ఇప్పటికే వ్యక్తమవుతుండడం గమనార్హం. భారత్‌తో వాణిజ్య చర్చలకు నాయకత్వం వహిస్తున్న అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైట్‌జర్ ట్రంప్‌తో కలసి భారత పర్యటనకు రాకపోవచ్చని తెలుస్తోంది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, లైట్‌జర్ మధ్య ఇప్పటికే పలు విడతలుగా వాణిజ్య చర్చలు జరిగాయి. తమ దేశ పాడి, పౌల్ట్రీ, వైద్య పరికరాలకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది.

**మోదీ అంటే ఎంతో ఇష్టం..:** ప్రధానమంత్రి మోదీ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు ట్రంప్. భారత పర్యటనలో భాగంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నూతనంగా నిర్మించిన మొతెరా స్టేడియంలో ఇరు దేశాధి నేతలతో భారీ సభ జరగనుంది. దీని గురించి ట్రంప్ మాట్లాడుతూ..''విమానాశ్రయం, కార్యక్రమం జరిగే ప్రాంతానికి మధ్య ఏడు మిలియన్ల ప్రజలు ఉంటారని ఆయన (మోదీ) నాకు చెప్పారు. ఆ స్టేడియం ప్రపంచంలోనే అతి పెద్దదిగా అవతరించనుంది. ఇది ఎంతో ఆసక్తి కలిగిస్తోంది. మీరు కూడా దీన్ని ఆనందిస్తారు'' అని మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ట్రంప్ అన్నారు.

## ఏపీలో 300 కోట్లతో మెడికవర్ విస్తరణ

- సింహపురి హాస్పిటల్స్ టేకోవర్...
- వైజాగ్, శ్రీకాకుళంలో కొత్తగా ఆసుపత్రుల ఏర్పాటు..



మీడియా సమావేశంలో అనిల్ కృష్ణ, ఫ్రెడ్రిక్ రాగ్ మార్క్, జో ర్యాన్, జాన్ స్టబ్బింగ్‌టన్ (ఎడమ నుంచి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వైద్య సేవల రంగంలో ఉన్న పోలండ్‌కు చెందిన మెడికవర్ ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. తాజాగా నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిని కొనుగోలు చేసింది. 250 పడకల సామర్థ్యమున్న ఈ కేంద్రం కోసం సంస్థ రూ.150 కోట్లదాకా వెచ్చించింది. దీనిని 750 పడకల స్థాయికి చేర్చనున్నారు. మెడికవర్‌గా పేరు మారిన ఈ ఆసుపత్రిని సంస్థ బుధవారం ఆవిష్కరించింది. ఇక్కడే క్యాన్సర్ చికిత్సకై రూ.30 కోట్ల వ్యయంతో 100 పడకల అత్యాధునిక ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించనున్నారు. ఇది సెప్టెంబరుకల్లా కార్యరూపంలోకి రానుందని మెడికవర్ సీఈవో ఫ్రెడ్రిక్ రాగ్‌మార్క్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రియాశీలక ప్రభుత్వంతోపాటు ఉత్సాహవంతుడైన ముఖ్యమంత్రి ఉన్నారంటూ ఆయన కితాబిచ్చారు. ఏపీలో తొలుత విస్తరణ చేపడతామన్నారు. తొలి దశలో ఏపీలో రూ.300 కోట్లు పెట్టుబడి పెడతామని చెప్పారు.

**ఇప్పటివరకు రూ. 700 కోట్లు..**

యూరప్ హెల్త్‌కేర్ దిగ్గజం మెడికవర్‌కు ఇప్పటికే వైజాగ్‌లో రెండు ఆసుపత్రులు ఉన్నాయి. ఇక్కడ 200 పడకల హాస్పిటల్‌ను కొత్తగా ఏర్పాటు చేయనుంది. దీంతో వైజాగ్‌లో సంస్థ కేంద్రాల సంఖ్య మూడుకు చేరనుంది. అలాగే శ్రీకాకుళంలో 300 పడకలతో హాస్పిటల్ రానుంది. ప్రస్తుతం మెడికవర్‌కు పలు రాష్ట్రాల్లో ఉన్న అన్ని కేంద్రాల్లో కలిపి 2,500 పడకలు ఉన్నాయి. వైజాగ్, శ్రీకాకుళం కొత్త కేంద్రాల చేరికతో 3,000 పడకల స్థాయికి చేరనుంది. అనంతపూర్, కడపలోనూ మెడికవర్ సెంటర్లు రానున్నాయి. హైదరాబాద్‌లో 500 బెడ్స్ గల ఓ ఆసుపత్రి కొనుగోలుకై చర్చలు జరుపుతున్నట్టు మెడికవర్ ఇండియా చైర్మన్ అనిల్ కృష్ణ వెల్లడించారు. భారత్‌లో మెడికవర్ ఇప్పటి వరకు రూ.700 కోట్లు వెచ్చించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికవర్ సీఎఫ్‌వో జో ర్యాన్, సీవోవో జాన్ స్టబ్బింగ్‌టన్ పాల్గొన్నారు.

## విమానాల్లో నెల్కో వైఫై సర్వీసులు

### విస్తార ఎయిర్‌లైన్స్‌తో ప్రారంభం

**న్యూఢిల్లీ:** టాటా గ్రూప్‌లో భాగమైన నెల్కో సంస్థ తాజాగా విమానాల్లో వైఫై సర్వీసులు ఆవిష్కరించింది. విస్తార ఎయిర్‌లైన్స్ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తేనుంది. తద్వారా విస్తార.. దేశీయంగా ఇన్–ఫ్లయిట్ వైఫై సర్వీసులు (ఐఎఫ్‌సీ) అందిస్తున్న తొలి విమానయాన సంస్థ కానుంది. పానసోనిక్ ఏవియోనిక్స్‌తో కలిసి ఈ సేవలు అందిస్తున్నట్లు నెల్కో ఎండీ, సీఈవో పీజే నాథ్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఐఎఫ్‌సీకి భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.



**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**

- లిక్విడిటీ ప్రవాహంతోనే మార్కెట్ ర్యాలీ
- మీడియం టర్మ్‌కు ఈ షేర్లు బెస్ట్!
- నెల రోజుల కోసం టాప్ సిఫార్సులు
- వొడాఫోన్‌ఐడియాకు ఎలాంటి ఈక్విటీ విలువాలేదు?

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM

# నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్

- చైనాలో తగ్గిన కొత్త కోవిడ్–19 కేసులు
- 429 పాయింట్ల లాభంతో 41,323కు సెన్సెక్స్
- 134 పాయింట్ల లాభంతో 12,126కు నిఫ్టీ



చైనాలో కోవిడ్–19 బాధిత కొత్త కేసులు తగ్గడం, ఈ వైరస్ వల్ల సంభవించే ఆర్థిక ప్రభావాన్ని తట్టుకోవడానికి తగిన తోడ్పాటుని స్తామని కేంద్రం అభయమివ్వడంతో బుధవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. టెలికం కంపెనీలకు ఒకింత ఊరటినిచ్చేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేయనున్నదని వార్తలు కూడా సానుకూల ప్రభావం చూపాయి. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరగడం కలసివచ్చింది. డెయిరీ రంగానికి రూ.4,460 కోట్లు కేటాయించడం, పంటల బీమా పథకంలో మార్పులు చేయడం, కిసాన్ క్రెడిట్ కార్డ్‌ల ద్వారా తీసుకున్న రుణాలపై వడ్డీ రాయితీని 2% నుంచి 2.5 శాతానికి పెంచడం వంటి కేబినెట్ నిర్ణయాల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో 4 రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. ముడి చమురు ధరలు వరుసగా ఏడో రోజూ ఎగిసినా, మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. సెన్సెక్స్ 429 పాయింట్ల లాభంతో 41,323 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు ఎగసి 12,126 వద్ద ముగిశాయి. ఛత్రపతి శివాజీ జన్మదినం సందర్భంగా ఫారెక్స్ మార్కెట్ పనిచేయలేదు.

**సానుకూల అంతర్జాతీయ సంకేతాలు...**

చైనాలో కరోనా వైరస్ కొత్త కేసులు తగ్గిన నేపథ్యంలో అక్కడి 80% ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి కార్యకలాపాలు మొదలయ్యాయి. ఈ సానుకూలతల కారణంగా ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లోనే ముగిశాయి.

**వొడాఫోన్ ఐడియా జోరు...**

వొడాఫోన్ ఐడియా షేర్ 38% లాభంతో రూ.4.19 వద్ద ముగిసింది. ఈ కంపెనీ ఇచ్చిన గ్యారంటీలను బ్యాంక్‌లు స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉండకపోవచ్చన్న వార్తల కారణంగా ఈ షేర్ జోరుగా పెరిగింది. ఇంట్రాడేలో 48% లాభంతో రూ.4.49ను తాకింది.

**మళ్లీ ఆల్‌టైమ్ హైకి ఐఆర్‌సీటీసీ**

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజమ్ కార్పొరేషన్ షేర్ జోరు కొనసాగుతోంది. ఇంట్రాడేలో రూ.1,873 వద్ద ఆల్‌టైమ్ హైను తాకిన ఈ షేరు చివరకు 12 శాతం లాభంతో రూ.1,831 వద్ద ముగిసింది. ఈ షేర్‌తో పాటు పలు షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి. హిందుస్తాన్ యూనిలివర్, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, పీవీఆర్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, దివీస్ ల్యాబ్స్, ఐనాక్స్ లీజర్, నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్, ఏయూ స్మాల్ ఫైనాన్స్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్, గ్రాన్యూల్స్ ఇండియా, అబాట్ ఇండియా తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

**సగం లాభాలు ఆ మూడు షేర్ల వల్లే**

రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 1–2.6 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. సెన్సెక్స్ మొత్తం 429 పాయింట్ల లాభంలో ఈ మూడు షేర్ల వాటాయే దాదాపు సగం (227 పాయింట్లు) ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,141 |
| ఎన్‌ఎస్‌ఈ | 37,908 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 17,39,011 |
| ఎఫ్‌ఐఐ | -191 |
| డీఐఐ | 590 |

# కన్సల్టెన్సీ సేవల్లోకి బిజినెస్ డాక్టర్స్

**కంపెనీలకు వ్యాపార సహకార సేవలు**



మీడియాతో కౌశిక్, శ్రీనివాస రావు, రాధిక రావు (ఎడమ నుంచి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంపెనీలకు బిజినెస్ సపోర్ట్ సేవలు అందిస్తున్న యూకేకు చెందిన బిజినెస్ డాక్టర్స్ తాజాగా కన్సల్టెన్సీ సర్వీసుల్లోకి ప్రవేశించింది. చిన్న, మధ్యతరహా కంపెనీలకు నిధుల సమీకరణ, బాకీల వసూళ్ల విషయంలో ఈ కంపెనీ మధ్యవర్తిగా వ్యవహరించనుంది. బ్యాంకుల వద్దకు వస్తున్న దరఖాస్తుల్లో 60 శాతం మాత్రమే రుణాలకు అర్హత సాధిస్తున్నాయని ఫండింగ్ డాక్టర్ కో–ఫౌండర్ మాయిరి శ్రీనివాస రావు తెలిపారు. కంపెనీ పార్ట్‌నర్స్ కౌశిక్, ఎం.రాధిక రావుతో కలిసి బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. అవసరమైన నిధుల సేకరణకు చిన్న, మధ్యతరహా కంపెనీలకు తోడ్పాటు అందిస్తామన్నారు. రూ.10 లక్షలు మొదలకుని రూ.100 కోట్ల వరకు ఫండ్ సేకరణకు సాయపడతామని చెప్పారు. ఇప్పటికే 500 దాకా కంపెనీలకు సేవలు అందించామని వెల్లడించారు. వీటి విలువ రూ.1,000 కోట్లని తెలిపారు.

## కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో 26 శాతానికి ప్రమోటర్ల వాటా

**న్యూఢిల్లీ:** కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో ప్రమోటర్ల వాటాను 26 శాతానికి తగ్గించుకోవడానికి ఆర్‌బీఐ తుది ఆమోదం తెలిపింది. కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో ప్రస్తుతం ప్రమోటర్ గ్రూప్‌నకు 29.96 శాతం వాటా ఉంది.

## ఏప్రిల్ ఒకటి నుంచి యూరో–6 ఇంధనం

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత శుద్ధమైన పెట్రోల్, డీజిల్ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి రానుంది. భారత్ స్టేజ్–6 ఉద్గార నిబంధనల(యూరో– 6 గ్రేడ్‌కు సమానం)కు అనుగుణంగా ఉండి, అతి తక్కువ సల్ఫర్‌ను విడుదలచేసే ఈ ఇంధనాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) వెల్లడించింది.

## ఎస్‌వీసీ బ్యాంక్ లోన్ మేళ

**ముంబై:** కేవలం ఎస్‌ఎంఎస్ ద్వారా అందుబాటు వడ్డీ రేట్లకే రుణాలను మంజూరీ చేస్తున్నట్లు ‘ఎస్‌వీసీ కో–ఆపరేటీవ్ బ్యాంక్’ ప్రకటించింది. 9820620454 నెంబర్‌కు లోన్ అని మెసేజ్ పంపించడం లేదా 18003132120 నెంబర్‌కు ఫోన్ చేసి రుణాలను పొందవచ్చని వివరించింది. బంగారంపై రుణాలు, మార్జిగేజ్ లోన్, ఆఫీస్ పర్చేజ్ రుణాలను కేవలం 10.5 శాతానికే అందిస్తుండగా.. విద్యా రుణాన్ని 10.65 శాతానికి, కార్ లోన్ 8.9 శాతానికి అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 31 వరకు ఈ రుణ మేళా కొనసాగుతుందని బ్యాంక్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ డీజీఎం సంజయ్ రాజోరియా ప్రకటించారు.




- **డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వద్ద నమోదైన అంకుర సంస్థల (స్టార్టప్స్) సంఖ్య 28,000 చేరుకున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ బుధవారం వెల్లడించారు.**

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,110 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,100 | 0 |
| వెండి (కిలో) | 51,800 | ▲ 1200 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,630 | ▲ 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,650 | ▲ 390 |
| వెండి (కిలో) | 51,800 | ▲ 1200 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,650 | ▲ 400 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,480 | ▲ 240 |
| వెండి (కిలో) | 47,860 | ▲ 160 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,450 | ▲ 540 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,480 | ▲ 500 |
| వెండి (కిలో) | 49,000 | ▲ 1500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,910 | ▲ 420 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,650 | ▲ 390 |
| వెండి (కిలో) | 49,200 | ▲ 1100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**ముడిచమురు...** (బ్యారెల్)

| | రాత్రి 11.30కు | మంగళవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 53.62 | $ 52.29 |
| బ్రెంట్ | 59.28 | $ 57.75 |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 20-2-2020

| | |
|---|---|
| విశాఖ | 390–00 |
| చిత్తూరు | 403–00 |
| వరంగల్ | 342–00 |
| విజయవాడ | 355–00 |
| గోదావరి | 355–00 |
| 19–2–2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 340–00 |

# ఆర్థికమంత్రితో మిట్టల్, బిర్లాల భేటీ



**న్యూఢిల్లీ:** టెలికం దిగ్గజాలు– భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ సునిల్ భారతీ మిట్టల్, వొడాఫోన్ ఐడియా చైర్మన్ కుమార మంగళం బిర్లాలు బుధవారం ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో సమావేశమయ్యారు. అయితే వీరి సమావేశ వివరాలు మాత్రం అధికారికంగా వెల్లడికాలేదు. సమావేశ వివరాలు తెలియజేయడానికి కూడా వారు నిరాకరించారు. నార్త్‌బ్లాక్‌లో ఆర్థికమంత్రితో వీరు ఇరువురూ ఒకేసారి సమావేశమయ్యారా? లేక విడివిడిగా సమావేశమయ్యారా? అన్న అంశం తెలియరాలేదు. ఆర్థికమంత్రితో సమావేశానికి ముందు మిట్టల్ టెలికం కార్యదర్శి అన్షు ప్రకాష్‌తో కూడా సమావేశమయ్యారు.

**ఏజీఆర్‌పై చర్చించలేదు: మిట్టల్**

నార్త్‌బ్లాక్ నుంచి బయటకు వచ్చిన తర్వాత మిట్టల్ విలేకరులతో మాట్లాడారు. ఆయన చెప్పిన అంశాలు క్లుప్తంగా పరిశీలిస్తే, ‘‘టెలికం రంగం గడచిన మూడున్నర సంవత్సరాలుగా తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఈ రంగం స్థిరత్వంపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఏజీఆర్‌పై సుప్రీం కోర్టు తీర్పు అనంతర పరిణామాలు, సంబంధింత బకాయిలపై చర్చించలేదు. దేశాభివృద్ధిలో టెలికం పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ డిజిటల్ ఇండియా అజెండాలో కూడా ఈ రంగం పాత్ర గణనీయమైనది. ఏజీఆర్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బకాయిల చెల్లింపు అంశాన్ని ఎయిర్‌టెల్ ఇప్పటికే ప్రకటించింది’’.

**ఇంకా చెప్పాల్సింది ఏమీ లేదు: బిర్లా**

మరోవైపు నార్త్‌బ్లాక్ నుంచి వెలుపలకు వచ్చిన బిర్లా.. టెలికం రంగంపై ఉన్న ఒత్తిళ్ల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ, ‘‘విషయం అందరికీ తెలిసిందే. కొత్తగా చెప్పేదేమీ లేదు’’ అన్నారు. వొడాఫోన్ ఐడియా వంటి టెలికం కంపెనీలకు చావోరేవో పరిస్థితి ఉందా? అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ, ‘‘వేచి చూద్దాం’’ అని అన్నారు. బకాయిల చెల్లింపులకు ఒక నిర్దిష్ట కాలపరిమితులను కోరుతూ కంపెనీ ప్రభుత్వాన్ని ఆశ్రయించిందా? ప్రభుత్వ నుంచి హామీ ఏదైనా వచ్చిందా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ఆయన నిరాకరించారు. మంగళవారం బిర్లా టెలికం కార్యదర్శితో సమావేశమయిన సంగతి తెలిసిందే.

## ఆటో మందగమనం ముగిసిన సంకేతాల్లేవు: ఫిచ్ రేటింగ్స్

దేశ ఆర్థిక రంగం నిదానించడం, డిమాండ్ బలహీనపడడం ఆటోమొబైల్ వాహన విక్రయాలపై ఇక ముందూ ప్రభావం చూపుతాయని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. డిసెంబర్ క్వార్టర్ అమ్మకాల్లో స్వల్ప పురోగతి ఉన్నప్పటికీ, అది పండుగల సందర్భాల్లో ఇచ్చిన తగ్గింపు ఆఫర్ల ఫలితమేనని తేల్చింది. ఈ పరిస్థితి కొనసాగకపోవచ్చని అభిప్రాయపడింది.

## రుణ సంస్థలకు సవాళ్లు కొనసాగుతాయ్

దేశంలో రుణ సంస్థలకు నిర్వహణా పరమైన సవాళ్లు కొనసాగుతాయని ఫిచ్ రేటింగ్స్ నివేదిక ఒకటి తెలిపింది. వృద్ధి మందగమనం, కఠిన ద్రవ్య పరిస్థితుల వంటి అంశాలను ఇందుకు కారణంగా పేర్కొంది. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమలు, రియల్టీ విభాగాల్లో రుణ నాణ్యతా ఇబ్బందులు తీవ్రమయ్యే అవకాశం ఉంది.

## భారత ఆటోమొబైల్ పరిశ్రమపై కరోనా ప్రభావం: ఇక్రా

కోవిడ్–19 చైనా, ఆగ్నేయాసియా ప్రాంతంలో ఎక్కువ కాలం పాటు కొనసాగితే అది భారత ఆటోమొబైల్ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని, సరఫరా వ్యవస్థలో అవరోధాలు ఏర్పడతాయని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారులకు విడిభాగాల సరఫరా పరంగా ఈ ప్రాంతాలు కీలక భూమిక పోషిస్తున్నట్టు తెలిపింది. దేశీయ ఆటో విడిభాగాల దిగుమతుల్లో చైనా వాటా 27 % ఉంది.

**రాష్ట్రీయం**

# నా మిసెస్‌కే ఫైన్ వేశా..!

**పరిశుభ్రత పాటించకపోతే చర్యలు: మంత్రి ఎర్రబెల్లి**



**సాక్షి, జనగామ:** ‘పరిశుభ్రత పాటించని వారిపై ఫైన్ వేయాలి.. భయం లేక పోతే మార్పు రాదు.. ఇటీవల మా ఊరికి పోయిన.. ఊర్లో తిరిగిన.. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయడంతో మొదట నా మిసెస్‌కే ఫైన్ వేశా.. అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామలో బుధవారం కలెక్టర్ నిఖిల అధ్యక్షతన జరిగిన ‘పల్లె ప్రగతి–పట్టణ ప్రగతి’ప్రజాప్రతినిధుల సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. మంత్రుల కంటే కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉన్నాయి.. గ్రామాల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సర్పంచ్, ఉప సర్పంచ్‌లపై వారు చర్యలు తీసుకుంటారు.. అధికారులే పని చేయకపోతే ముఖ్యమంత్రి కేసీఆర్ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు రూ.330 కోట్లను విడుదల చేస్తున్నామని తెలిపారు. నాటే మొక్కల్లో 85 శాతం బతకాలని, లేకపోతే సర్పంచ్‌ల పదవి ఊడిపోతుందని హెచ్చరించారు.

## విద్యార్థులపై తేనెటీగల దాడి

**24 మందికి అస్వస్థత.. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స**

**గీసుకొండ:** వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో 24మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది.. విద్యార్థులను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయడంతో గీసుకొండ సీఐ శివరామయ్య సిబ్బందితో కలసి మరికొందరు విద్యార్థులను పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అందించగా.. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇళ్లకు వెళ్లిపోయినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

## ఎనిమిదో రోజు మేడారం ఆదాయం రూ.59.22 లక్షలు

**హన్మకొండ కల్చరల్ :** మేడారం శ్రీ సమ్మక్క – సారలమ్మ మహా జాతరలో అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కొనసాగుతోంది. గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీల లెక్కిపులో భాగంగా బుధవారం ఎనిమిదో రోజు 56 హుండీలు లెక్కించగా రూ.59,22,000 ఆదాయం నమోదైనట్లు ఈఓ రాజేందర్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం ఆదాయం రూ.10.89 కోట్లకు చేరింది.

# కంచర్ల X కోమటిరెడ్డి ‘అభివృద్ధి’పై రగడ

- పల్లె ప్రగతికి నిధులేవీ?: రాజగోపాల్ రెడ్డి
- మా పథకాలు కనిపించడం లేదా?: భూపాల్ రెడ్డి
- పంచాయతీరాజ్ సమ్మేళనంలో ఎమ్మెల్యేల వాగ్వాదం



బుధవారం నల్లగొండలో జరిగిన సమ్మేళనంలో రాజగోపాల్‌రెడ్డి, కంచర్ల వాగ్వాదం

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** నల్లగొండలో బుధవారం జరిగిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అభివృద్ధి విషయమై ఇరువురు నేతల మధ్య మాటల యుద్ధం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఒక దశలో ఆగ్రహంతో ఊగిపోయిన కంచర్ల.. రాజగోపాల్ రెడ్డిపై దూసుకొచ్చేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు.. సమ్మేళనంలో మొదట రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అనుకున్న విధంగా అభివృద్ధి జరగడం లేదని, పల్లె ప్రగతికి సరిపడా నిధులు రావడం లేదని విమర్శించారు. గ్రామాల్లో అనుకున్న విధంగా పరిశుభ్రత కార్యక్రమాలు జరగడం లేదని, దోమల కారణంగా మునుగోడు నియోజకవర్గంలో ముగ్గురు డెంగీ బారిన పడి మృతి చెందారని తెలిపారు. స్పందించిన భూపాల్‌రెడ్డి.. ‘రైతు బంధు, రైతు బీమాలాంటి సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల కళ్లకు కనిపించడం లేదా..? ఇంతకు ముందున్న మంత్రి ఏం చేశాడు’.. అంటూ ఆవేశంగా ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎన్నో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు జరుగుతున్నాయని అనడంతో టీఆర్ఎస్ కార్యకర్తలు లేచి భూపాల్ అన్న జై అంటూ నినాదాలు చేశారు. దీనిపై జోక్యం చేసుకున్న రాజగోపాల్‌రెడ్డి.. వ్యక్తిగతంగా మాట్లాడుతున్నావంటూ భూపాల్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకోబోయారు. దీనికి భూపాల్‌రెడ్డి ‘నువ్వు మాట్లాడినంత సేపు నేను అడ్డుకోలేదు.. నేను మాట్లాడుతున్నాను నువ్వు మాట్లాడవద్దు’అని అన్నారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి.. రాజ్‌గోపాల్‌రెడ్డిపైకి దూసుకురావడంతో పోలీసులు సముదాయించి కూర్చోబెట్టారు.

**సమ్మేళనం రాజకీయాల కోసం కాదు**

మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఇది రాజకీయాల కోసం పెట్టుకున్న సమ్మేళనం కాదని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలంటూ అంతకుముందు జరిగిన వాగ్వాదంపై వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఆకలి, దరిద్రాన్ని పారదోలిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో ఆకలి చావులు, ఆత్మహత్యలు, కటిక చీకటి, నెర్రెలు బారిన నేలలు, వలసలు ఉండేవని గుర్తు చేశారు. కేసీఆర్ దూరదృష్టితో పరిస్థితి మారిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

## రూ.48 లక్షల విలువైన మిర్చి విత్తనాలు సీజ్

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం జిల్లా రూరల్ మండలం గుదిమళ్ల గ్రామ శివారులోని మిరప విత్తనాల తయారీ కేంద్రంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.48 లక్షల విలువ చేసే మిర్చి విత్తనాలను సీజ్ చేశారు. ఖమ్మంలోని బోస్ సెంటర్‌కు చెందిన వెంకట నర్సయ్య అనుమతులు లేకుండా మిరప విత్తనాలను తయారు చేస్తున్నాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి విత్తనాలను సీజ్ చేశారు. వీరిలో యజమాని వెంకట నర్సయ్య పరారీలో ఉండగా.. గుమస్తా బాబును అదుపులోకి తీసుకున్నారు.



మిర్చి విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

# ‘ఏడుపాయల’ జాతరకు వేళాయె..

- రేపటి నుంచి వన దుర్గాభవాని జాతర
- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు



జాతరకు ముస్తాబవుతున్న ఏడుపాయల

**సాక్షి, మెదక్:** రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన వనదుర్గా భవాని జాతరకు ఏడుపాయల క్షేత్రం ముస్తాబైంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి సుమారు 10 లక్షల మంది వరకు భక్తులు వస్తారనే అంచనాతో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 21న తెల్లవారుజామున నాలుగు గంటలకు వనదుర్గామాతకు పంచామృతాభిషేకం, అలంకారం, సహస్ర కుంకుమార్చనతో వేద పండితులు జాతర ప్రారంభించనున్నారు. కాగా, ఆర్టీసీ కూడా తగిన ఏర్పాట్లు చేసింది. మెదక్, హైదరాబాద్, సంగారెడ్డి, నారాయణ్ ఖేడ్, జహీరాబాద్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్ డిపోల పరిధిలో మొత్తం 200 బస్సులను అందుబాటులో ఉంచారు. మెదక్ నుంచి ప్రతి 5 నిమిషాలకు ఓ బస్సు ఏడుపాయలకు నడిపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 900 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

# ‘నాయనమ్మ’కు చేయూత

**సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్**

- రూ. 50 వేల ఆర్థిక సాయం
- మనవరాలికి ఉద్యోగం ఇస్తామని హామీ



గంగవ్వ కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

**సాక్షి, కామారెడ్డి:** తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలను పెంచేందుకు ఆ నాయనమ్మ పడుతున్న కష్టాలపై కలెక్టర్ శరత్ స్పందించారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈనెల 15న ‘సాక్షి’ ఫ్యామిలీ పేజీలో ‘ముగ్గురు పిల్లలు.. నాయనమ్మ’ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. ఆ కథనాన్ని చదివిన కలెక్టర్.. భిక్షాటన చేస్తూ పిల్లలను పెంచుతున్న నాయనమ్మ గంగవ్వ కష్టాలను తెలుసుకుని చలించిపోయారు. బుధవారం సాయంత్రం కామారెడ్డి జిల్లా కుప్రియాల్ గ్రామం నుంచి గంగవ్వతో పాటు ఆమె మనవరాళ్లు చామంతి, వసంత, మనవడు శ్రీకాంత్‌లను తన చాంబర్‌కు పిలిపించుకున్నారు. తక్షణ సహాయంగా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెద్దమ్మాయి చామంతికి ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించారు. వసంతను కేజీబీవీలో, శ్రీకాంత్‌ను గురుకుల కళాశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గంగవ్వకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయిస్తామన్నారు.



## మార్చి 15న రాష్ట్రానికి అమిత్ షా

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్చి 15న రాష్ట్రానికి రానున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న పౌరసత్వ చట్ట సవరణ (సీఏఏ) అనుకూల సభలో ఆయన పాల్గొంటారు. ఇటీవలే రాష్ట్ర కేబినెట్ సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన నేపథ్యంలో అమిత్ షా ఈ సభలో ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారన్నది సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. కాగా, ఈ సభకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా హాజరవుతారని సమాచారం.



**ఆరు జిల్లాలపై ఏకాభిప్రాయం**

పార్టీ జిల్లా అధ్యక్షుల ఎంపికపై చర్చించేందుకు మంగళవారం రాత్రి ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులతో బీజేపీ రాష్ట్ర ప్రధాన నేతలు సమావేశమయ్యారు. చర్చల అనంతరం మంచిర్యాల, కరీంనగర్, వేములవాడ, మెదక్, రంగారెడ్డి, గద్వాల జిల్లాల అధ్యక్షుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం. అధ్యక్షులుగా ఎవరిని నియమించారన్న విషయాన్ని గోప్యంగానే ఉంచారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వివక్ష

### శ్రీనివాస్‌గౌడ్ కేబినెట్‌లో ఉండి వృథా: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు వివక్షకు గురవుతున్నారని, వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 2018లోనే నూతన పీఆర్సీ అమల్లోకి వస్తుందని ఉద్యోగులు భావించినా మళ్లీ డిసెంబర్ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని దుయ్యబట్టారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో బుధవారం మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాలను శాసించాయని, ఇప్పుడు కనీసం ఉద్యోగ సంఘాలు మాట్లాడే పరిస్థితి కూడా లేదని వాపోయారు. అదనంగా జిల్లాలను ఏర్పాటు చేసి పోస్టులు సృష్టించకుండా ఉన్న ఉద్యోగులతోనే అన్ని పనులను చేయించుకుంటున్న ప్రభుత్వం ఆ ఉద్యోగులకు ఏమిస్తోందని ప్రశ్నించారు. కనీసం పీఆర్సీ సాధ్యం కాకపోతే ఏపీలో ఇచ్చిన విధంగా మధ్యంతర భృతి అయినా ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసే విషయంలో ఉద్యోగ సంఘాల నుంచి మంత్రిగా ఎదిగిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. శ్రీనివాస్‌గౌడ్ కేబినెట్‌లో ఉండి వృథా అని, ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వంలో ఉండే హక్కు ఆయనకు లేదన్నారు.





## కాలుష్యం నుంచి మూసీ నదిని కాపాడండి

### ఉపరాష్ట్రపతికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి

**సాక్షి, న్యూఢిల్లీ:** కాలుష్యం నుంచి మూసీ నదిని కాపాడాలని, నమామీ గంగే తరహాలో మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు విన్నవించారు. ఫార్మా పరిశ్రమల ఔషధ అవశేషాలతో, పారిశ్రామిక వ్యర్థాలతో నదీ జలాలు తీవ్రంగా కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ నుంచి మురుగునీరు మూసీ నదికి చేరుతుండటంతో నది మరింత కలుషితమైందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళన చేపట్టేలా కేంద్రానికి సూచనలు చేయాలని కోరారు. దీన్ని జాతీయ నదీ సంరక్షణ ప్రణాళికలో చేర్చేలా చూడాలని విన్నవించారు.

## గవర్నర్‌తో అమెరికన్ బృందం భేటీ



**సాక్షి, హైదరాబాద్:** గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో అమెరికాకు చెందిన 14 మంది ప్రతినిధుల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో భేటీ అయింది. వాటర్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనానికి ఈ బృందం వచ్చింది.



బుధవారం హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు ముగింపు సందర్భంగా ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

# వైద్య పరికరాల దిగుమతులకు చెక్ పెట్టాలి

- మెడికల్ డివైజెస్ పార్కుతోనే అది సాధ్యం: కేటీఆర్
- ఐదు కంపెనీలకు భూ కేటాయింపు పత్రాల అందజేత
- ఘనంగా ముగిసిన బయో ఆసియా సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో ఉపయోగించే వైద్య పరికరాల్లో 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఈ పరిస్థితి మారాలని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వైద్య పరికరాల తయారీకి పెద్దపీట వేయాలని, వైద్య పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తమ ప్రభుత్వం కూడా ఆ దిశగా ముందడుగు వేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఫాబా) సంయుక్తంగా నిర్వహించిన బయో ఆసియా సదస్సు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరికరాల తయారీ కేంద్రంలో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన ఐదు కంపెనీలకు భూ కేటాయింపు పత్రాలను అందజేశారు. ఐబీఎం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బయో ఆసియా వంటి సదస్సులు ప్రభుత్వాలకు, పరిశ్రమలకు ఎన్నో గొప్ప అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. జీవశాస్త్ర రంగంలో దేశం ఉన్నత స్థాయికి చేరేందుకు ఇదే తగిన సమయమని అన్నారు. 17వ బయో ఆసియా సదస్సుకు 35 దేశాల నుంచి సుమారు 2,000 మంది హాజరయ్యారని, వచ్చే ఏడాది ఈ సదస్సు మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాలన్నది తమ ఆకాంక్ష అని చెప్పారు.

### స్టార్టప్ కంపెనీలకు అవార్డులు...

బయో ఆసియాలో భాగంగా స్టార్టప్ కంపెనీల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఐదు కంపెనీలకు కేటీఆర్ నగదు బహుమతులు అందజేశారు. పోటీ కోసం వందల దరఖాస్తులు రాగా నిశిత పరిశీలన తరువాత 70 కంపెనీలకు బయో ఆసియాలో తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించామని, సీసీఎంబీ, టెక్ మహేంద్ర వంటి దిగ్గజ సంస్థల నుంచి ఎంపిక చేసిన న్యాయనిర్ణేతలు 5 కంపెనీలను విజేతలుగా నిర్ణయించారని ఐఐటీ ప్రొఫెసర్ రమేశ్ లోకనాథన్ తెలిపారు. నవజాత శిశువులకు వచ్చే కామెర్ల రోగానికి సమర్థంగా చికిత్స అందించే పరికరాన్ని అభివృద్ధి చేసిన 'హీమ్యాక్ హెల్త్ కేర్', డాక్టర్ల అపాయింట్‌మెంట్లు మొదలుకొని, వారి లభ్యత, ప్రత్యేకతల గురించి టెలిఫోన్‌లో వివరించేందుకు ఉపయోగపడే కృత్రిమ మేధ ఆధారిత సేవలను అందిస్తున్న 'కాల్‌జీ', అత్యాధునిక టెక్నాలజీ ఆధారంగా పనిచేసే ఊతపు కర్రలు (క్రచెస్)ను తయారు చేసిన 'ఫ్లెక్సీ మోటివ్స్', శరీర అవయవాల త్రీడీ మోడళ్లను తయారు చేయడం ద్వారా గాయాలు, శస్త్రచికిత్సల నుంచి కోలుకునే సమయాన్ని సగానికి తగ్గించే 'లైకాన్ త్రీడీ', ఈ–కోలీ బ్యాక్టీరియాలో మార్పులు చేయడం ద్వారా మందుల తయారీకి అవసరమైన ప్రొటీన్లను ఉత్పత్తి చేయగల 'ఆంకోసెమిస్'కు ఈ అవార్డులు లభించాయి.

# రబీ సాగు.. బహుబాగు

- 28 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- రికార్డు స్థాయిలో 165 శాతానికి చేరిన విస్తీర్ణం
- సాధారణంకంటే 11.13 లక్షల ఎకరాలు అధికం
- పప్పు ధాన్యాల సాగు 4.10 లక్షల ఎకరాలు
- రిజర్వాయర్లలో జలకళ... బావులు, బోర్లలో నీరు

**సాక్షి, హైదరాబాద్:** రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఏటికేటికీ రికార్డు స్థాయిలో విస్తీర్ణం పెరుగుతోంది. రబీలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 31.95 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 42.07 లక్షల (132%) ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయి. సాధారణంకంటే అన్ని పంటలు అధికంగా 10.12 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో తీరికలేకుండా ఉన్నారు. రబీలో అత్యధికంగా వరి ఇరగదీసేలా సాగవుతోంది. రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 17.07 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 28.20 లక్షల (165%) ఎకరాల్లో నాట్లు పడినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలో తెలిపింది. అంటే సాధారణంకంటే ఏకంగా 11.13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు అధికంగా పడడం విశేషం. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 2.97 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.10 లక్షల (137%) ఎకరాల్లో సాగయ్యాయి. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.65 లక్షల (124%) ఎకరాల్లో సాగైంది. రిజర్వాయర్లు, బోర్లు, బావులు, చెరువుల్లో జలకళ ఉట్టిపడుతుండటంతో రబీ సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోందని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి.

### నిర్మల్ జిల్లాలో 205 శాతం..

నిర్మల్ జిల్లాలో సాగు విస్తీర్ణం రెట్టింపు మించిపోయింది. ఆ జిల్లాలో రబీలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.34 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.75 లక్షల (205%) ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇది రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1.29 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు అక్కడ 2.55 లక్షల (197%) ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 32 జిల్లాలకుగాను, 21 జిల్లాల్లో వంద శాతానికి పైగా విస్తీర్ణంలో పంటలు సాగవడం విశేషం. 8 జిల్లాల్లోనైతే 150 శాతానికిపైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అవి వనపర్తి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, పెద్దపల్లి, సిరిసిల్ల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు కావడం గమనార్హం. అతి తక్కువగా సాగైన జిల్లాల్లో సంగారెడ్డి (55%), మేడ్చల్ (58%) ఉన్నాయి. అనేక జిల్లాల్లో భారీగా పంటలు సాగు అవుతుండటంతో రాష్ట్రంలో ఈసారి ఇబ్బడిముబ్బడిగా పంటల ఉత్పత్తి జరుగుతుందని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2019–20 ఖరీఫ్, రబీ సీజన్లలో వరి ఏకంగా 1.48 కోట్ల మెట్రిక్ టన్నులు పండుతుందని అంచనా వేసింది. ఖరీఫ్‌లో 89.49 లక్షల మెట్రిక్ టన్నులు పండగా, రబీలో 58.62 లక్షల మెట్రిక్ టన్నులు పండుతుందని సర్కారు అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పరిశీలిస్తే ఖరీఫ్, రబీల్లో 48.09 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అధికంగా పెరగడం విశేషం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏకంగా 79.94 లక్షల మెట్రిక్ టన్నుల వరి అధికంగా పండటం విశేషం. 2014–15 సంవత్సరంలో రాష్ట్రంలో 68.17 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి అయిన సంగతి విదితమే. సాగునీటి ప్రాజెక్టులు ఆచరణరూపం దాల్చడం, నైరుతి రుతుపవనాల వల్ల అధిక వర్షాలు కురవడంతో రబీలో భారీగా పంటలు సాగయ్యాయి.

# విమాన టికెట్ ధరలకు పోటీగా..

**ప్రీమియం రైళ్ల సెకండ్ క్లాస్ టికెట్ రేటు: రూ. 4,800 • అదే ఢిల్లీకి విమానం ధర రూ. 4,500**



> హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఏసీ మొదటి, రెండో తరగతి వెయిటింగ్ లిస్ట్ 50ని మించి ఉంది. తత్కాల్‌లో కూడా టికెట్లు లభించక ప్రయాణికులు ఉసూరుమన్నారు. కిక్కిరిసి ఆ రైలు ఢిల్లీకి పరుగుపెట్టింది.

> బెంగళూరు నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ వచ్చింది. ఫస్ట్ క్లాస్ బోగీలో ఐదుగురు, సెకండ్ క్లాస్ బోగీల్లో 15 మంది ఉన్నారు. మిగతా సీట్లన్నీ ఖాళీ. వెలవెలబోతూ ఈ ప్రీమియం ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ బయల్దేరింది.

> తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ దొరకని ప్రయాణికులు 'రాజధాని' వైపు ఎందుకు చూడలేదు. ప్రత్యామ్నాయంగా అదేరోజు ఈ ప్రీమియం ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉన్నా.. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకునేందుకే ఎందుకు మొగ్గు చూపారు. ఎందుకంటే ఆదాయ వేటలో రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయాలే కారణం.

**సాక్షి, హైదరాబాద్:** విమానయాన సంస్థలో అమల్లో ఉన్న డైనమిక్ ఫేర్ విధానాన్ని ప్రారంభించిన రైల్వే శాఖ ఇప్పుడు చేతులు కాల్చుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిమాండ్‌ను బట్టి టికెట్ ధరను సవరించటమే ఈ విధానం. ఎక్కువ డిమాండ్ ఉన్న రోజులు, అప్పటికప్పుడు బుక్ చేసుకున్న సందర్భంలో టికెట్ ధర అమాంతం పెరుగుతుంది. ఇంతకాలం పట్టించుకోకుండా మొండిగా ముందుకెళ్లాలన్న ఆ శాఖ ఇప్పుడు ఈ విధానాన్ని పునఃసమీక్షించుకోవాలని చూస్తోంది. ఇటీవల రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ హైదరాబాద్ పర్యటనలో ఈ అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. వెంటనే ఆయన దాన్ని సమీక్షించేందుకు ఢిల్లీలో సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా హైదరాబాద్ నుంచే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఇదీ సంగతి..

హైదరాబాద్ నుంచి ఢిల్లీకి డిమాండ్ లేని సాధారణ రోజుల్లో అడ్వాన్సుగా టికెట్ బుక్ చేసుకుంటే విమాన చార్జీ రూ.4 వేల లోపు ఉంటుంది. అప్పటికప్పుడు బుక్ చేసుకుంటే రూ.ఐదున్నర వేల నుంచి మొదలవుతుంది. అయితే రాజధాని, శతాబ్ది, దురంతో లాంటి ప్రీమియం కేటగిరీ రైళ్లలో మొదటి శ్రేణి, రెండో శ్రేణి టికెట్ ధర కూడా విమాన టికెట్ ధరకు దగ్గరగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో సెకండ్ ఏసీ ధర (డైనమిక్ విధానంలో నిలకడ ఉండదు) దాదాపు రూ.4,800 ఉంటోంది. కొన్ని సందర్భాల్లో రూ.5 వేలు మించుతోంది. పీక్ డిమాండ్ సమయంలో ఫస్ట్‌క్లాస్ చార్జి రూ.7 వేలు పలుకుతోంది. గమ్యం చేరేందుకు ఈ రైలు ప్రయాణ సమయం 22 గంటలు. అంత చార్జి భరించి ఇన్ని గంటలు ప్రయాణించే బదులు, అంతే చార్జి ఉండే విమానంలో 2 గంటల్లో వెళ్లిపోవచ్చు. దీంతో డబ్బున్న వాళ్లు, విమానాల వైపు, సాధారణ ప్రజలు మరో రైలువైపు చూస్తున్నారు. ఫలితంగా రైల్వేకు భారీ నష్టం వాటిల్లుతోంది. రైలు నిర్వహణ ఖర్చులు యథావిధిగా ఉంటుండగా, టికెట్ ఆదాయం మాత్రం నామమాత్రంగా ఉంటోంది. మరో వైపు ఆ రైలు వల్ల మరో రైలును అదే సమయంలో నడిపే అవకాశం లేక ప్రయాణ అవకాశాన్ని కూడా ప్రయాణికులు కోల్పోవాల్సి వస్తోంది.

### ఆ విధానాన్ని మార్చాలి..

ఈ సమస్యకు కారణమవుతున్న డైనమిక్ ఫేర్ విధానాన్ని మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. తాజాగా రైల్వే బోర్డు పరిధిలోని ఆలిండియా రైల్వే ప్యాసింజర్స్ సర్వీస్ కమిటీ సభ్యుడు వెంకటరమణి, రైల్వే ప్యాసింజర్స్ ఎమినిటీస్ కమిటీ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డితో కలసి మంగళవారం రైల్వే మంత్రి పీయూష్ గోయెల్‌తో దీనిపై చర్చించారు. తాము ఈ కేటగిరీ రైళ్ల తీరును అధ్యయనం చేసి వాస్తవాలు గుర్తించామని, ఈ రైళ్లు ఖాళీగా పరుగుపెట్టడం వల్ల రైల్వేకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, డైనమిక్ ఫేర్ విధానాన్ని సడలిస్తే ఆ రైళ్లు కూడా నిండుతాయని పేర్కొన్నారు. ఫలితంగా ప్రయాణికులకు ప్రయాణ సదుపాయాలు పెరగటమే కాకుండా రైల్వే ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు.



# నిరసన చెప్పేందుకిచ్చే అనుమతుల్లోనూ జాప్యమా?

- హోం, డీజీపీలకు నోటీసులు
- విచారణను 3 వారాలకు హైకోర్టు వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** రాజ్యాంగంలోని 14, 19 అధికరణల ద్వారా ప్రజలకు లభించిన నిరసన తెలియజేసే హక్కు అమలుకు రాష్ట్రంలో పోలీసులు అవరోధం కల్పిస్తున్నారని దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నిరసన కార్యక్రమాలు తెలియజేసే హక్కులు అమలు కాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని పేర్కొంటూ మాజీ ఐఏఎస్ అధికారి షఫీకుజ్జమాన్, సయ్యద్ గౌస్ మొహిద్దీన్ ఖాద్రీ దాఖలు చేసిన 'పిల్'లో ప్రతివాదులైన హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ చట్టంలోని సెక్షన్ 30, హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, ఊరేగింపులను నియంత్రించే అధికారం మాత్రమే పోలీసులకు ఉందని, వాటిని నిషేధించడానికి వీల్లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమం చేసేందుకు దరఖాస్తు చేసుకుంటే పోలీసులు నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడమో, గడువు ముగిసే దశలో ఫలానా చోట కాకుండా మరో చోట చేసుకోవాలని సూచన చేసి ఆందోళనకారుల స్ఫూర్తిని నీరుగార్చేలాగనో వారి చర్యలున్నాయని ఆరోపించారు. చివరికి ఏదైనా హోటల్ గదిలో తలుపు మూసుకుని జరుపుకునే సమావేశాలకు కూడా పోలీసుల అనుమతి తీసుకోవాలని నిర్వాహకులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ఎవరైనా దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోగా పోలీసులు అనుమతి ఇచ్చేలా ఉత్తర్వులివ్వాలని 'పిల్'లో కోరారు. 2019 నుంచి దరఖాస్తులు తెప్పించుకుంటే ఎన్నింటిలో పోలీసులు కాలయాపన చేశారో తెలుస్తుందన్నారు. కాగా, ఇదే తరహాలో తాము నిరసన ర్యాలీ, సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని దాఖలైన మరో రిట్ పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారించారు. ధర్నాలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు అనుమతికి తగిన మార్గదర్శకాలను రూపొందించాలని హోం శాఖను ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి విచారణను వాయిదా వేశారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com